ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 179 పేజీలు: 12 వెల: 6.50

**చైనాలో భారీ వరదలు.. 34 మంది మృతి** 9లో

**బీహార్ 'సర్'లో తప్పులుంటే జోక్యం తప్పదు: సుప్రీం**

# ఎపికి సింగపూర్ చేయూత

## అమరావతి అభివృద్ధికి భాగస్వామినవుతాం

వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాలకు సింగపూర్ సాయం

పెట్టుబడులపై సిఎం చంద్రబాబుతో చర్చలు: సింగపూర్ మంత్రి టాన్సీలెంగ్

ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి


సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటనచేశారు. వివిధ రంగాల్లో ఎపి ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రిచేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశంపై ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఎపితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు.
భారత్‌లో అత్యంతవేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఎపిలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే ఎపిలో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకుఆసంస్థలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సిఎం చంద్రబాబుతో చర్చించినట్టు సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 2014-2019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎపి రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో >>2

## ఎఐ, రిసెర్చి, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి 2లో

**ఎఐ సింగపూర్ సంస్థ ప్రతినిధితో సిఎం చంద్రబాబు**


మంగళవారం సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ అయిన దృశ్యం

## సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ

**వివిధ రంగాలలో ఎపితో భాగస్వామ్యంపై చర్చలు**

**విజయవాడ, జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యాన్ని అన్ని రంగాల్లో అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంను కోరారు.అమరావతి రాజధాని నిర్మాణాన్ని సింగపూర్ తరహాలో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికరంగాల్లోను,ఐటి,ఎఐలో విస్తృతంగా రూపొందించాలని భావిస్తున్నామని ఇందుకు సహకరించాలని కోరారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, నారాయణ, టిజి భరత్‌లతో ఆదేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంను కలుసుకున్నారు.ఒక విజన్‌తో ఎపిని ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత్ అత్యంత బలీయమైన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో నిలిచిందన్నారు.,2047 వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా మరింత శక్తివంతంగా నిలుస్తోందన్నారు. ఎపి సింగపూర్ ప్రభుత్వాలుకలిసి వివిధరంగాల్లో పనిచేసే అంశంపై చర్చించారు. ఈ పర్యటనతో >>2

## తెలంగాణలో చదివినా 'నీట్'లో ఎపి విద్యార్థులు స్థానికులే

**- హైకోర్టు స్పష్టీకరణ**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్ సీట్ల భర్తీకి నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను స్థానికులుగా పరిగణించాలంటూ నీట్ పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్ ఇతర రాష్ట్రాల్లో చదువుకున్న విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. నీట్ పరీక్ష రాసేనాటికి విద్యార్థులు వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలనే నిబంధన వల్ల తీరని అన్యాయం జరుగుతోందని >>2

## రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.252 కోట్లు

**గుంతకల్, గుంటూరు డివిజన్లలో కవచ్‌కు రూ. 63 కోట్లు**

**రాజంపేట, జూలై 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అతి ముఖ్యమైన రైల్వేస్టేషన్లో ఒకటైన రాజమండ్రి రైల్వే స్టేషన్ సమగ్ర అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చేందుకు కేంద్ర రైల్వే బోర్డు 252 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి కృషితో నిధుల కేటాయింపుకు మార్గం సుగమమైంది. అంతేకాకుండా దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ విభాగం గురువారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. 252.74 కోట్ల అంచనా వ్యయంతో పనులను చేపట్టనున్నారు. 36 నెలల్లోగా ఈ పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే టెండర్లలో షరతు విధించింది. వైజాగ్ నుంచి కొత్త రైల్వే జోన్ ప్రారంభం కాక మునుపే దక్షిణ మధ్య రైల్వే రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిర్ణయం తీసుకోవడం >>2

## అండమాన్ నికోబార్ దీవుల్లో భూకంపం

**న్యూఢిల్లీ,జూలై 29:** అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం వచ్చింది. సోమవారం అర్ధరాత్రి 12.11 గంటల సమయంలో 6.5 తీవ్రతతో భూమి కంపించింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు చోటుచేసుకున్నాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. నికోబార్ దీవుల్లో భూకంప కేంద్రం ఉన్నదని పేర్కొంది. సునామీ వచ్చే ప్రమాదం ఏమీ లేదని తెలిపింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు. మరోవైపు బంగాళా ఖాతంలో కూడా భూమి కంపించందని, దీని తీవ్రత 6.3గా నమోదయిందని ఎన్‌సీఎస్ తెలిపింది. దీనిప్రభావంతో సముద్ర తీరంలోని దీవుల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని వెల్లడించింది. ఇక ఇండోనేషియాలో కూడా భూకంపం వచ్చింది.

## ఏనుగుల సంచారంపై వాట్సప్ గ్రూపులు

**ప్రజలను అప్రమత్తం చేయండి..**

**డ్రోన్ల ద్వారా ఏనుగుల గుంపుల పరిశీలన**

**అధికారులకు సూచించిన డి.సిఎం పవన్**



**విజయవాడ,జూలై29,ప్రభాతవార్త ప్రతినిధి:** పంటలకు నష్టం కలిగించడంతో పాటు,ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగులు సంచరించే మార్గాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. గ్రామాలవారీగా వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని ఆదేశించారు.
ఎపిలోని పలు ప్రాంతాల్లో గజరాజులు అలజడి సృష్టిస్తున్నాయి. ఎప్పుడు ఏ గ్రామంలోకి వెళ్లి దాడులు చేస్తాయోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు కొన్నిసార్లు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. చిత్తూరు, ఈ క్రమంలో అటవీ శాఖ సిబ్బంది గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అటవీ శాఖ ఉన్నతాధికారు >>2



**ప్రపంచం మొత్తం మద్దతిస్తే కాంగ్రెస్ విమర్శిస్తోంది**

**నెహ్రూ తప్పిదాల వల్లనే 33వేల చ.కిమీ కోల్పోయాం**

**కాంగ్రెస్ ఇక హెడ్‌లైన్స్‌కే పరిమితం**

**పాక్‌కు గట్టిగా బుద్ధిచెబుతామని వాన్స్‌కు చెప్పా**

**పార్లమెంటులో ప్రధాని మోడీ**

## 'ఆపరేషన్ సిందూర్'కు ఇది విజయోత్సవం

**న్యూఢిల్లీ,జూలై 29:** ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత్ విజయోత్సవాలు జరుపుకుంటున్నదని, ఈవర్షాకాల పార్లమెంటు సమావేశాలు విజయోత్సవాలకు ప్రతీక అని ప్రధానిమోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో మాట్లాడిన ప్రధానిమోడీ ప్రపంచంమొత్తం భారత్‌కు మద్దతిస్తే కాంగ్రెస్ మాత్రం విమర్శలుచేసిందని మండిపడ్డారు.కేవలం 23 నిమిషాల్లోనే మన సైనికులు ఉగ్రవాదులను, వారి స్థావరాలను మట్టిలో కలిపేసారని, ఈ విజయంతో 140 కోట్లమంది భారతీయులు తనపై ఎంతో నమ్మకం ఉంచారని అన్నారు. ఆపరేషన్ సింధూర్ నిలిపివేయాలని ప్రపంచంలో ఏ దేశాధినేత కూడా నాకు చెప్పలేదని, మే 9వ తేదీ అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ కూడా ఫోన్‌లోమాట్లాడారని, పాక్ భారీ స్థాయిలో దాడిచేయబోతోందని అలర్ట్‌చేసారని, పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని తాను బదులిచ్చినట్లు మోడీ చెప్పారు. పాక్‌కు ఎవరు సాయంచేసినా ఊరుకునేది లేదని స్పష్టంచేసామని, పాక్ ఎలాంటి దాడిచేసినా మేం చూసుకుంటామని జెడివాన్స్‌కు తానుచెప్పినట్లు మోడీ వెల్లడించారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెపుతామని అందువల్లనే పాక్‌కు చిరకాలం గుర్తుండిపోయేవిధంగా గుణపాఠం చెప్పామన్నారు. పాకిస్తాన్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ అర్థరాత్రిఫోన్‌చేసి దాడులు ఆపాలని బతిమిలాడితేనే ఆపరేషన్‌సింధూర్ నిలిపామని మోడీ పార్లమెంటులో చెప్పారు. ప్రపంచంలోని 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చాయన్నారు. అణుబెదిరింపులుచెల్లవని పాక్‌ను హెచ్చరించామని పాకిస్తాన్‌కు కేవలం మూడే మూడుదేశాలు అండగా నిలిచాయన్నారు. పాక్ మళ్లీ ఎలాంటి కుట్రలుచేసినా ఆపరేషన్ సిందూర్‌కొనసాగుతుందన్నారు. ధీటుగా బదులిస్తామన్నారు. పహల్గాంలో దాడిచేసిన ఉగ్రవాదులను కూడా మట్టుబెట్టామని, ఆపరేషన్ మహదేవ్‌తో ఏరివేసామన్నారు.

**కాంగ్రెస్ పత్రికల్లో హెడ్‌లైన్స్‌కే పరిమితం..!**

56 ఇంచ్‌ల చెస్ట్ ప్రధాని ఎక్కడా అంటూ కాంగ్రెస్‌పార్టీ తనపై విమర్శలుచేసిందని, పహల్గాం దాడి విషయంలో కాంగ్రెస్ రాజకీయాలుచేసిందని, ఉగ్రదాడి తర్వాత కాంగ్రెస్ నన్ను విమర్శించడమే పనిగా పెట్టుకుందని ప్రధాని ధ్వజమెత్తారు. ప్రపంచం మొత్తం కాంగ్రెస్‌ను కాదని, దేశానికి మద్దతిచ్చిందని, కాంగ్రెస్ హెడ్‌లైన్స్‌లో ఉండొచ్చేమోకానీ, ప్రజల హృదయాల్లో మాత్రం >>2

## ఆగస్టు 25 నుంచి 31 దాకా రేషన్ కార్డుల పంపిణి

**కొత్తగా 9 లక్షల మందికి పైగా కార్డులు మంజూరు: మంత్రి నాదెండ్ల**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకూ రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఎక్కడా అక్రమాలకు ఆస్కారం లేకుండా స్మార్ట్ కార్డులు రూపొందించామని తెలిపారు. కొత్తగా 9 లక్షల మందికిపైగా రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఈకార్డులు అందిస్తారని, ఇంకా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తారని చెప్పారు. అలానే కొత్తగాఇచ్చే రేషన్‌కార్డులు అన్ని ఉచితంగా అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.
జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్రం సాయంతో రాష్ట్ర ప్రభుత్వం రైస్ కార్డులు ఇస్తుందని మంత్రి మనోహర్ తెలిపారు. పాత విధానాన్ని మార్చి స్మార్ట్ రైస్ కార్డులు ఇచ్చేందుకు డిజిటలైజ్ చేశామని, అలానే కార్డులపై ఎక్కడా నాయకుల ఫొటోలు ఉండకుండా డిజైన్ చేశామని వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మాత్రమే ఈ కార్డులో ఉండనున్నాయని అన్నారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులను డెబిట్, క్రెడిట్ కార్డు సైజులలో ఇవ్వబోతున్నామని, ఇంకా కుటుంబ సభ్యుల వివరాలు, కార్డు నెంబర్‌లు బాగా కనిపించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా ట్రాన్సక్షన్ జరిగిన వెంటనే సెంట్రల్ ఆఫీసులో తెలుస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 29,786 రేషన్ షాపులలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఇవ్వాలని ఆదేశిస్తున్నామని మంత్రి తెలిపారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు 26వ తేదీ నుంచి 30వ తేదీల మధ్య సరుకులు హోం డెలివరీ చేస్తామని



అన్నారు. దీపం పథకంలో ఎలాంటి లోపం లేకుండా 3 ఆయిల్ కంపెనీలతో ప్రతి వారం సమీక్షలు చేస్తున్నామని చెప్పారు. రెండవ విడతలో ఈ రోజు వరకూ 93 లక్షల 86 వేల మందికి డెలివరీ ఇచ్చామని అలానే లబ్దిదారులు దీపం 2 పథకాన్ని ఈ నెల 31వ తేదీలోపు వినియోగించుకోవాలని సూచించారు.




## సిఎం సింగపూర్ పర్యటన వ్యక్తిగత ప్రయోజనాలకే

**మహిళలకు ఇచ్చిన హామీలు విస్మరించిన చంద్రబాబు: మాజీ సిఎం జగన్**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాల కోసమే సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్ళారని వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు.చంద్రబాబు స్వప్రయోజనాలు,అక్కడి బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడానికే సింగపూర్ వెళ్లారన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రులబృందం సింగపూర్ పర్యటనపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేసారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పిఎసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన అని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే.. రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు.. ఇంతకన్నా పచ్చిమోసం ఉంటుందా? అని జగన్ కూటమి ప్రభుత్వ నేతలను నిలదీశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంవల్ల పిల్లల చదువులు మానేసే పరిస్థితులు వచ్చాయి. గత వైఎస్సార్సీ ప్రభుత్వం ఐదేళ్లలో అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లో సిఎం చంద్రబాబు అందులో 52శాతం చేశాడు. ఏ పథకం లేదు, ఏ స్కీమూ లేదు.. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు.. అంతా దోచుకుంటున్నారు.
వైఎస్సార్సీ పార్టీ తరఫున త్వరలో యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయవచ్చు అని జగన్ అన్నారు. పలానా వ్యక్తి, పలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని చెప్పొచ్చు.. ఆధారాలుకూడా ఆ యాప్‌లో పెట్టొచ్చు.. ఆ ఆధారాలన్నీకూడా అప్‌లోడ్ చేయొచ్చు.. ఆకంప్లైంట్ ఆటోమే >>2

## తెరుచుకున్న 'సాగర్' గేట్లు

**జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం**


మంగళవారం నాగార్జున సాగర్‌లో 26 క్రస్టుగేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**విజయపురిసౌత్, జులై 29 ప్రభాతవార్త:** దాదాపు 18 ఏళ్ల తర్వాత నాగార్జునసాగర్ జలాశయంలో అద్భుతం జరిగింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద కారణంగా నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్లు ఇవాళ తెరచుకున్నారు. ఎగువ శ్రీశైలం నుంచి భారీ వరద ప్రవాహం పోటెత్తడంతో మంగళవారం ఉదయం 11 గంటలకు నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా తెలంగాణ మంత్రులు నీటిని విడుదల చేశారు. భారీ నీటి పారుదల, పౌరసరఫరాల, ఆహార శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల, మైనార్టీ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నీటి విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనుకున్నదానికంటే ముందే >>2

30-7pg2exHMNWJQE.qxd:30-7pg2exHMNWJQE.qxd 01/01/01 9:26 AM Page 1





మంగళవారం శ్రీశైలం డ్యాం 1-7 గేట్ల నుండి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

# శ్రీశైలం జలాశయానికి భారీగా పెరిగిన వరద నీరు

## 7 గేట్లతో దిగువ సాగర్‌కు నీటి తరలింపు

**శ్రీశైలంప్రాజెక్టు,జులై29,ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయంకు భారిగా వరద నీటి ప్రవాహా వేగం ఊపందుకుంది.దీనితో డ్యాం ఇంజనీర్లు రెడియల్ క్రస్ట్‌గేట్ల సంఖ్యాను పెంచి దిగువ సాగర్‌కు నీటిని తరలించడం జరుగుతుంది.నాగార్జునుడి చెంతకు ఉప్పొంగుతూ బిరబిరా సాగిపోతుంది.శ్రీశైలం డ్యాంకు ఉన్న 12 రెడియల్ క్రస్ట్‌గేట్ల కాగా వాటిలో 7 రెడియల్ క్రస్ట్‌గేట్లను తేరచి ఒకోక్క గేటు 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి దిగువ సాగర్‌కు స్పిల్ వే గుండా 1,90,099 క్యూసేక్యుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.క్రస్ట్‌గేట్ల నుండి రివ్వున ఎగిసిపడుతూ ముందుకు దూసుకుపోతుంది.జలదారలతో కదం త్రోక్కుతూ మంచు జల్లులతో పర్యాటకులను పలకరిస్తుంది.గంగమ్మ చిరుజల్లుల పలకరింపులతో శ్రీశైలం డ్యాం వద్ద సందర్శకులు సందడి చేస్తున్నారు.కొండకోనల నడుమ కృష్ణమ్మ పరుగులిడుతూ శ్రీశైలం రిజర్వయర్ వద్దకు చేరుకుంటుంది.ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం డ్యాం నీటిమట్టం 882.60 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 203.8907 టియంసిలుగా ఉంది.ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల క్రస్ట్‌గేట్ల నుండి 1,19,064 క్యూసేక్యుల నీరు,విధ్యుత్ ఉత్పత్తి అనంతరం 27,395 క్యూసేక్యుల నీరు,సుంకేసుల నుండి 1,22,326 క్యూసేక్యుల నీరు ఇన్‌ఫ్లోగా శ్రీశైలం డ్యాంకు వచ్చిచేరుతుంది.కాగా శ్రీశైలం కుడిగట్టు జలవిధ్యుత్ కేంద్రం నుండి ఉత్పత్తి అనంతరం 30,397 క్యూసేక్యుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.అదే విధంగా ఎడమగట్టు విధ్యుత్ కే ంద్రం నుండి ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసేక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.

# వాట్సప్ గ్రూపులు

>> లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.
మంగళవారం ఉదయం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో గజరాజుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. 11 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతూ కళ్యాణి డ్యామ్ సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు తొక్కివేశాయని తెలిపారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ అధికారులకు పలు సూచనలు చేశారు. డిఎఫ్ కార్యాలయాలు, పిసిసిఎఫ్ కార్యాలయం పర్యవేక్షించాలన్నారు. గజరాజుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలిచ్చారు. కర్ణాటకతో మాట్లాడి 4 కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చింది. ప్రాణ ఆస్తినష్టం కలిగిస్తున్న గజరాజుల గుంపును అటవీ ప్రాంతాల్లోకి తరిమి కొట్టగలిగేవి కుంకీ ఏనుగులు. ప్రత్యేక శిక్షణ పొందిన వాటిని కుంకీ ఏనుగులుగా పరిగణిస్తారు. అడవిలో తిరిగే గజరాజుల గుంపు నుంచి వేరుపడి ఒంటరైన, కొన్ని ప్రత్యేక లక్షణాలున్న ఏనుగులను గుర్తించి వాటిని బంధిస్తారు. ఇందుకోసం తక్కువ వయసున్న, మగ ఏనుగులనే ఎంపిక చేసుకుంటారు. బంధించి తీసుకొచ్చిన వాటిని శిక్షణ శిబిరాలకు తరలిస్తారు. అక్కడ ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో వాటిని పెడతారు. తొలుత ఏనుగులను శాంతింపజేస్తారు. వాటి ప్రవర్తనను బట్టి నెమ్మదిగా శిక్షణ మొదలుపెడతారు. మొదట మావటీలు వాటికి చేరువై వివిధ రకాల సంకేతాల్ని వాటికి అలవాటు చేస్తారు. అలా అలవాటయ్యాక చిన్న చిన్న ఆదేశాలు ఇవ్వడం మొదలుపెడతారు. వాటిని పాటిస్తే చెరకు, బెల్లం అందిస్తూ మచ్చిక చేసుకుంటారు. క్రమంగా మావటీలకు, గజరాజులకు మధ్య అనుబంధం ఏర్పడుతుంది. ఆ తర్వాత కుంకీ ఏనుగులను ఎన్‌క్లోజర్ నుంచి బయటకు తెచ్చి అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్తారు. అక్కడ అడవి ఏనుగులు వీటిని చూసి కలవరపడుతున్నాయా? లేదా? వాటి ప్రవర్తన ఎలా ఉంది? తదితర అంశాలు గమనించి వెనక్కి తీసుకొస్తారు. శిక్షణలో ఈ కీలక దశ దాటాక వాటిని ఒంటరిగా అడవిలో వదిలేస్తారు. తిరిగి వాటంతట అవే శిక్షణ శిబిరానికి వచ్చేస్తే అవి పూర్తిగా కుంకీ ఏనుగులుగా మారినట్లే. కేరళ, తమిళనాడు, కర్ణాటక,రాష్ట్రాల్లో కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాలున్నాయి.

# సింగపూర్‌లో అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంపై మంత్రి నారాయణ అధ్యయనం

## డెల్ టెక్నాలజీస్ ప్రతినిధులతో మంత్రి సమావేశం

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణంలో పలు అంశాల్లో సింగపూర్ మోడల్ ను ఫాలో అవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇప్పటికే రాజధాని మాస్టర్ ప్లాన్ సింగపూర్ ప్రభుత్వం అందించింది...దీంతో పాటు ఏపీలో సుస్థిర పట్టణాభివృద్ధి సాధించేందుకు అవసరమైన అంశాలపై మంత్రి నారాయణ సింగపూర్ లో అధ్యయనం చేస్తున్నారు...సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారాయణ సింగపూర్ వచ్చారు.అక్కడి పలు ప్రాంతాలను సందర్శించారు..మంగళవారం ఉదయం సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పుంగోల్ పాయింట్ కేవ్ టౌన్ షిప్ ను మంత్రి నారాయణ సందర్శించారు..పుంగోల్ పాయింట్ కేవ్ సింగపూర్ లోని మొట్టమొదటి ఎకో టౌన్...సముద్ర తీరం లో స్మార్ట్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్,గ్రీన్ మొబిలిటీ,కమ్యూనిటీ కేంద్రంగా నిర్మించిన భారీ హౌసింగ్ ప్రాజెక్ట్ ఇది...సుస్థిర పట్టణాభివృద్ధిలో నూతన విధానాలను పబ్లిక్ హౌసింగ్ కు అనుసంధానం చేయడానికి అవసరమైన వివరాలను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు..భవిష్యత్తులో అమరావతి స్మార్ట్ సిటీలో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిఫ్ అభివృద్ధికి,వాతావరణ అనుగుణమైన ఇళ్ల నిర్మాణాలు,స్మార్ట్ వాటర్ మేనేజ్ మెంట్ కు సంబంధించిన అంశాలను మంత్రి నారాయణ అధ్యయనం చేసారు.పుంగోల్ పాయింట్ కేవ్ హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తీసుకున్న పలు అంశాలను అమరావతి నిర్మాణంలో ఉపయోగపడతాయని మంత్రి నారాయణ అన్నారు.ఇకమధ్యాహ్నం సింగపూర్ లోని డెల్ టెక్నాలసీస్ కార్యాలయాన్ని మంత్రి నారాయణ సందర్శించారు..అమరావతి స్మార్ట్ సిటీని బ్లూ గ్రీన్ సిటీగా నిర్మించాలని ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.దానికి తగినట్లుగానే మాస్టర్ ప్లాన్ కూడా రూపకల్పన చేసి నిర్మాణాలు చేస్తుంది ప్రభుత్వం...అయితే అమరావతిలో నిర్మాణాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,ఇతర నగరాలతో పోటీపడేలా నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై డెల్ టెక్నాలజీస్ ప్రతినిధులు మంత్రి నారాయణకు వివరించారు.

# సిఎం చంద్రబాబు నేడు 4వ రోజు సింగపూర్ పర్యటన

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడంలోనూ, రాష్ట్రాభివృద్ధిలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం కోసం సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాల్గొవ రోజైన బుధవారం వివిధ సంస్థలుసింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు కొనసాగించనున్నారు. ఉదయం 7:30 గంటలకు క్యాపిటాలాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) సీఈవో సంజీవ్ దాస్‌గుప్తాతో రియల్ ఎస్టేట్, అర్బన్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ పార్క్‌లలో పెట్టుబడులపై చర్చిస్తారు. ఉదయం 8 గంటలకు మండాయ్ వైల్డ్‌లైఫ్ గ్రూప్ సీఈవో మైక్ బార్క్‌లేతో భేటీ కానున్నారు. ఎకోటూరిజం, బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధి, వైల్డ్‌లైఫ్ ఎడ్యుకేషన్ మోడల్స్‌పై చర్చిస్తారు. ఉదయం 8:30 గంటలకు ఎస్‌ఎంబీసీ బ్యాంక్‌ఇండియా డివిజన్, మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలు, లిక్విడిటీ మోడల్స్‌పై చర్చిస్తారు. ఉదయం 9 గంటలకు టెమసెక్ కంపెనీ జాయింట్ హెడ్–పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్ దినేశ్ ఖన్నాతో భేటీ కానున్నారు. పబ్లిక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఎడ్యుకేషన్‌హెల్త్ ఫండింగ్‌పై సహకారాన్ని కోరనున్నారు. ఉదయం 10 గంటలకు సింగపూర్ విదేశాంగ మంత్రి డాక్టర్ వివియన్ బాలకృష్ణన్‌తో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. భారత్–సింగపూర్ సంబంధాలు, తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం అంశాలు చర్చకు రానున్నాయి. ఉదయం 11 గంటలకు నేషనల్ సెక్యూరిటీ హోం అఫైర్స్ మంత్రి కే. షణ్ముగంతో విందు సమావేశం జరగనుంది. సెక్యూరిటీ కెపాసిటీ బిల్డింగ్, పోలీస్ ట్రైనింగ్, ఇంటర్నేషనల్ కోఆపరేషన్ అంశాలు చర్చకు వస్తాయి. మధ్యాహ్నం 1:30 గంటలకు సెంబ్‌క్రాప్ సీఓఓ చార్లెస్ కోతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు.

# ఎఐ, రిసెర్చి, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి

**విజయవాడ, జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని దృఢ నిశ్చయంతో ఉన్న సిఎం చంద్రబాబు నాయుడు తన సింగపూర్ పర్యటనలో ఇందుకోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పర్యటన 3వ రోజైన మంగళవారం ఎఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణవల్లితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో ఎఐ సింగపూర్ భాగస్వామ్యంగా పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఎఐ శిక్షణా కార్యక్రమాలు, ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాములు, స్కిల్ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్ అమలు చేయాలని సిఎం ప్రతిపాదించారు. ముఖ్యంగా వైద్యం, వ్యవసాయం, విద్య, పౌర సేవల విషయంలో ఏఐ వినియోగంపై ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. టెక్నాలజీ ప్రమోషన్, డీప్ టెక్, ఏఐ రంగంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలపైనా చంద్రబాబుకంకణవల్లి మధ్య చర్చ జరిగింది.

**ఎంఆర్‌ఓ కేంద్రం ఏర్పాటుపై చర్చలు**

ఎస్ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జాన్ లిన్ విలిన్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలను జాన్ లిన్ విలిన్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఎంఆర్‌ఓ విధానం ద్వారా కొత్తగా నిర్మించే విమానాశ్రయ ప్రాజెక్టుల్లో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా తీసుకువచ్చిన పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి తెలిపారు. ముఖ్యంగా విమానయాన రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఏపీలో పర్యటించి పెట్టుబడులపై ఆలోచన చేయాలని సీఎం చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎస్ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తర్వలోనే రాష్ట్రానికి తమ కంపెనీ ప్రతినిధులను పంపిస్తామనిచెప్పారు. ఎస్ఐఎ ఇంజినీరింగ్‌వంటి సంస్థల అనుభవం, టెక్నాలజీని ఉపయోగించుకొని ప్రపంచ స్థాయి ఎంఆర్‌ఓ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని... ఈ కేంద్రం ఏర్పాటుకు విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రాంతాలు అనుకూలమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# ఎపికి సింగపూర్ చేయూత

>> కలిసి పని చేశామని మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్ సీ లెంగ్ తనట్వీట్‌లో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై ఎపి అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పని చేయకున్నా.. ఎపిలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఎపి అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పని చేస్తామని టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు.

**ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది**

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఎపి ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఎపి ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్ సీ లెంగ్ కు ఎక్స్ వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఎపి ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. వివిధ రంగాల్లో ఎపి సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్ సీ లెంగ్‌తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సిఎం పేర్కొన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పని చేసేందుకు ఈ చర్చలు దోహద పడతాయన్నారు. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువై నదని సిఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎపి అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. కొన్ని పరిణామాల వల్ల సింగపూర్ భాగస్వామ్యంతో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయని సిఎం అన్నారు. ఎపిలో అద్భుతమైన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నామని సిఎం వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు.

# ఇది విజయోత్సవం

>> కాదని గుర్తుచేసారు. ఆపరేషన్ సిందూర్‌లో మన ఎయిర్‌ఫోర్స్ నూరుశాతం విజయం సాధించాయని, సిందూనుంచి సిందూర్‌వరకూ మన పరాక్రమం ప్రదర్శించామన్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ దేశాన్ని పాలించిందని, మన దేశ సైనిక సామర్థ్యంపై కాంగ్రెస్‌కు నమ్మకంలేదన్నారు. ఒక్క పాక్ క్షిపణి కూడా భారత్‌ను టచ్‌చేయలేదన్నారు. ఉగ్రవాదులను ఎందుకు చంపారని విపక్షాలు అడిగాయని, ఎన్నిగంటలు ఆపరేషన్ మహదేవ్ చేపట్టారని, అందుకు ముహూర్తం కావాలా ఏంటని ఆయన ప్రశ్నించారు.

**నెహ్రూ తప్పులవల్లే పివోకేను కోల్పోయాం...**

ఆనాడు కాంగ్రెస్ చేసిన తప్పులవల్లనే అత్యధిక విస్తీర్ణం కోల్పోయామని, ప్రధాని నెహ్రూ చేసిన తప్పిదాలకు భారత్ 34వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని కోల్పోయామని, పాకిస్తాన్‌కు నెహ్రూ అప్పనంగా అప్పగించారన్నారు. కచ్చతీవును శ్రీలంకకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బహుమతిగా ఇచ్చిందని, పీవోకేను ఎప్పుడు వెనక్కి తెస్తారని అడుగుతున్నారని, ఎప్పటికయినా పిఒకె భారత్‌లో అంతర్భాగమేనని ప్రధానిమోడీ స్పష్టంచేసారు.

# ఎపి విద్యార్థులు స్థానికులే

>> పిటిషన్లు పేర్కొన్నారు. ఈ మేరకు మెడికల్ కౌన్సెలింగ్‌లో తమను రాష్ట్ర స్థానికులుగా పరిగణించాలన్న వారి వినతిని ఆమోదించింది. పిటిషనర్లను రాష్ట్రంలో స్థానిక (లోకల్) అభ్యర్థులుగా పరిగణించాలని డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వ విద్యాలం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. సమగ్ర వివరాల తో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అడ్మిషన్లు తుది తీర్పుకు లోబడి ఉంటాయని షరతు విధించింది.

# రూ.252 కోట్లు

>> విశేషం. కొత్త జోన్ ప్రారంభమయ్యలోపు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పట్టాలెక్కించాలనేది నిర్ణయం అని తెలుస్తోంది. ఏడాదికి 110 కోట్ల రూపాయల ఆదాయం రైల్వేకు అందించే రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ప్రతిరోజు కనీసం 30 వేల నుంచి 40 వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణం చేస్తుంటారు. మూడు ప్లాట్ఫామ్ లతో ఎనిమిది ట్రాక్లు మాత్రమే ఉన్న రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే బోర్డు కేటాయించిన నిధులతో రూపురేఖలే మారనున్నాయనడంలో సందేహం లేదు.
అలాగే గుంతకల్లు డివిజన్, గుంటూరు డివిజన్లో రైల్వే బోర్డు ప్రతిష్టాత్మకంగా రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన కవచ్ పథకాన్ని అభివృద్ధి చేసేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. అందుకు 63.40 కోట్ల నిధులను కేటాయించింది. ఈ పనులను రెండేళ్లలోపు పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లనుకూడా ఆహ్వానించింది. ప్రమాద రహిత రైల్వే డివిజన్లుగా అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి.

## వారం - వర్జ్యం

30-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
షష్ఠి రా.2.43
హస్త రా.9.55
వర్జ్యం : ఉ.6.51-8.38
దు.ఉ.11.49-12.41
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** అకారణంగా వివాదాలు వస్తాయి. ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరం. వస్తు కొనుగోలు.

**వృషభం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. రుణాలు కొంతవరకు తీరుస్తారు. అనుకోని ప్రయాణాలు.

**మిథునం:** అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. ప్రముఖుల నుండి శుభవార్తలు అందుకొంటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** పారిశ్రామిక, సాంకేతిక రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**కన్య :** క్రయవిక్రయాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగావున్న అవసరాలకు డబ్బు అందుతుంది. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** మీమాటే అందరికి వేదవాక్కు కాగలదు. కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. మిత్రుల కలయిక.

**మకరం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కుంభం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా వుండును. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** చిరకాల ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం సింగపూర్‌లోని జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్ సందర్శిస్తున్న సిఎం చంద్రబాబు

# ఎపి సముద్ర తీరం... అభివృద్ధికి ముఖ ద్వారం

## పోర్టులు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, షిప్ బిల్డింగ్ యూనిట్లు, టూరిజంలో అవకాశాలు: సిఎం చంద్రబాబు

## అవకాశాలు పుష్కలం, వచ్చి వినయోగించుకోండి: మంత్రి లోకేష్

**విజయవాడ జులై 29ప్రభాతవార్తప్రతినిధి:** సువిశాలమైన కోస్తా తీరం ఎపిలో పరిశ్రమల పెట్టుబడులకు అత్యంత అనువైందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ కంపెనీల సిఇఒ లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలను వివరిస్తూ.. రాష్ట్రంలో సుదీర్ఘతీరప్రాంతం ఎపికి అతిపెద్ద వనరు అని ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్రంలో మారిటైం ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే ప్రణాళికల్లో భాగంగా..తాము పోర్టుల నిర్మాణం, పోర్ట్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. లాజిస్టిక్ ఖర్చులు తగ్గించాలనేది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని సిఎం చెప్పారు. ఇన్ లాండ్ వాటర్ వేస్ ద్వారా కూడా సరుకు రవాణా చేపట్టేలా ఆలోచనలు చేస్తున్నామన్నారు. దీంతోపాటు టూరిజానికి పెద్ద పీట వేస్తున్నామని.. ఈ ప్రణాళికల్లో భాగంగా క్రూయిజ్ టూరిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

**తీర ప్రాంతం... పెట్టుబడులకు గమ్యస్థానం**

రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉండడాన్ని తాము ఓ అవకాశంగా మలుచుకునేందుకు అన్ని కోణాల్లో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. తమ రాష్ట్రానికి ప్రకృతి ఇచ్చిన వరాన్ని రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన వనరుగా మార్చుకునేలా ఆలోచనలు చేస్తున్నామని సిఎం చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ప్రాంతంలో కొత్త పోర్టులతో అనేక అవకాశాలు వస్తాయనే అంశాన్ని సిఇఒల దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని సిఎంవివరించారు.

**ఎపి అన్ని రకాల పరిశ్రమలకు అనుకూలం: నారాలోకేష్**

ఎపి అన్ని విధాలుగా పెట్టుబడులకు అత్యంత ఆశాజనకమైన ప్రాంతమని రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి ఈ సమావేశంలో స్పష్టం చేసారు.విస్తారమైన రవాణా వ్యవస్థ ఉందని వివరించారు.ఏ పరిశ్రమకైన తమరాష్ట్రం అనుకూలమన్నారు.దేశంలో అత్యంత ఆధునీక వసతులతో సింగపూర్ తరహాలో అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రయోగాత్మకంగా వచ్చే జనవరి నాటికి అమరావతి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్ సందర్శించిన సిఎం చంద్రబాబు**

సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా ప్రతిష్టాత్మక జురాంగ్ పెట్రో కెమికల్ ఐ ల్యాండ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల బృందం సందర్శించింది. జురాంగ్ ఐల్యాండ్ లో సింగపూర్ సృష్టించిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు సహా ఇతర మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి బృందం పరిశీలించింది. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన దీవిలో సమీకృత పెట్రోకెమికల్ ప్లాంట్, ఇంధన కేంద్రాన్ని సింగపూర్ ఏర్పాటు చేసింది. పెట్రో కెమికల్ ఐ ల్యాండ్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి బృందానికి సుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆండీలీ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి జురాంగ్ పెట్రో కెమికల్ కేంద్రాన్ని చూపించారు. పెట్రోకెమికల్ కేంద్రంలో ముడి చమురు ప్రాసెసింగ్ ప్రక్రియతో పాటు ఇతర ఉత్పత్తులైన పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ కెమికల్స్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులకు వివరించారు.

# వ్యక్తిగత ప్రయోజనాలకే

>> టిక్‌గా మన డిజిటల్ సర్వర్‌లోకి వచ్చేస్తోంది.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తాం అన్నారు.ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం అని జగన్ హెచ్చరించారు. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం ఉధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి. మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్న భావన ప్రజల్లో బాగా వెల్లడవుతోంది. చంద్రబాబు రాష్ట్రాన్ని పెత్తందారులకు లాభం కలిగించే దిశలో నడిపిస్తున్నారని ఆరోపించారు.

# షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ

>> ఎపిలోని వివిధ రంగాల్లో సింగపూర్‌తో కలిసి పనిచేసేలా కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టు అయ్యిందని ఆ దేశ అధ్యక్షుడు షణ్ముగ రత్నంతో ముఖ్యమంత్రి చెప్పారు. నాలెడ్జి ఎకానమీ, మౌలిక సదుపాయాల కల్పన, సెమికండక్టర్లు, అమరావతి అభివృద్ధి, అర్బన్ ప్లానింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లే అంశాలపై ఇరువురు నేతలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఇక సింగపూర్ మాజీ ప్రధాని, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్ తో సమావేశమైన సిఎం చంద్రబాబు.. భారత్ సింగపూర్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యేందుకు తమ పర్యటన ఉపకరిస్తుందని అన్నారు. థర్మన్ షణ్ముగరత్నంను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.

# తెరుచుకున్న 'సాగర్' గేట్లు

>> క్రస్టుగేట్ల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ప్రధానని జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేశారని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన కుమార్తె ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పూర్తిచేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. ఈ జలాశయం ద్వారా 26లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోందన్నారు. తెలంగాణ వరి పండించడంలో రికార్డుస్థాయిలో ఉందని మంత్రి ఉత్తమ్ సంతోషం వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని స్పష్టం చేశారు. జులైలోనే నాగార్జునసాగర్ నిండటం 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు అజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మల్లికార్జునరావు, డ్యాం, గేట్స్ డివిజన్ డీఈ కె.శ్రీకాంత్, కేంద్ర బలగాల అధికారులు ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎపి అనుకూలం

## సింగపూర్ పారిశ్రామికవేత్తల రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రత్యేకించి విశాఖలో దీనికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సింగపూర్ లో మూడోరోజు పర్యటిస్తున్న సీఎం ఆ దేశ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు సింగపూర్‌లోని ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 41 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు హాజరై తమ అభిప్రాయాలను తెలియచేశారు. డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామికవేత్తలకు తెలియచేశారు. అలాగే టీసీఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖలో తమ సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. అలాగే దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని.. 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తిరుమల సమాచారం

## గరుడపంచమిన గరుడునిపై గోవిందుడు



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణ మాసం పవిత్రమైన గరుడపంచమిరోజు మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్న మలయప్ప అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, విఎస్ఒలు నెట్టెంతులసి వెంకటరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు. ఈ నెలలో రెండవసారి తిరుమలలో గరుడసేవ జరగడం విశేషం.

## మా సర్వదాస్తి నీకే గోవిందా!

### హైదరాబాద్ దంపతుల భక్తిభావం

## రూ.18.75లక్షలు ఇల్లు టిటిడికి అప్పగింత



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** మాకున్న సర్వదాస్తి నీకే ఇచ్చేస్తున్నాము గోవిందా ఏడు కొండల వేంకటేశ్వర. చివరిరోజుల్లో చల్లగాచూడు స్వామీ అంటూ ఇద్దరు వృద్ధ దంపతులు తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. మేము నివాసముండే ఇల్లు మా తదనంతరం 18.75లక్షలు రూపాయలు విలువచేసేది నీదే తీసుకో స్వామీ అని టిటిడికి రికార్డులను అందజేశారు. తమ ఆస్తి దేవదేవుడు శ్రీవారికి చెందేలా వీలునామా రాసి స్వామీవారిపై అపారమైన భక్తిని ఆ దంపతులు చాటుకున్నారు. హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని వసంతపురికాలనీలో నివాసముంటున్న టి.సునీతాదేవి, టి.కనకదుర్గాప్రసాద్ దంపతులకు సంతానం లేదు. ఇద్దరు వృద్ధ దంపతులు కావడంతో తమ తదనంతరం ఆ ఆస్తి శ్రీవారికి చెందేలా వీలునామా రాశారు. ఆ పత్రాలను తీసుకుని మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. స్వామివారిపై ఆపారమైన భక్తివిశ్వాసాలతోనే ఇంటిని విరాళంగా ఇవ్వడం ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని దాతలను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అభినందించారు. ఇటీవలే హైదరాబాద్‌లోని మాజీ ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ భాస్కర్‌రావు వీలునామా టిటిడికి అందడం స్ఫూర్తిగా తీసుకున్నామని తెలిపారు.

## మహిళల ఉచిత బస్సుకోసం ఏర్పాట్లు

### 750 బస్సులు మంజూరు: తిరుమలలో ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమలరావు

**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆర్టీసి ఎండి సిహెచ్.ద్వారకతిరుమలరావు తెలిపారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసి డిపోలకు 1,350 కొత్త బస్సులు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 750 బస్సులు మంజూరు చేశామని, మరో 600 బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఆగస్ట్ 15నుండి ప్రారంభంకానున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణంకోసం 11వేల బస్సుల్లో 74శాతం ఉచిత సేవలకు కేటాయిస్తామని తెలిపారు. అలాగే ప్రతి బస్టాండ్‌లో తాగునీరు,కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసి ఎండి



ద్వారకతిరుమలరావు మంగళవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నైసార్ ఉపగ్రహం విజయవంతంకావాలి

### శ్రీవారి ఆశీస్సులందుకున్న ఇస్రో బృందం



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** నాసో, ఇస్రో ఉమ్మడి ప్రయోగంగా నేడు ప్రయోగించనున్న జిఎస్ఎల్‌వి నైసార్ ఉపగ్రహం విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ నారాయణన్, డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. 11,200కోట్ల రూపాయలతో ఈ ప్రయోగం చేపడుతున్నామన్నారు. నేటి సాయంత్రం నింగిలోకి దూసుకెళ్ళనుంది. దానికి ముందుగా మంగళవారం ఉదయం ఇస్రో బృందం తిరుమలకు చేరుకుంది. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఉపగ్రహం నమూనాకు శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌కు బృందానికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సిఎం సింగపూర్ పర్యటన విజయవంతంకావాలి

### శ్రీవారిసేవలో మంత్రి దుర్గేశ్

**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులు,పలు రకాల అభివృద్ధికోసం సిఎం చంద్రబాబునాయుడు బృందం సింగపూర్ పర్యటన విజయవంతం కావాలని ఏడుకొండలస్వామిని కోరుకున్నట్లు రాష్ట్రమంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. సింగపూర్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సిఎం కృషి శుభపరిణామమన్నారు. మంగళవారం ఉదయం మంత్రి దుర్గేశ్ కుటుంబంతో విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో శ్రీవారి



ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రూ.2.40కోట్ల విలువైన బంగారు శంఖుచక్రాలు విరాళం

**తిరుమల.జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామికి ఓ దాత భక్తుడు భారీగా బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చాడు. తమిళనాడు చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ దేవదేవుడికి దాదాపు 2.50కిలోల బరువుతో తయారుచేయించిన రూ.2.40కోట్ల విలువైన బంగారు శంఖుచక్రాలను విరాళంగా అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధులు ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి మంగళవారం ఉదయం అందించారు.

## ఆగస్ట్ 8 వరలక్ష్మీవ్రతానికి రేపు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు

**తిరుమల.జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో ఆగస్ట్ 8వతేదీ నిర్వహించే వరలక్ష్మీవ్రతానికి సంబంధించి ఈనెల 31వతేదీ టిటిడి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విడుదల చేస్తోంది. పద్మావతి అమ్మవారి ఆలయంలో జరిగే వరలక్ష్మీవ్రతంలో పాల్గొనే గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి 31వతేదీ ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లు అందుకోవచ్చని తెలిపింది. అలాగే తిరుచానూరు ఆలయం సమీపంలోని కౌంటర్‌లో ఆగస్ట్ 7వతేదీ ఉదయం 9గంటలకు కరెంట్ బుకింగ్‌లో 150 టిక్కెట్లు విక్రయిస్తారు. ఆరోజు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రేక్‌దర్శనం, ఆశీర్వచనం సేవలు రద్దుచేసింది.

### హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తి

## 3850 క్యూసెక్కుల నీరు తరలింపు

### మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జీవనాడి అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా 3850 క్యూసెక్కుల నీరు తరలించే పనులు పూర్తయినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి పై ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో పూర్తి చేయలేని ఈ పనులను తాము సంవత్సరం వ్యవధిలో పూర్తిచేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. హంద్రీనీవా ఫేజ్2లో కూడా 3850 క్యూసెక్కులు తరలించేందుకు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి కావొచ్చాయని ఆయన వివరించారు. హంద్రీనీవా కాలువ కృష్ణాజలాలతో నిండుగా ప్రవహిస్తుంటే రాయలసీమ ప్రజలు హారతులతో స్వాగతం పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పుంగనూరు, కుప్పం బ్రాంచ్‌కెనాల్ పనుల పురోగతి విషయంలో సకాలంలో స్పందించనందుకు ఇద్దరు ఇఇలకు మెమోలు జారీ చేయాలని మంత్రి నిమ్మల ఆదేశించారు.వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్ పనులు ఆలస్యం కాకుండా 2026జూన్ కల్లా పూర్తయ్యేలా పనులు చేయాలని అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వెలిగొండ ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్‌వాల్ పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పూర్తికాని వెలిగొండను జాతికి అంకితం అంటూ గత పాలనలో జగన్ మోసం, దగా చేశాడన్నారు. మనం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు న్యాయం చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో అన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, అడ్వైజర్ ఎం.వెంకటేశ్వర రావు, ఈఎన్సి నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఇలు, ఇఇలు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




మంగళవారం హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి పై సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

## ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించొద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల విద్యాశాఖకు సంబంధం లేని కార్యక్రమాలను ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అప్పగించొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివి, మోడల్, రెసిడెన్షియల్, జిల్లా, మండల, మున్సిపల్ పాఠశాలల్లోని సిబ్బందిని ఉపయోగించొద్దని జిల్లా కలెక్టర్లకు కార్యదర్శి కోన శశిధర్ మెమో జారీ చేశారు. పాఠశాలవిద్యాశాఖ హెచ్ఒడి అనుమతి లేకుండా విద్యేతర కార్యక్రమాలను అప్పగించొద్దన్నారు. విద్యా వ్యవస్థకు ఉపయోగపడేలా ఈ ఉత్తర్వులు జారీ చేశారని ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. అనవసరమైన యాప్‌లను కూడా తొలగించేందుకు ఉత్తర్వులు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు.



## రైల్వే డిఆర్ఎం పేషీలో కొత్త నీరు

**గుంతకల్లు రైల్వే, జూలై 29,ప్రభాతవార్త:** రాయలసీమతో పాటు నెల్లూరు,కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలోని జిల్లాల పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వేగుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) పేషీలో పాత వారి స్థానంలో కొత్త వారినినియమించారు. ఖాళీగా ఉన్న డిఆర్ఎం పిఎస్(గెజిటెడ్)గా యం.రమాకుమారిని నియమించారు.అలాగే డిఆర్ఎంపిఎస్‌గా టి.సాయి ప్రసాద్‌రావును, కంప్లైంట్/ప్రోటోకాల్/పిఆర్ఐగా జి.గిరీష్‌లను నియమించారు.

## యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రానికి తాళాలు

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం పేరుతో నడుస్తోన్న ఆస్పత్రికి సిబ్బంది తాళాలువేసి అందుబాటులో లేకుండా పోయారు. పోలీసులు వచ్చిన సమయంలో ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో బయట నుండి చూసి వెళ్లిపోయారు. ఈ కేంద్రాన్ని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని పరిశీలించారు. ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో సిబ్బందికి ఫోన్ చేశారు. కిషోర్ అనే వ్యక్తి వచ్చి తాళాలు తీశారు. అయితే, ఆస్పత్రిలో రికార్డులులేవు. యూనివర్సల్ పేరుతో ఆస్పత్రిని నడుపుతు న్నారని, సృష్టితో సంబంధం లేదని సిబ్బంది చెబుతున్నారు. అయితే, సృష్టి పేరుతో ఉన్న రికార్డులను ఎందుకు మాయం చేశారని, ఆస్పత్రికి ఎందుకు తాళాలు వేశారని సిబ్బందిని డిఎం అండ్ హెచ్ఒ సుహాసిని ప్రశ్నించారు. యూనివర్సల్ సృష్టి పేరుతో నడుస్తున్న ఆస్పత్రిపై తమకు ఫిర్యాదులు రాలేదని ఆమె తెలిపారు. అయితే, ఆస్పత్రికి తాళాలు వేయడం, రికార్డులు మాయం చేయడంపై సమగ్ర విచారణ జరిపి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. తమ విచారణలో అక్రమాలు జరిగాయని తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పేరే వేరు.. అంతా సృష్టి:** ఐదేళ్ల క్రితం సృష్టి పేరుతోనే నిర్వహించిన కేంద్రాన్నే యూనివర్సల్ సృష్టి అంటూ బోర్డు మార్చారు. అయితే, గతంలో సృష్టి పేరుతో ఉన్న సిబ్బందే వ్యవ హారం అంతా నడిపిస్తున్నారు. ఆ కేంద్రం వైద్యు లు డాక్టర్ నమ్రతపై నిషేధం ఉండటంతోపాటు పలు ఆరోపణలూ ఉన్నాయి. దీంతో, ప్రస్తుతం విజయవాడ సెంటర్‌ను డాక్టర్ కరుణ, వైశాలి పేరుతో నడుపుతున్నారు. వీరిద్దరూ కూడా ప్రస్తుతం అందుబాటులో లేదు. విజయవాడ సూర్యారావుపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతో ఆస్పత్రి ఉండేది. దీనిపై అనేక ఆరోపణలు రావడంతో అప్పట్లోనే వైద్యురాలు నమ్రతపై కేసు కూడా నమోదైంది. కొంతకాలం తర్వాత మళ్లీ విజయవాడ బెంజిసర్కిల్ రామచంద్రనగర్ కంచుకోట వీధిలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించారు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ యూనివర్సల్ పేరు ఉన్నా కార్యకలాపాలన్నీ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతోనే డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

## విశాఖలో పార్ట్‌నర్ షిప్ సమ్మిట్

## నిర్వహణ కమిటీ చైర్మన్‌గా మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పరిశ్రమలు,పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభు త్వం చర్యలు తీసుకొంటుంది. ఈ క్రమంలోనే విశాఖ వేదికగా నవంబరు 14,15 తేదీల్లో పార్ట నర్‌షిప్ సమ్మిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది,సమ్మిట్ నిర్వహణకు పలు కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు గురు మంత్రుల బృందంతో కమిటీ ఏర్పాటు చేసింది.ఈ మంత్రుల బృందానికి మంత్రి నారా లోకేష్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు, సభ్యు లుగా మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, పొంగూరు నారా యణ, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు.వసతుల కల్పన, ఏర్పాట్లుకు సంబంధించి అధికారులతో మరో 9వర్కింగ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసారు.

## విశాఖపట్నంలో గ్రీన్ ఎనర్జీ డాటా సెంటర్ ఏర్పాటు చేయండి


### ఎస్‌టిటెలీ మీడియా ఇన్వెస్టిమెంట్స్ హెడ్ రీతూ మెహ్లోవత్‌తో లోకేష్ భేటీ

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 29, ప్రభాత వార్త :** ఎస్ టి టెలీమీడియా ఇన్వెస్టిమెంట్స్ (ఇండియా) హెడ్ రీతూ మెహ్లోవత్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ లో భేటీ అయ్యారు. (సింగపూర్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎస్ టి టెలీమీడియా వ్యూహాత్మక పెట్టుబడి సంస్థ. కమ్యూనికేషన్స్, మీడియా, డేటా సెంటర్లు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీలలో ప్రపంచవ్యాప్త పోర్ట్ ఫోలియోను కలిగి ఉంది.) ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ లో కార్యకలాపాలను రెట్టింపు చేయాలని భావిస్తున్నందున డాటా సిటీగా ఆవిష్కృతమవుతున్న విశాఖపట్నంలో ఎస్ టి టెలీమీడియా గ్రీన్ ఎనర్జీ డాటా సెంటర్ ఏర్పాటు చేయండి అని కోరారు. ఉత్తర ప్రదేశ్ తరహాలో అత్యాధునిక డేటా సెంటర్లు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన, ఆప్టిమైజేషన్ ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటుచేయడానికి ఎపి ప్రభుత్వంతో కలసి పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు. రీతూ మెహ్లోవత్ స్పందిస్తూ భారత్‌లో తాము ప్రస్తుతం 10 ప్రధాన నగరాల్లో 311 మెగా వాట్ల క్రిటికల్ ఐటి లోడ్ తో 30 డాటా సెంటర్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత్‌లో తమ డాటా సెంటర్ల సామర్థ్యాన్ని 550 మెగా వాట్లకు పెంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థ ఉన్నతస్థాయి బృందం దృష్టికి తీసుకెళ్లి, నిర్ణయం తీసుకుంటామని రీతూ మెహ్లోవత్ తెలిపారు.




## సరసమైన ధరలకు సాంప్రదాయ ఆహారం

### తిరుమలలో ఏర్పాటుకానున్న బ్రాండెడ్ హోటళ్లు





**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల అవసరాలకు తగ్గట్లు నాణ్యమైన ,రుచితో కూడిన శుచిగా సాంప్రదాయం ఆహారం వడ్డించే పెద్ద హోటళ్ళు తిరుమలలో ఏర్పాటు కానున్నాయి. ఇం దుకోసం కొన్ని నిబంధనలతో ,ఖచ్చితంగా సాంప్ర దాయ వంటకాలనే తయారుచేయాలని టిటిడి అధికారులు టెండర్లు ద్వారా బ్రాండెడ్ హోటళ్ళను ఎంపికచేశారు. ప్రస్తుతం ఐదు హోటళ్ళకు నిబంధనలమేరకు అనుమతించారు. తిరుమలలోని పద్మావతినగర్ ఏరియా, మ్యూజియం ప్రాంతం, కల్యాణకట్టకు సమీపంలోని వాటర్‌ఫౌంటైన్ ప్రాంతంలో గతంలో కొందరు వ్యాపారులు నడిపిన హోటళ్ళు ఇప్పుడు కొత్తగా బ్రాండెడ్ హోటళ్ల యాజమాన్యం చేతిలోకి వెళ్ళాయి. గతంలో శ్రీవత్స హోటల్‌ను ప్రస్తుతం చెన్నై అడయార్ ఆనంద్‌భవన్ యాజమాన్యం, కౌస్తుభం వద్ద టిటిడి స్వాధీనం చేసుకున్న హోటల్‌ను హైదరాబాద్‌కు చెందిన దంతూర్ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్‌కు, సందీప్ మయూరా హోటల్‌ను హైదరాబాద్ ప్రెస్ట్ హాస్పిటాలిటీ యాజమాన్యంకు, ఎస్వీగెస్ట్‌హౌస్, సారంగి పేరుతో ఉన్న హోటళ్ళను ముంబైకు చెందిన శ్రీసుఖ్‌సాగర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ కు, సప్తగిరి హోటల్‌ను గుజరాత్ సంకల్ప రిక్రియేషన్ యాజమాన్యం చేతికి అప్పగించారు. ఈ హోటళ్ళన్నీ వ్యాపారధోరణితోకాకుండా సేవాభావంతో భక్తులకు సేవలందించాలని టిటిడి అధికారుల సూచన. సాధారణంగానే తిరుమలలో ఏ వ్యాపారాలైన భక్తుల అవసరాలు, వారి కోసం నడుస్తున్నవే. పూర్తిగా భక్తులపైనే ఆధారపడి హోటళ్ళు, టీదుకాణాలు, ఇతరత్రా వ్యాపారాలు జరుగుతాయి. గతంలో తిరుమలలో పెద్దపెద్దహోటళ్ళు ఉన్నా వాటిల్లో నాణ్యమైన ఆహారం లేదని, ధరలు అధికంగా ఉండేవని భక్తులు ఫిర్యాదులు. అంతేగాక టిటిడి అధికారుల తనిఖీల్లోనూ శుచి,రుచి లేదని తేల్చారు. దీంతో కొన్ని హోటళ్ళను మూసివేయగా మరికొన్ని హోటళ్ళు టెండర్లు పూర్తయి తిరిగి స్థానికులకు అప్పగించలేదు. ఆ పెద్ద ఐదు హోటళ్ళను ఇప్పుడు బ్రాండెడ్,విశ్వాసమున్న సాంప్రదాయ భోజనాలు తయారుచేసి అందించాలని సూచనలతో ఏర్పాటుకు ముందుకువచ్చాయి. తిరుమలలో మూడు వరకు పెద్ద హోటళ్ళు, 10వరకు జనతా క్యాంటీన్లు, 20వరకు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో కూడా అధిక ధరలు, ఉత్తరభారతదేశం చైనీస్, గోబీ వంటి ఆహారం పదార్థాలు రంగులతో తయారుచేసి భక్తులకు వడ్డిస్తున్నారనేది ఫిర్యాదులు,. దీనిపై అందిన సమాచారంతో టిటిడి ఇప్పటికే తిరుమలలో చైనీస్ పుడ్స్, గోబీ, నూడిల్స్,ఫ్రైడ్ రైస్‌లకు అనుమతించలేదు. పూర్తిగా శాఖాహారం, దక్షిణబారతదేశ వంటకాలతోనే సేవాభావంతో హోటళ్ళు నడపాలనేది టిటిడి ధ్యేయం. తిరుమలకొండపైకి కూరగాయలు, బియ్యం, పప్పులు, చివరకు పాలు,గాజుసీసాల్లో తాగేనీరు కూడా ఘాట్‌లో రవాణా భారం కూడా భక్తులపైనే మోపుతారు. ఒకలీటర్ మంచినీటి సీసా 20రూపాయలకే లభిస్తుండగా తిరుమలలో గాజుసీసా నీటిని 30-35రూపాయలకు విక్రయిస్తున్నారు. సీసాతో బాటు 65రూపాయలకు భక్తులకు అంటగడుతున్నారు. సీసా తిరిగి ఇస్తే కొన్ని చోట్ల 30 రూపాయలు వెనక్కు ఇస్తారు. దీన్నిబట్టి లీటరునీటి ధర 35రూపాయల వరకు భక్తులకు దోపిడీనే. అలాంటిది అవసరమైన ఆహారపదార్థాల ముడిసరుకులు తిరుమలకు రవాణా చేసుకున్నా మరీ రానున్న రోజుల్లో ఈ పెద్ద హోటళ్ళలో భోజనాలు, అల్పాహారాలు ఏ మేరకు ధరలు నిర్ణయిస్తారనేది చూడాల్సిందే.

## 11 కేజీల 400గ్రా. బంగారం చోరీ

### ఎస్‌బిఐలో మొత్తం 10 కోట్లకు లెక్కలు

**హిందూపురం, జులై 29 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం కలిగిస్తున్న హిందూపురం తూముకుంటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దోపిడీ ఘటనలో మొత్తం బంగారు ఆభరణాలు 11కేజీల 400 గ్రాములు చోరీకి గురైనట్లు బ్యాంక్ అధికారులు లెక్కలు తేల్చారు. వీటి విలువ 13కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. అదేవిధంగా నగదు రూ 37.92 లక్షలు దొంగలు ఎత్తుకెళ్లారు. దోపిడీ ఘటన సమాచారం వచ్చినప్పటి నుంచి రెండు రోజులుగా బ్యాంకు వద్ద డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగిస్తున్నారు. కుదవపెట్టిన బంగారు ఆభరణాలు ఒక్కోటి ఒక్కో క్యారెట్ టచ్‌లు ఉంటాయని కావున బంగారు ఆభరణాలు విలువ రూ.9.57కోట్లు ఉండవచ్చని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. బ్యాంకు వద్ద మంగళవారం డిఎస్పి విలేకరులతో మాట్లాడుతూ సేఫ్ లాకర్‌లో ఉంచిన భారీ నగదు బంగారు ఆభరణాలు చోరీ చేసిన దుండగులు లాకర్ దిగువ భాగంలో ఉన్న మరో పెట్టెను తెరిచేందుకు విఫలయత్నం చేశారని చెప్పారు. గ్యాస్ కట్టర్‌తో దానిని తెరిచేందుకు ప్రయత్నించిన అది అందకపోవడంతో ఫలితం వారికి దక్కలేదన్నారు. దీనివల్ల ఈ లాకర్లో ఉన్న మరో 10 కేజీల బంగారం చోరీకి గురికాకుండా కాపాడబడిందని చెప్పారు. ఇదిలా ఉండగా దోపిడీ కావడానికి బ్యాంక్ అధికారుల నిర్లక్షమే కారణమని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండు నెలల కిందట సిఐ బ్యాంకు ను పరిశీలించినప్పుడు డైనింగ్ హాల్‌కు అనుకుని ఉన్న కిటికీని భద్రత దృష్ట్యా మూసివేసి గోడ కట్టాలని సూచించారు. ఆ కిటికీలోంచి దొంగలు సునాయాసంగా బ్యాంకులో చొరబడే ప్రమాదం ఉందని సిఐ హెచ్చరించారు. అయినప్పటికీ బ్యాంక్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఘటన జరిగింది. అంతేకాకుండా నాలుగేళ్లుగా సెక్యూరిటీ గార్డును నియమించకపోవడం గమనార్హం.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**దగదర్తి (నెల్లూరు), జూలై 29, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామానికి చెందిన మారుపూడి భాస్కర్ సున్నబట్టి రాచర్లపాడు హైవే రహదారి మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు చెప్పిన సమాచారం మేరకు మృతుడు భాస్కర్ బోగోలు మండలం నాగులవరం గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దగదర్తి నుంచి రాచర్లపాడు మోటార్ బైక్‌పై బంధువుల నివాసానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని, బంధువులు తెలిపారు. దగదర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జంపని కుమార్ దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

NOTICE

MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 14:25:10 | NPKS 9:6:31:8 | NPK 24:24:0 | NPK 0:40:40 | NPK 12:30:20 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 14 | 9 | 24 | 0 | 12 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 25 | 6 | 24 | 40 | 30 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 10 | 31 | 0 | 40 | 20 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 8 | 0 | 0 | 0 |
| 6 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 7 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 8 | Sodium as NaCl per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 10 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 11 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

**Salient Features:**

1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.

**Packing :** Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing.

**Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.**

*Manufactured / Imported & Marketed by -*

**MAHADHAN AGRITECH LIMITED**

**Registered Office** : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.

**www.mahadhan.co.in**

వార్త

నీ గురించి ప్రజలు ఏమనుకోవాలని కోరుకుంటారో అలా కావడానికి ప్రయత్నించడంలోనే జీవితానికి సార్థకత ఉంది.

-గౌతమ బుద్ధుడు

# మహిళల పథకంలో మగాళ్లెలా?

భారతదేశ చరిత్రలో ప్రభుత్వ పథకాలు ఎక్కడా లబ్దిదారులకు సజావుగా అందిన దాఖలాలు లేవు. ప్రభుత్వ పథకాలన్నాక తప్పుదారి పట్టడాలు, లబ్దిదారులకు సరిగా అందకపోవడాలు, వంటి వన్నీ సర్వసాధారణమే. అయినా కొంతలో కొంత లబ్ది దారులకు అందుతున్నాయని, ఉచిత నగదు బదలీలు సైతం జనానికి చేరుతున్నాయని సరిపెట్టుకోవడమే ప్రభుత్వానికి ఊరట కలిగిస్తుంది. ఆ సంతృప్తి మాత్రమే ఆయా ప్రభుత్వాలను బతికిస్తుంది. కానీ ఏకంగా మూలం నుంచే లబ్దిదారుల కోత, అనర్హుల చేర్పు, మార్పులవంటి తమాషాలు జరిగి చివరికి ఆ పథకంలోని డొల్లతనం బయట పడేసరికి ఆ ప్రభుత్వాలే కించిత్తు విస్మయానికి గురవడం చూస్తుంటారు. ఇలాంటి వాటికి తాజాగా మహారాష్ట్రలో అమలవుతున్న 'లడ్కీ బహెన్ యోజన' పథకంలో కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. వీటన్నిటినీ సరిచేయకపోతే సామాన్య అతివలు బలైపోతారు. ప్రభుత్వం కల్పించే 'ఆసరా'కి దూరమవుతారు. దానాదీనా, 'మహాయుతి' ప్రభుత్వాన్ని అందలమెక్కించడానికి ఉపయోగపడిన ప్రాయోజిత ప్రతిష్టాత్మక పథకం. 'లడ్కీ బహెన్‌యోజన. అప్పట్లో ఇంతటి మంచి పథకం మళ్లీరాదనే అంచనాలతో ప్రభుత్వ నిజాయితీపై నమ్మకంతో ఆ ప్రభుత్వాన్ని మళ్లీ పట్టం కట్టారు. పాలకపెద్దలు అటునిటుగా మారినా 'కూటమి' తన లక్ష్యాన్ని చేరుకోగలిగింది. నిజానికి ఇరుగు పొరుగు రాష్ట్రాలు కూడా మహిళల కోసం వేర్వేరు పేర్లతో విశేషలబ్దినందించే పథకాలను అందిస్తున్నాయి. అయినా ఎందుచేతనో 'లడ్కీ బెహన్' పథకానికి ఎనలేని ఆదరణ లభించింది. కాగా అక్రమ విధానాలతో ఆ పథకం ఎంత భ్రష్టుపట్టిందో తాజాగా బయటపడింది. అర్హులైన మహిళలకు నెలకు 1500 రూపాయలు అందించే పథకమిది. దీనికి 21 నుంచి 65 సంవత్సరాలున్న మహిళలను ఎంపిక చేసి వారికి మాత్రమే నగదు పథకంగా అందిస్తుండగా అందులో లెక్కకు మించి మగాళ్ల పేర్లు చోటు చేసుకున్నాయి. ఈపథకంలో 24.1 మిలియన్ల మంది మహిళలు అర్హులుగా చేసి ఇంతవరకు రూ. 21.44 కోట్ల మేరకు నగదును వారి ఖాతాల్లోకి బదలీ చేశారు. సాధారణంగా ఒకే ఇంట్లో ఇద్దరు మహిళలుంటే వారిద్దరికీ చెరో 15 వందల రూపాయలు ముట్టచెప్పారు. కాగా చాన్నాళ్లకు ప్రభుత్వానికి జ్ఞానోదమై ఆయా లబ్ది దారుల చెకింగ్‌లో దాదాపు 14.298 మంది మగాళ్లు తప్పుడు గుర్తింపు ద్వారా నెలనెలా ఆర్థికసాయం పొందా రని తేలింది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఈ పథకం ప్రవేశపెట్టినా మగాళ్లు కూడా ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేయడం, ఆ వెంటనే అప్రూవ్ కావడం విశేషం. ఇలా ఎంతో ఆశ్చర్యంగా ఆన్‌లైన్‌లో మగాళ్లు ఆడవారి జాబితాలో ఏకంగా పదినెలలపాటు లబ్ది పొందారు. ఎవరూ కిమ్మనలేదు. లక్ష్మీదేవి తలుపు తడితే ఆహ్వానిం చకుండా ఉండగలరా! అయితే వారి దరఖాస్తులు ఎలా అనుమతించబడినవో మిలియన్‌డాలర్ల ప్రశ్న. ఈ'మహా' మాయగాళ్లు 'ఫేక్‌ఐడి'లు సృష్టించి ఈ పథకంలో చేరిపో యారు. ప్రతి దరఖాస్తులో జండర్, ఫొటో, పేరు ఉం టాయి. ఏదోఒక 'సెర్చ్'లో అలాంటి ఫేక్ అప్లికేషన్‌లను వడకట్టవచ్చు. కానీ 'మహా'లో ఏం జరిగిందో విశ్లేషించాలంటే ప్రత్యేక దర్యాప్తు అవసరమే. మహిళలుగా తమ పేర్లు నమోదు చేసుకొని లబ్దిపొందిన మగాళ్లను 'ది ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్'వారు ఎలాగో పసికట్టారు. వారి గుట్టురట్టు చేశారు. ఇలాంటివి ఒక్కొక్కటిగా బయటపడి ఆ పథకంలోని డొల్లతనం బయటపడింది. పథకం మంచిదే. మహిళల ఆర్థిక స్వావ లంబన కల్పించే మార్గాల అన్వేషణ ఆహ్వానించదగినదే. ఈ నేపథ్యంలోనే మహిళలకు కొద్దో గొప్పో నగదు సహాయం అందించడమూ మంచి ఉద్దేశమే! కానీ ఈ పథకం కింద లబ్దిపొందే వారిలో ఫోర్ వీలర్‌లు ఉన్నవారు 1.62లక్షల మంది మహిళలు కూడా ఉన్నారు. కేవలం పేదల కోసం నిర్దేశించబడిన ఈ పథకం కింద అధికా దాయాల వారి పేర్లుకూడా అర్హత పొందడం విస్మయం కలిగిస్తోంది. గరిష్ట వయోపరిమితిని 65 ఏళ్లని నిర్ణయించినా అంతకన్నా వయసున్న మహిళలు కూడా ఈ పథక లబ్దిదారుల్లో కనపడతారు. వారి సంఖ్య 2.87 లక్షల మంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో వడపోతలు సాధ్యమే. కానీ వాటన్నిటినీ దాటుకుని అనర్హులు ఎలా అర్హులయ్యారో తేల్చడం శ్రమతో కూడుకున్న పనే. ఇలా అనర్హుల జాబితాకు ఆర్థిక సహాయం పేరిట రూ. 431.7 కోట్ల నష్టం వాటిల్లుతోందని మహారాష్ట్ర ప్రభుత్వం లెక్క తేల్చింది. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రకటించారు. ఈ పథకమే లోపభూయిష్టమైనదని విపక్షాలు దుమ్మెత్తి పోస్తుండడం ఇప్పుడు ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఇవన్నీ విపక్షాల అన్వేషణలో బయటపడినవి కాదు. ఆ రాష్ట్ర మహిళాశిశు అభివృద్ధి శాఖ (డబ్ల్యుసిడి) ఆడిట్‌లో వెల్లడైనందున పూర్తి సాక్ష్యాధారాలు నమోదైనవే కావడం వల్ల ప్రభుత్వ పెద్దలు నోరెత్తలేకపోతున్నారు. 'ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థ'ను తప్పుదారి పట్టించడం సాధ్యమా? లేక ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే వ్యవహారంలో ఎవరి హస్తమైనా ఉందేమో చిత్తశుద్ధితో తెలుసుకోవాల్సిందే. భారీ సంఖ్యలో పలు రకాలుగా పలు వ్యూహాలతో అనర్హుల జాబితా 'కొండ వీడు చాంతాడు' పెరిగిపోవడంతో ఇంతదాక ప్రభుత్వ ఖజానాకు భారం పడింది. అనర్హులకందిన ఆర్థిక లబ్ది దుర్వినియోగమే కదా! అనర్హులకు తాత్కాలికంగా నిధుల జమ ఆపి వేశారు. అక్రమ మార్గాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందిన మోసపూరిత లబ్దిదారులపై చర్యలు తీసుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ప్రతి వాడు ఓర్పుతో ఉండలేడు. అలా ఉన్నవాడే తనను తాను జయించగలడు. ఓర్పు లేకపోవడం ఒకరకమైన దౌర్జన్యం. అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.




మహాత్మా గాంధీ

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.



జార్జ్ ఇలియట్

## ప్రజావాక్కు



### చర్చలా, కొట్లాటలా?

టి.వీలలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్నిపార్టీల ప్రతినిధులు, రాజకీయవిశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకువారు సమాధానం చెప్పాలి.కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరోకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చుతుంటారు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు. టి.వి.ల ముందు కూర్చుని వినేవారికి ఈ గోల భరించ లేనంతగా ఉన్నది.వినేవారి మనోభావాలు యిలా ఉన్నాయని యాంకర్లు ముందుగా ఈ లేఖను వారికి చదివి చెప్పి దారిలోకి తేవటానికి ప్రయత్నించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### హరిద్వార్ ఘటన బాధాకరం

ఉత్తరాఖండ్‌లోని పవిత్ర నగరం హరిద్వార్‌లోని మానసదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మరణించడం బాధాకరం. అనేక మంది భక్తులు గాయపడడం అందరిని కలచి వేసింది. ప్రధాన ఆలయానికి వెళ్లే ఆలయ రహదారిపై మెట్లపై తొక్కిసలాట జరిగిందని తెలుస్తుంది. విద్యుత్ షాక్ పుకార్లు జనంలో భయాందోళనలకు కారణమయ్యాయని,తొక్కిసలాటకు దారితీసిందని అంటున్నారు. తొక్కిసలాట జరగడానికి ముందే మాన్సాదేవి ఆలయం వద్ద భారీ జనసమూహం గుమిగూడిందని అంటున్నారు. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### వ్యవసాయమే ప్రాణాధారం

ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజనా వాటర్ షెడ్ కార్యక్రమం అనేది బహుళ ఉపయోగకరంగా రైతులకు ఉండనుంది. దీని ముఖ్య ఉద్దేశం నీటీని ఒడిసిపెట్టడమే. దాని ద్వారా దిగుబడిని పెంచడం అయితే నీటిని ఒడిసి పట్టడంతో పాటు రైతులకు ఉపయోగకరమైన పనిముట్లను దీని ద్వారా అందజేయనున్నారు.పైపులైన్‌లతో పాటు మందు పిచికారీ చేసే పంపులు వర్షాల నుండి కాపాడే టార్పాలిన్ కవర్ల వంటివి సబ్సిడీతో అందజేయాలి.

- భారత అవినాష్, జనగామ

### టిక్కెట్లపై రాయితీ పునరుద్ధరణ లేనట్లేనా?

2019వ సంవత్సరం వరకూ భారత రైల్వే శాఖ 60 సంవత్సరాలు నిండిన పురుషులకు 40శాతం, 58 సంవత్సరాలు నిండిన మహిళలకు 50శాతం రాయితీ టికెట్లపై అందించేది. అయితే 2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయోజనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఇంతవరకూ ఆప్రయోజనాలను పునరుద్ధరించలేదు. అప్పట్లో ప్రజలు కరోనా పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించారు.ఇప్పుడు కరోనా మహమ్మారి పూర్తిగా తగ్గినాకూడా రాయితీలను పునరుద్ధరించకుండా ఈ ప్రయోజనాలకు శాశ్వతంగా స్వస్తి పలికేలా కనపడుతుంది. ప్రయాణికుల్లో చాలా మందివృద్ధులు,మధ్యతరగతి ఉద్యోగులు, తక్కువ వేతనదారుల వంటి సామాన్యులే ఎక్కువ. కేంద్రం ఇప్పటికే వందేభారత్, బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తోంది. 2023- 24 రైల్వే బడ్జెట్లో రూ. 2.4 లక్షల కోట్ల మూలధన వ్యయం కేటాయించారు. అంతటి భారీ బడ్జెట్ ఉన్నప్పుడు, వృద్ధులకు ఇచ్చే రాయితీలను కొనసాగించలేకపోవడం కేవలం నిధుల సమస్య కాదనిపిస్తుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి టికెట్ రాయితీలను పునరుద్ధరించాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగళూరు

### శుభ్ర పరుస్తూ ఉండాలి

ప్రజలు సంచరించే ప్రదేశాలను ప్రభుత్వ మున్సిపాలిటీ శాఖలు శుభ్ర పరుస్తూ ఉండాలి. ముఖ్యంగా పాఠశాలలు, దావాఖానాలు, బస్, రైల్వే స్టేషన్‌లు, రైతు మార్కెట్లు , సినిమా హాళ్లు, హోటళ్ళు,దేవాలయాలు,సందర్శనా ప్రదేశాలు,ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక కర్మాగారాలు, గిడ్డంగులు తదితర ప్రజలు సంచరించే ప్రదేశాలను శుభ్ర పరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.అప్పుడే స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

### ఉపాధ్యాయులను నియమించాలి

జూనియర్ కళాశాల, హై స్కూల్ ఒకే చోట ఉన్న ప్రాంతంలో గురుకులాల్లో లెక్చరర్ కు కళాశాల స్థాయిలో మాత్రమే టీచింగ్ చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. లెక్చరర్‌కు చిన్నచిన్న క్లాస్ బోధించడానికి పంపవద్దు. ఉన్నతస్థాయి విద్యార్థులకు బోధించడానికి పంపించాలి. కనుక లెక్చరర్స్‌ను ఇంటర్ చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి విజ్ఞానం అభివృద్ధికి మాత్రమే వినియోగించాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెంచలేమా?

**ఉపాధ్యాయులు, వార్డెన్లు మొదలైనవారు విద్యార్థులలో మానసిక క్షోభను గుర్తించి, సరిగ్గా స్పందించడానికి ఇది కీలకం. తల్లిదండ్రులు, సంరక్షకులను నిరంతరం అవగాహనా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనవసరమైన విద్యాఒత్తిడిని తగ్గించి ఇంట్లో సహాయక వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ సెషన్ల లక్ష్యం. లైంగిక వేధింపులు, ర్యాగింగ్ కులం, వర్గం, లింగం, లైంగిక ధోరణి, వైకల్యం, మతం లేదా జాతి ఆధారిత బెదిరింపులకు సంబంధించిన సంఘటనలను పరిష్కరించడానికి, గోప్యమైన అందుబాటులో ఉండే సమగ్ర ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుదారులు లేదా విజిల్ బ్లోయర్‌లపై ప్రతీకార చర్యలకు 'జీరోటాలరెన్స్ విధానం' ఉండాలి. ఇటువంటి కేసులలో మానసిక ఆరోగ్య నిపుణులకు తక్షణ రెఫరల్ తప్పనిసరి. ఫిర్యాదులపై సకాలంలో లేదా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే ప్రత్యేకించి అటు వంటి నిర్లక్ష్యం విద్యార్థి ఆత్మహత్యకు లేదా స్వీయహానికి దారితీస్తే, అది 'సంస్థాగత దోషం'గా పరిగణించబడుతుంది.**

డి జె మోహన రావు

కళాశాలల్లో, కోచింగ్ సెంటర్లలో మార్కుల కోసం, ర్యాంకుల కోసం జరిగే తీవ్రమైన పోటీలో ఎంతోమంది యువత తమ చిరునవ్వులు పోగొట్టుకుంటున్నారు. వారి మనసులలో పేరుకుపోయిన ఒత్తిడి, బయటకు చెప్పుకోలేని బాధ, చివరికి ప్రాణాలు తీసుకోవడానికి దారితీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గుర్తించిన సుప్రీంకోర్టు 25జూలై 2025 న కీలకమైన తీర్పు ఇచ్చింది. 'నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది' అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది. జాతీయ నేర గణాంక సంస్థ 2022 నాటి 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదిక మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 7.6 మంది విద్యార్థులే అని పేర్కొంది. 2022లో సుమారు 13,044 మంది విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో 2,248 మంది కేవలం పరీక్షలలో ఫెయిల్ అవడం వల్లే చనిపోయారని స్పష్టం చేసింది. 2001లో 5,425 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కి చేరింది. నియంత్రణ లేని కోచింగ్ పరిశ్రమ ఎలా యువత జీవితాలను ప్రమాదంలో పడేస్తుందో విశ్లేషిస్తుంది. ఈ తీర్పునకు తక్షణ కారణం, సుక్దేబ్ సాహా అనే ఒక తండ్రి తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై చేసిన పోరాటం. విశాఖపట్నంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ కోసం చదువుతున్న అతని 17ఏళ్ల కుమార్తె 2023 జూలై 14న హాస్టల్ పైకప్పు నుండి పడిపోయి అనుమానాస్పదంగా మరణించింది. ఈ సంఘటనపై పోలీసులు సరిగా విచారించడం లేదని కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిజాలను దాచిపెడుతోందని ఆరోపిస్తూ సాహా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరికి సుప్రీంకోర్టుకు వచ్చారు. ఈ కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతా ధర్మాసనం, ఆ ఒక్క సంఘటనను కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా అది దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభానికి, విద్యావ్యవస్థలోని 'వ్యవస్థాగత లోపం'కు నిదర్శనంగా విశ్లేషించింది. పోలీసు దర్యాప్తులో 'లోతైన లోపాలు' ఉన్నాయని, 'కీలక ఆధారాలను దాచిపెట్టే అవకాశం' ఉందని గమనించి సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా వ్యవస్థల మధ్య జవాబుదారీతనం లేకపోవడంపైనా కోర్టు పరోక్షంగా దృష్టి సారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,జీవించేహక్కు పరిధిలో మానసిక ఆరోగ్యం ఒక అంతర్భాగమని కోర్టు స్పష్టంచేసింది. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకే ఈ ఆదేశాలను జారీచేయాల్సి వచ్చిందని పేర్కొంది. విద్యార్థుల సమస్యలు విద్యా సంస్థలు పట్టించుకోకపోయినా, ఆ నిర్లక్ష్యం ఆత్మహత్యకు దారితీస్తే, ఆ సంస్థలే బాధ్యత



వహించాలని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఈ తీర్పు విద్యార్థుల మానసిక ఆరోగ్యం శ్రేయస్సును కాపాడటానికి ఒక బహుళరంగ విధానాన్ని ప్రతిబింబిస్తుంది.ప్రతి సూత్రం ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడింది. అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు ఒకే రకమైన మానసిక ఆరోగ్య విధానాన్ని పాటించాలి.ఇది దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యానికి ఒక ప్రామాణిక విధానాన్ని ఏర్పాటు చేయాలి. 100 మందికి పైగా విద్యార్థులున్న ప్రతి విద్యా సంస్థలో కనీసం ఒక అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్ట్‌ను తప్పనిసరిగా నియమించాలి. చిన్న సంస్థలు తగినంత మంది కౌన్సెలర్‌లు ఉండేలా చూసుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థి బృందాలకు మెంటార్‌లను కేటాయించాలి. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్‌లకు తక్షణ రెఫరల్ కోసం అన్ని విద్యా సంస్థలు ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయాలి. ఇది అత్యవసర పరిస్థితుల్లో త్వరగా చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది. టెలీమానస్, ఆత్మహత్యల నివారణ హెల్ప్‌లైన్ నంబర్‌లను హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలు, వెబ్‌సైట్‌లలో పెద్ద అక్షరాలతో ప్రముఖంగా ప్రదర్శించాలి. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ కనీసం సంవత్సరానికి రెండుసార్లు ధృవీకరించబడిన మానసిక ఆరోగ్య నిపుణులచే శిక్షణ పొందాలి. ఈ శిక్షణలో మానసిక ప్రథమ చికిత్స, ఆత్మహత్య సంకేతాలను గుర్తించడం, స్వీయహానిని ఎదుర్కోవడం, రెఫరల్ విధానాలు ఉండాలి. ఉపాధ్యాయులు, వార్డెన్లు మొదలైనవారు విద్యార్థులలో మానసిక క్షోభను గుర్తించి, సరిగ్గా స్పందించడానికి ఇది కీలకం. తల్లిదండ్రులు, సంరక్షకులను నిరంతరం అవగాహనా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనవసరమైన విద్యాఒత్తిడిని తగ్గించి ఇంట్లో సహాయక వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ సెషన్ల లక్ష్యం. లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌కులం, వర్గం, లింగం, లైంగిక ధోరణి, వైకల్యం, మతం లేదా జాతి ఆధారిత బెదిరింపులకు సంబంధించిన సంఘటనలను పరిష్కరించడానికి, గోప్యమైన అందుబాటులో ఉండే సమగ్ర ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుదారులు లేదా విజిల్‌బ్లోయర్ లపై ప్రతీకార చర్యలకు 'జీరోటాలరెన్స్ విధానం' ఉండాలి. ఇటువంటి కేసులలో మానసిక ఆరోగ్యనిపుణులకు తక్షణ రెఫరల్ తప్పనిసరి. ఫిర్యాదులపై సకాలంలో లేదా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే ప్రత్యేకించి అటువంటి నిర్లక్ష్యం విద్యార్థి ఆత్మహత్యకు లేదా స్వీయహానికీ దారితీస్తే, అది 'సంస్థాగత దోషం'గా పరిగణించబడుతుంది. ఇది నిర్వాహకులను నియంత్రణను చట్టపరమైన పరిణామాలకు బాధ్యులను చేస్తుంది. అన్ని హాస్టళ్లు ట్యాంపర్‌ప్రూఫ్ సీలింగ్ ఫ్యాన్‌లు, భద్రతా పరికరాలను అమర్చాలి. అలాగే ఆత్మ హత్యాయత్నాలను నిరోధించడానికి పైకప్పులు, బాల్కనీలు ఇతర ప్రమాదకర ప్రాంతాలకు ప్రవేశాన్ని నియంత్రించాలి. విద్యాసంస్థలలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు పద్ధతులపై వార్షిక బాహ్యానిపుణులతో నిర్వహించాలి. ఆత్మహత్యాయత్నాన్నిజిల్లా అధికారులకు అధికారికంగానివేదించాలి. సంస్థలు అంతర్గత విచారణలు నిర్వహించి,నివారణ చర్యలను నమోదుచేయాలి. ఇది పారదర్శకతను పెంచుతుంది. బాధ్యతను నిర్ధారిస్తుంది.విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన డేటాను సేకరించడానికి, విశ్లేషించడానికి ఒక జాతీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని పరోక్షంగా ఈ తీర్పు సూచిస్తుంది.చివరగా అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలు రెండు నెలల్లోగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నమోదు, నియంత్రణ, పర్యవేక్షణకు నిబంధనలను నోటిఫై చేయాలి. ఈ నిబంధనలు విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్య రక్షణలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది కోచింగ్ సెంటర్ల అదుపులేని వృద్ధిని,వాటిలో నెలకొన్న ఒత్తిడిని పరిష్కరించడానికి ఒక కీలకమైన చట్టపరమైన చర్య.ఈ మార్గదర్శకాల విజయం వాటిని ఎంత పకడ్బందీగా అమలుచేస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది.కేవలం మార్కుల వెనుక పరిగెత్తేధోరణిని వదిలిపెట్టి, మానసిక స్థితిస్థాపకతనుప్రోత్సహించే విద్యవైపు మళ్లినప్పుడే సాధ్యమవుతుంది. •

# ఇజ్రాయెల్‌ను ఒంటరి చేయడమే ఏకైక మార్గం!


మహమ్మద్ ఆరిఫ్

గాజాలో ఇజ్రాయెల్ సామూహిక నరమేధానికి పాల్పడుతున్నది. ఒక జాతి మొత్తాన్ని సంహరించేలా.. చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రోజుకు వందలాది మందిని హత్య చేస్తున్నది. మానవతాసహాయం, ఆహారం, వైద్య కోసం ఎదురుచూస్తున్న వారిపై సైతం బుల్లెట్లు, బాంబుల వర్షం కురిపిస్తున్నది. దీంతో 2023 అక్టోబర్ నుంచి సుమారు 6080 వేల మందివరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18 వేల మంది చిన్నారులు ఉండగా, 15 వేల కంటే ఎక్కువ మంది మహిళలున్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విధించిన బ్లాకేడ్ వల్ల ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సామాగ్రి వంటి ప్రాథమిక అవసరాలు కూడా గాజాకు అందడం లేదు. దీని వల్ల ఆకలి చావులు, వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. గత కొన్ని రోజుల్లో ఆహార సహాయ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ సైనికులు జరిపిన కాల్పుల్లో 875 సాధారణ మంది పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి నివేదించింది. అంతేకాకుండా సుమారు 19 లక్షల మంది నిర్వాసితులుగా మారారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని, మానవతా సహాయానికి అనుమతించాలని ఇజ్రాయెల్ పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇటీవల 28 దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇందులో ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, బెల్జియం తదితర దేశాలు ఉన్నాయి. కాగా, వీరి డిమాండ్‌ను ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీన్ని బట్టి చూస్తే ఈ 28 దేశాలు ప్రకటనలకే పరిమితమైతే ఎలాంటి లాభం ఉండదని స్పష్టమవుతున్నది. ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశాన్ని ఒంటరిచేసేలా కఠిన ఆంక్షలు విధించాల్సిన అవసరమున్నది. గాజాలో యుద్ధ విరామం, మానవతా సహాయం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే పలు దేశాలు మెల్లమెల్లగా చర్యలు మొదలుపెట్టాయి. ఇజ్రాయెల్ చర్యల కారణంగా వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షించాల్సిన అవసరముందని ఈయూ విదేశాంగ విధాన ప్రధాని కాజా కల్లాస్ ప్రకటించారు. యూకే ఇప్పటికే ఇజ్రాయెల్‌తో వాణిజ్య చర్చలను నిలిపివేసింది. ఇజ్రాయెల్‌కు ఆయుధ బదిలీలు ఆపాలని యూఎన్ నిపుణులు సైతం హెచ్చరించారు. యూకే, మరి కొన్ని దేశాలు ఆయుధ లైసెన్సులను కొంతవరకు నిలిపివేశాయి. బెలిజ్ ఇజ్రాయెల్‌తో దౌత్యసంబంధాలను నిలిపివేసింది. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా,స్పెయిన్ 2024లో పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. యూఎన్ జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయెల్ మాక్రోన్ కూడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపడానికి, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఇది చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.అంటే ఫ్రాన్స్ జీ7దేశాల్లో పాలస్తీనాను దేశంగా గుర్తించే మొట్టమొదటి రాజ్యంగా నిలవనుంది. గాజాలో జెనోసైడ్‌ను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఇప్పటికే ఇజ్రాయెల్‌ను ఆదేశించింది.ఇజ్రాయెల్‌పై కఠినఆంక్షలు విధించడం ద్వారానే ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావచ్చు. ముందుగా ఆయుధాల ఎగుమతులపై పూర్తి నిషేధం విధించాలి. ప్రపంచ దేశాలు గాజా పునర్నిర్మాణానికి నిధులను కేటాయించడం ద్వారాదీర్ఘకాలిక సహాయాన్ని అందించవచ్చు. ఇది విద్య,ఆరోగ్యం, జీవనోపాధికి దోహదపడుతుంది. మరోవైపు అన్ని దేశాల ప్రజలు సైతం ఇజ్రాయెల్‌పై ఒత్తిడిపెంచే చర్యలకు సిద్ధం కావాల్సిన అవసరమున్నది. ఇది ఆయా దేశాలుతీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయగలవు. గాజాలో నిరాయుధులు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, ఆకలి చావులు, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించే ధైర్యం చేయాలి. అప్పుడే గాజా ప్రజలకు న్యాయం సాధ్యమవుతుంది. •

# మనుషుల అక్రమ రవాణా అభివృద్ధికి ముప్పు

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచం నిత్య నూతన ప్రగతిని సాధిస్తున్నా, మానవతను మింగేసే చీకటి కార్యకలాపాలు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. వాటిలో అత్యంత భయంకరమైనదిగా గుర్తించదగ్గది మానవుల అక్రమ రవాణా. ఇది కేవలం నేరం మాత్రమే కాదు, మానవ హక్కులపై క్రూరమైన దాడి. ఆధునిక సమాజంలోనూ మనిషిని వస్తువుల్లా కొనుగోలు చేసి, అమ్మేసే తీరును తలచుకుంటే గుండె వేదనతో నిండిపోతుంది. దీనిని అరికట్టే సంకల్పానికి అంకితమైన రోజు – జూలై 30. ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం. ఈ దినోత్సవం 2013లో ఐక్యరాజ్య సమితి ద్వారా అధికారికంగా స్థాపించబడింది. దీని ప్రధాన ఉద్దేశం మానవ రవాణాకు గురైన బాధితుల పట్ల మానవీయ దృక్కోణాన్ని పెంపొందించడం. ఈ నేరాన్ని అరికట్టడంలో అంతర్జాతీయ సమన్వయాన్ని బలోపేతం చేయడం. ప్రతి ఏడాది ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు కలిసి నేరానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తారు. మానవ అక్రమ రవాణా అనేది ఆధునిక బానిసత్వపు రూపం. ఇది బలహీనతను ఆయుధంగా మలిచే నేరం. ఆదరణ కరువైన, నిస్సహాయ మహిళలు, బాలికలు, వలస కార్మికులు, శరణార్థులు వంటి వర్గాలు ప్రధానంగా ఈ రకమైన దురాచారానికి గురవుతుంటారు. ఉద్యోగం, వివాహం, సినిమా అవకాశాలు, చదువు వంటి మాయ వాగ్దానాలతో వారినిమోసం చేసి, బలవంతపు శ్రమకు లేదా లైంగిక దోపిడీకి గురిచేస్తారు. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 25 మిలియన్ల మంది ఈ నేరానికి గురవుతున్నారు. వారిలో సగానికి పైగా మహిళలు, బాలికలే. ఈ నేరంలో ఉపయోగించే పద్ధతులు అత్యంత కటువైనవి. మొదట మోసపూరితంగా ఉద్యోగం లేదా అవకాశంతో ఆకర్షించడం, తర్వాత వారిని బలవంతంగా తరలించడం, చివరకు వారి గమ్యం వారికి తెలియకుండానే వారిని గృహ దాస్యానికి లేదా వేశ్యావృత్తికి, ఎన్నో రకాల శారీరక, మానసిక దోపిడికి గురిచేయడం జరుగుతుంది. ఇది కేవలం దేశాల మధ్య జరగడం కాదు ఒకే రాష్ట్రం, నగరం, గ్రామంలో కూడా జరుగుతూనే ఉంది. నేరస్తులు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని, వారు సమాజంలో తమ ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రయత్నించే దాకా వారి జీవితాలను నాశనం చేస్తారు. భారత దేశంలో కూడా మానవ అక్రమ రవాణా ఒక తీవ్రమైన సమస్య. ముఖ్యంగా తూర్పు,ఉత్తర భారతంలో వలస జీవనానికి వెళ్ళే బాలికలు, మహిళలు మాయ మాటలకు లోనై బానిసత్వ జీవితానికి బలవుతున్నారు. శిశు కార్మికులుగా, గృహోద్యోగులుగా, వేశ్యావృత్తిలో, మసాజ్ సెంటర్లలో వారి జీవితాలు శ్రమదమాదులను ఎదుర్కొంటున్నాయి. టెక్నాలజీ అభివృద్ధితో ఈ నేరానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్, ఫేక్‌వెబ్ సైట్ల ద్వారా నేరస్తులు యువతను వలలోవేసి, వారి స్వేచ్ఛ



ను హరిస్తున్నారు. ప్రభుత్వాలు కొన్ని చట్టాలను తీసుకొచ్చినా, అమలులో సమర్థత లోపిస్తుంది.భారత దేశంలో2013 నాటి ఐపీసీ సెక్షన్ 370 ప్రకారం మానవ రవాణాపై తీవ్ర శిక్షలు ఉన్నా, నేరస్థులపై కేసులు నమోదు కావడం, విచారణ జరగడం, తీర్పు రావడం అన్నీ సమర్థవంతంగా జరగడం లేదు. 2018లో ప్రవేశపెట్టిన 'ట్రాఫికింగ్ ఆఫ్‌పర్సన్స్ బిల్లు' ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. న్యాయ వ్యవస్థలో పటిష్టత లేకపోవడం, బాధితుల పట్ల మానవీయత లేకపోవడం, సమర్థవంతమైన పునరావాస చర్యలలోపం ఇవన్నీ ఈ సమస్యను పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా దినోత్సవం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇది ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదు ఓ సంఘటన, ఓ శంకుస్థాపన. బాధితుల పట్ల మానవీయతను పెంపొందించడానికి, సమాజాన్ని చైతన్య పరచడానికి ఇది ఒక అవకాశంగా మారుతుంది. బాధితుల గుర్తింపు, పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, చట్ట అమలు దారులు సమష్టిగా కృషి చేయాలి.ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని గుర్తించాల్సిన సమయం ఇది.కుటుంబాల్లో పిల్లలతో బలమైన అనుబంధాన్ని నిర్మించడం, వారిలో భద్రతా భావం కల్పించడం, సోషల్ మీడియా వినియోగంపై జాగ్రత్తగా పర్యవేక్షించడం, సమాజంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలి. బాధితులను చిన్నచూపు చూడకుండా, వారిని తిరిగి సామాజిక జీవనంలో నిలదొక్కుకునేలా చేయడం ఎంతో అవసరం. ఎన్.జి.ఓల భాగస్వామ్యంతో కౌన్సెలింగ్, విద్య,వృత్తి శిక్షణ, ఆశ్రయం వంటి సేవలను మరింత విస్తృతంగా అందించాలి. అంతర్జాతీయ స్థాయిలో సహకారం అవసరం. ఒక దేశంలో ప్రారంభమై, మరొక దేశంలో ముగిసే ఈ నేరాన్ని అరికట్టేందుకు దేశాల మధ్య సమాచారం, నిఘా, చట్టపరమైన సహకారం పెంచాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా డిజిటల్ ట్రాకింగ్, ఐడెంటిఫికేషన్ టూల్స్ ద్వారా బాధితులను గుర్తించడం, నేరగాళ్లను పట్టుకోవడం మరింత వేగవంతం చేయాలి. ఇది కేవలం ప్రభుత్వాల పని కాదు. మనలో ప్రతి ఒక్కరిలో మానవతా చైతన్యం కలిగితేనే అసలైన మార్పు వస్తుంది. మన చుట్టూ ఉన్న అన్యాయాలను నిశ్శబ్దంగా చూస్తూ ఉండకూడదు. బాధితుల పట్ల మన ఉదాసీనత కూడా ఓ నేరమే అవుతుంది. వాళ్లకి మద్దతు ఇవ్వడం,వారి గౌరవాన్ని పునరుద్ధరించడం మన మానవతా ధర్మం. ఈ దినోత్సవం సందేశం చాలా స్పష్టంగా ఉంది – మనిషి వస్తువు కాదు. అతడి, ఆమె స్వేచ్ఛను కొనలేరు, గౌరవాన్ని అమ్మలేరు. ఆధునిక ప్రపంచం అర్థవంతం కావా లంటే అందులో మానవత్వం ఉండాలి. మానవ అక్రమ రవాణా లాంటి దుర్మార్గాలు ఉండే వరకూ, మన సమాజం అభివృద్ధి చెందిందని చెప్పలేం. మానవ హక్కుల రక్షణకే గాక, మానవ విలువలు నిలబెట్టడానికి ఈ దినోత్సవం ఓ శక్తివంతమైన అవకాశంగా నిలుస్తుంది. ఈ పోరాటం మనం దరిది. ఇది బాధితుల కోసం మాత్రమే కాదు, మానవత్వం కోసం సాగుతున్న యుద్ధం. నిశ్శబ్దంగా బాధపడుతున్న వాళ్ల గళానికి ప్రతిధ్వనిగా మారండి. చీకటిలో చిక్కుకున్న మనుషుల కోసం ఒక వెలుగు రేఖవండి. ఎందుకంటే మనిషి బానిస కాదు. •

# గుంటూరు వార్త

### అనుమతి లేకుండా పెద్ద చెట్టుని నరికివేయడం గమనించి

## స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్

### వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశం

**గుంటూరు తూర్పు, జూలై 29 (ప్రభాతవార్త) :** నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సమస్యలపై ప్రజల నుండి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధగా ఉండాలని, ఫిర్యాదులను ర్యాండమ్‌గా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని నగర



కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు తెలిపారు. మంగళవారం పిజిఆర్ఎస్‌కి అందిన ఫిర్యాదు మేరకు గోరంట్ల అన్నపూర్ణ నగర్, సరస్వతి కాలనీ, తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలు తమ స్థానిక సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీల పరిష్కారంతో అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఉండడానికి వీలు లేదని, నేరుగా అర్జీదారులతో తామే మాట్లాడుతామన్నారు. అన్నపూర్ణ నగర్, సరస్వతి కాలనీల్లో మౌలిక వసతుల సమస్యలపై అందిన అర్జీని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. డ్రైనేజీని ఆయా ప్రాంతాలకు నిర్దేశిత సమయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నపూర్ణ నగర్‌లో 5వ లైన్‌లో పెద్ద చెట్టుకుని అనుమతి లేకుండా నరికివేయడం గమనించి స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం వారిపై వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఏడిహెచ్‌ని ఆదేశించారు. మ్యాన్ హోల్ రోడ్ లెవల్‌కి కిందకు ఉండడం, సిసి రోడ్, డ్రైన్ వెంబడి గ్యాప్ నిర్మాణ వ్యర్థాలు ఉండడం గమనించి తక్షణం మ్యాన్ హోల్‌ని పైకి నిర్మాణం చేయాలన్నారు. డ్రైన్ రోడ్డు మధ్యలో గ్యాప్ లేకుండా నిర్మాణ అనంతరం వ్యర్థాలు తొలగించడం సంబంధిత కాంట్రాక్టర్‌దే బాధ్యత అన్నారు. అందుకు తగిన విధంగా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి, ప్రజల ఫిర్యాదు చేస్తున్నారని, స్థల యజమానులను గుర్తించి శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించని వారి స్థలాల్లో జిఎంసి బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, డిఈఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెండు లారీలను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు


**యద్దనపూడి, జూలై 29, (ప్రభాతవార్త) :** మైనింగ్ అనుమతులు లేకుండా కొండరాళ్లను రవాణా చేస్తున్న రెండు లారీలను మైనింగ్ అధికారులు పట్టుకొని సీజ్ చేయటం జరిగిందని మైనింగ్ ఏడి నాగేని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ గృహలక్ష్మీ, ప్రజా స్టోన్ క్రషర్లకు మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా కొండరాళ్లను రవాణా చేస్తున్నారని, మైనింగ్ అధికారుల దాడులలో పట్టుకున్న రెండు లారీలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసి లారీలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.



## విద్యుత్తు సరఫరాలో ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**బాపట్ల, జూలై29, ప్రభాతవార్త:** విద్యుత్తు సరఫరా లో ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలో ఆర్ డి ఎస్ ఎస్ పథకం కింద నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్లు, బ్రేకర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం క్షేత్రస్థాయిలో నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత సూర్యలంక రోడ్ లోని 33/11 కె.వి బాపట్ల టౌన్ 1 విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మైక్రో కంట్రోల్లర్ల పనుల పురోగతిపై ఆయన విద్యుత్ శాఖ అధికారులను ఆరా తీశారు. ఉపకేంద్రం నిర్వహణపై పలు సూచనలు చేశారు, పాతబడిన ఇనుప స్తంభాలకు రంగులు వేయాలని సూచించారు. ఈ ఉప కేంద్రం నుండి బాపట్లలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా సమయంలో విద్యుత్ ఉపయోగం ఎక్కువ అవ్వటం వలన పటేల్ నగర్ ఫీడర్ లో 180 కేవీ లోడ్ పెరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నందున ఆ లోడ్ ను నియంత్రించుటకు పటేల్ నగర్, శృంగారపురం లలో విసిబి బ్రేకర్లను ఏర్పాటు చేశామని విద్యుత్ అధికారులు ఆయనకు తెలిపారు. ఈ పనులను పూర్తి చేయుటకు 20 లక్షల 10 వేల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా 1.5 కిలోమీటర్ల విద్యుత్ లైన్ లను ఏర్పాటు చేశామన్నారు. ఈ విధంగా చేయడం వలన ఒకే విద్యుత్ లైన్ పైన పడే భారాన్ని నియంత్రించడం జరిగిందని, దీనివలన విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ఉంటుందన్నారు. అనంతరం వేటపాలెం మండలంలోని పల్లారెడ్డిపాలెం మీదుగా జెసాయి పేట నుండి రామన్నపేట వరకు 33 కెవి ఫీడర్ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆరా తీశారు. కొత్తగా ఏర్పాటు చేసిన 6.5 కిలోమీటర్ల ఫీడర్ పనులకు గాను 75 లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా



కలెక్టర్ జె.వెంకట మురళి, ఏపీ సీపీడీసీఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఈఈ లు, డీఈ లు, ఎఈ లు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో రూ.21కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం : నగర మేయర్

**గుంటూరు తూర్పు, జూలై 29 (ప్రభాతవార్త) :** నగరంలో షుమారు రూ.21కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించుటకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని



అధ్యక్షులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్థాయి సంఘం అధ్యక్షులు వారి ఛాంబర్‌లో నగర కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆదాయం పెంపొందిచుటకు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీలు ఉన్న వాటికి నిబంధనల ప్రకారం బహిరంగ వేలము నిర్వహించి షాపులను కేటాయించటం జరుగుతుందన్నారు. నగరంలోని వార్డుల వారీగా అభివృద్ధి పనులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు శాసన సభ్యుల ప్రతిపాదనల మేరకు ఆమోదించటం జరిగిందన్నారు. వార్డులలో జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ ప్రకారం స్థానిక కార్పోరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలన్నారు. ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసి రోడ్లు, డ్రైన్లు మరియు కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సిసి డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, డిసిడి శ్రీనివాసరావు, యస్‌ఈ నాగమల్లేశ్వరరావు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### గంట వ్యవధిలోనే

## బాలిక ఆచూకీ లభ్యం

**గుంటూరు క్రైమ్, జూలై 29, ప్రభాతవార్త :** గంట వ్యవధిలోనే 9సంవత్సరాల బాలిక ఆచూకీని పట్టాభిపురం పోలీసులు కొను గొన్న సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరణ మేరకు జూలై 29వ తేది ఉదయం 7గంటల సమయంలో కోబాల్డ్‌పేట 6వ లైన్‌కు చెందిన బలస లాస్య అనే 9ఏండ్ల అమ్మాయి ఇంటినుండి తప్పిపోయిందని ఆమె తల్లి శిరీష ఇచ్చిన రిపోర్టు మేరకు పట్టాభిపురం పోలీసులు వెంటనే స్పందించి చుట్టుపక్కల విచారించి సీసీ కెమెరాల సహాయంతో గంట వ్యవధిలోనే బాలికను పీలకవాగు వద్ద ఆచూకీ కనుగొని బాలికను ఆమె బంధువులకు అప్పగించారు. బాలిక ఆచూరీక గంటలోనే కనుగొనడంతో తల్లి బంధువులు ఆనందం వ్యక్తం చేసి పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన

**గుంటూరు క్రైమ్, జూలై 29, ప్రభాతవార్త :** పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కూటమి



ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. స్థానిక 23వ డివిజన్ మస్తాన్ దర్గా వెనుక క్రాస్ నుండి చక్కలబజార్ వరకు రూ.50లక్షలతో 100మీటర్ల సిసి రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోనికి వచ్చిన వెంటనే కంకరగుంట బ్రిడ్జి నుండి 3బొమ్మల సెంటర్ వరకు బిటి రోడ్డును నిర్మించామని, అదేవిధంగా గత వైసీపీ నేతలు పోకడలతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్లతో మాట్లాడి దర్గా వెనుకరోడ్డు కొంత మేర పూర్తి చేయించామని, మిగిలిన రోడ్డుకు శంకుస్థాపన చేసి, త్వరలోనే ప్రజలకు అందు బాటులో తీసుకొస్తామని, ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరికి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కార్యక్రమంలో లామ్ వర్ధన్‌రావు, గంటా మౌలిక సాదు రాజేష్, దళవాయి కిశోర్, దర్శనపు యాకోబు, తోట సాంబశివరావు, ఖాన్, లామ్ నవమి, పులి పృధ్వి, రత్నకుమారి, ఆళ్ళ హరి, మొవ్వ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం

**రొంపిచర్ల, జూలై 29 ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ



కె.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. గంజాయి వంటి వాటిని కలిగి ఉండే అనుమానిత వ్యక్తుల నివాసిత ప్రాంతాలను తనిఖీ చేయాలన్నారు. అదే విధంగా పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్మానుష ప్రాంతాలు, అసంపూర్తిగా నిర్మించిన భవనాలపై నిఘా ఉంచాలన్నారు. ఎక్కువ మొత్తంలో గంజాయి సరఫరా చేసే వారిపై కేసు నమోదైతే ఆస్తులు జప్తు చేస్తామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.రవీంద్ర, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ రవి, ప్రసూన, ఎస్.రాజు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఉమాదేవి, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సునీత తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు : చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ

**బొల్లాపల్లి, జులై29, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఏపీ ప్రభుత్వ



చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని జయంతిరామాపురం, మేళ్ళవాగు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.వీ కూటమి నాయకులతో కలసి ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. జీ.వీ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని చంద్రబాబు మార్క్ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. గత వైకాపా హయాంలో పింఛన్లు మంజూరు చేయాలన్నా పెద్ద మొత్తంలో అవినీతి చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై వైకాపా చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

**గుంటూరు విద్య, జూలై 29, ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో స్థాని క బ్రాడీపేటలోని



శారదానికేతన్ ప్రాధమిక పాఠశాల్లో గుంటూరు వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పద్మావతి ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 105మంది విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ శిబిరానికి హాజరైయ్యారు. అలం కోకు సంబంధించిన టెక్నికల్ టీమ్ ఈ వైద్య నిర్ధారణ శిబిరంలో పరిశీలన చేసి వారికి అవసరమైన ఉపకరణాలను సూచించారు. కార్యక్ర మంలో గుంటూరు జిల్లా సహిత విద్యా విభాగం సమన్వయకర్త ఎన్.శ్రీనివాసరావు, సమగ్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి రమ్య, అసిస్టెంట్ జిసిడిఓ సుజాత, సీఎంఓ అనిల్ తదితరులు కార్యక్రమానికి హాజరై పిల్లలందరికీ సహకరించారు.

## శ్రీ మంగళగౌరీగా శ్రీకనక మహాలక్ష్మీ ప్రత్యేకాలంకరణ

**గుంటూరు కల్చరల్, జూలై 29, ప్రభాతవార్త :** స్థానిక సిద్దార్థనగర్ 11వలైనులోని శ్రీ కనకమహాలక్ష్మీ మందిరం వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో శ్రావణ మాస విశేష కుంకుమార్చనలు పండితుల వేదమంత్రాల నడుమ అమ్మ వారికి శ్రావణ మంగళవారం పూజ, కుంకు మార్చనలు విశేషంగా నిర్వహించి, ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులు మహిళలకు తీర్థప్రసాదాలను అందించారు.



### శిథిలావస్థకు చేరిన

## విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయం

### భయాందోళనలో ఉద్యోగులు

**చిలకలూరిపేట, జులై29, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం 2 అంతస్థులు శిథిలావస్థకు చేరు కున్నాయి. ఇందులో మొదటి గ్రౌండ్‌ఫ్లోర్‌ను 2008వ సంవత్సరంలో నిర్మించారు. మొదటి అంతస్తును 2013లో నిర్మించారు. కాగా మొదటి అంతస్తు 12సంవత్సరాల కాలానికే శిథిలావస్థకు చేరుకొని శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. క్రింద అంతస్తు లో కూడా అదే పరిస్థితి నెలకొని ఉన్నది. ఈ భవనంలో పట్టణానికి సంబందించిన ఇద్దరు ఎఈలు, రూరల్ మండలానికి చెందిన ఎఈ కార్యాలయాలు 3 ఉన్నాయి. పై అంతస్తులో సబ్‌డివిజన్ కార్యాలయం ఉంది. కాగా దీనిలో పనిచేస్తున్న 4 కార్యాలయాలకు సంబందించి ఉద్యోగులు దినదినగండంగా ఉద్యోగం నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ సమయంలో శ్లాబ్ పెచ్చులూడి నెత్తిమీద పడతాయన్న భయాందోళనలో ఉన్నారు. అసలే వర్షాకాలం కావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఈ4 కార్యాలయాలను అద్దెభవనంలో మార్చేందుకు అనుమతి ఇవ్వవలసినదిగా ఇప్పటికే సబ్‌డివిజన్ కార్యాలయం నుంచి ధరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనాన్ని సందర్శించి వెంటనే ఈ శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టవలసినదిగా ఉద్యోగులతో పాటు, ప్రతిరోజు ఆ కార్యాలయాలకు వచ్చే వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు. తమ పనిమీద వచ్చినప్పుడు భవనం పెచ్చులూడి పడే ప్రమాదం ఉండటంతో వచ్చినవారు భవనం పైకి చూసు కుంటూ అధికారులతో త్వరత్వరగా మాట్లాడి బైటకి వెళ్లిపోతున్నారు. కానీ ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులు మాత్రం తప్పనిసరి పరిస్థితుల లో వాటి కిందనే కూర్చోని ఉద్యోగం చేయవలసిన పరిస్థితి నెలకొని ఉన్నది. ఈ ప్రమాదకర పరిస్థితులనుంచి వారిని త్వరితగతిన కాపాడవలసినదిగా పట్టణ ప్రజలు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు





## ఏపి చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ తుషార్‌డూడి

**బాపట్ల, జులై29, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌ను జిల్లా ఎస్పీ తుషార్‌డూడి మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.



## చేయి చేయి కలుపుదాం

## బంగారు కుటుంబాల జీవితాలను మారుద్దాం

### వివిధ అసోసియేషన్లతో ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు, జులై 29, (ప్రభాతవార్త) :** సమాజంలో మానవ సంబంధాలను మెరుగు పరిచి, ఆర్థిక అంతరాలను దూరం చేసే మహత్తర కార్యక్రమం పి-4అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్స్, పెట్రోల్ బంక్ యజమానులు, హోటల్స్ యజమానుల అసోసియేసన్లతో మంగళవారం విడివిడిగా పీ-4పై సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేసిన పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలవబోతుందని తెలిపారు. మానవత్వాన్ని మేల్కొలుపుతూ పేద వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమం గేమ్ చేంజర్ అని చెప్పారు. ప్రతి ఒక్కరూ మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగా మాత్రమే కాకుండా నైతికంగా మద్దతు ఇవ్వాలని చెప్పారు. విద్య, వైద్య పరంగా అండగా నిలవడం ద్వారా బంగారు కుటుంబాలను మెరుగైన స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 25వేలు బంగారు కుటుంబాలు ఉన్నాయని, అందరి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు.




## నాగార్జున సాగర్‌లో అద్భుతం

### 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి!

**విజయపురిసౌత్, జులై 29 ప్రభాతవార్త:** దాదాపు 18 ఏళ్ల తర్వాత నాగార్జునసాగర్ జలాశయంలో అద్భుతం జరిగింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద కారణంగా నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్లు ఇవాళ తెరచుకున్నారు. ఎగువ శ్రీశైలం నుంచి భారీ వరద ప్రవాహం పోటెత్తడంతో మంగళవారం ఉదయం 11 గంటలకు నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా తెలంగాణ మంత్రులు నీటిని విడుదల చేశారు. భారీ నీటి పారుదల, పౌరసరఫరాల, ఆహార శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల, మైనార్టీ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నీటి విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనుకున్నదానికంటే ముందే క్రస్టుగేట్ల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ప్రధానని జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేశారని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన కుమార్తె ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పూర్తిచేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. ఈ జలాశయం ద్వారా 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోందన్నారు. తెలంగాణ వరి పండించడంలో రికార్డుస్థాయిలో ఉందని మంత్రి ఉత్తమ్ సంతోషం వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని స్పష్టం చేశారు. జులైలోనే నాగార్జునసాగర్ నిండటం 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు అజయ్‌కుమార్, డ్యాం, గేట్స్ డివిజన్ డీఈ కె.శ్రీకాంత్, కేంద్ర బలగాల అధికారులు సూపరింటెండెంట్ ఇంజినీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జూలై29, ప్రభాతవార్త:** అసలు ఎప్పటికి, ఎవరూ బాగుచేయని విధంగా రాష్ట్రాన్ని తాము నాశనం చేసినా, చంద్రబాబు, కూటమి ప్రభుత్వం తిరిగి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా, వడివడిగా అడుగులు వేయడాన్ని జగన్ అండ్‌కో జీర్ణించుకోలేక పోతున్నారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తాము సృష్టించిన ఆర్థిక లోటును భర్తీ చేస్తూ, ప్రజలు మెచ్చేలా సంక్షేమపథకాలు అందిస్తూ, మరోవైపు రాష్ట్రాభివృద్ధికి కీలకమైన పెట్టుబడులు సాధించేందుకు, కంపెనీలను ఆకర్షించేందుకు, చంద్రబాబు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడాన్ని జగన్ భరించలేక పోతున్నాడని ప్రత్తిపాటి తెలిపారు. తనకున్న మానసిక రోగం రోజురోజుకు ఎక్కువైపోతూ జగన్ ప్రశాంతంగా ఉండలేక పోతున్నాడని ప్రత్తిపాటి తెలిపారు. ఆ భరించలేని ప్రవర్తనతోనే చంద్రబాబు గొప్ప సదుద్దేశంతో చేపట్టిన సింగపూర్ పర్యటనపై తన అవినీతి మీడియాలో, వైసిపి వారితో బురద చల్లిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు కృషి ఫలించి సింగపూర్ పర్యటన ఫలప్రదమై రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే ప్రజలు తన కుట్ర రాజకీయాలు నమ్మరన్న దుర్బుద్ధితోనే జగన్ దుష్ప్రచారానికి తెగబడ్డాడని ప్రత్తిపాటి వివరించారు. సింగపూర్ ప్రభుత్వం, ఆదేశ పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు వెల్లడించే అంశాలు, రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల వినియోగంపై పూర్తి సానుకూలత వ్యక్తం చేస్తుండటం నిజంగా రాష్ట్రా పారిశ్రామిక అభివృద్ధికి శుభసూచికమైతే, జగన్‌కు, వైసిపికి మాత్రం మింగుడు పడని అంశమైందని అన్నారు.



**జగన్‌కు శిరోభారం–వైసిపికి రాజకీయ సమాధి..**

జగన్ ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుయుక్తులు పన్నినా గత ఎన్నికలలో ప్రజలు ఆయన్ను నమ్మలేదని అన్నారు. ఐదేళ్ల రాక్షస పాలనకు అంతం పలికి భారీ మెజారిటీతో కూటమి పార్టీలను గెలిపించి, జగన్‌ను కేవలం 11 స్థానాలకే ప్రజలు పరిమితం చేశారని అన్నారు. ప్రజలు పచ్చగా ఉంటే, రాష్ట్రం సుభిక్షింగా ఉంటే చూసి తట్టుకోలేని తన విపరీత మనస్తత్వం తనకే చేటు తెస్తుందని జగన్ గ్రహించలేక పోతున్నాడని అన్నారు. చంద్రబాబు సంకల్పం, పట్టుదలముందు జగన్ దుర్మార్గపు రాజకీయం నిలవదని అన్నారు. రాష్ట్రాభివృద్ధే తన లక్ష్యంగా ప్రజలు కష్టాలు తొలగింపే ధ్యేయంగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్న చంద్రబాబును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో అందించిన సుపరిపాలనతోనే జగన్‌కు ఏకధారగా కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. మిగిలిన నాలుగేళ్లలో చంద్రబాబు చేసే అభివృద్ధి, ప్రజలకు అందించే విలువైన సంక్షేమంతో జగన్‌కు భరించలేని శిరోభారం, ఆయన పార్టీ రాజకీయంగా సమాధి కావడం తథ్యం అని ప్రత్తిపాటి వివరించారు.

# అభివృద్ధే అజెండాగా సిఎం చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన

**-ఏపి ఐడిసి చైర్మన్ దేగలప్రభాకర్**

**గుంటూరు క్రైమ్, జూలై 29, ప్రభాతవార్త :** పడగొట్టడం అంటే ఏమిటో ఐదేళ్ళ పాటు వైసీపీ ప్రభుత్వం, జగన్మోహనరెడ్డి చూపించారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర మ్న్ దేగల ప్రభాకర్ ఆరోపించారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం సీఎంగా చంద్రబాబు నిలబెట్టడం అంటే ఏమిటో చూపిస్తున్నా న్నారు. నిలబెట్టాలన్నా.. నిర్మించాలన్నా చంద్రబాబుతోనే సాధ్యం అని మరోసారి సింగపూర్ టూర్ ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ క్లారిటీ వచ్చిందని పేర్కొన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాల గురించి వాళ్ళూ...వీళ్ళూ చెప్పడం కాదు...ఏకంగా సింగపూర్ దేశానికి చెందిన కీలక మంత్రే చెప్పారంటే నాటి వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు ఎల్లలు దాటి వెళ్ళాయని అర్ధమవు తుందన్నారు. డిజిటల్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి సింగపూర్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్ని కార్యకలాపాలు మొదలయ్యాయని పేర్కొన్నారు .2014–19లో ఏపి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించామని 2019లో ప్రభుత్వం మారాక (వైసీపీ వచ్చాక) ప్రాజెక్టులు రద్దు చేయడంతో వెనక్కి పోయాయని, చంద్రబాబు నాయుడు పై విశ్వాసంతో ఏపిలో భాగస్వామ్యం కొనసాగించేందుకు మేం మళ్ళీ ముందుకు వచ్చాం టాన్ సీలెంగ్, సింగపూర్ వాణిజ్యశాఖ మంత్రి చేసిన ప్రకటనతో క్లారిటీ వచ్చిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ అండ్ ఎంట్రప్రెన్యూవర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0, డ్రోన్, ఏపి క్లీన్ ఎనర్జీ పాలసీ, ఐటి అండ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0టూరిజం వంటి 23పాలసీలు, పరిశ్రమల నిర్మాణాలకు శరవేగంగా అనుమతులు ఇవ్వడంపై జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలు రాష్ట్రంలో మొదలు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇదీ సిబిఎన్ బ్రాండ్ ...ఇది చంద్రబాబు కి ఉన్న విశ్వసనీయత, చంద్రబాబు బ్రాండ్ కన్‌స్ట్రక్షన్ అయితే జగన్ బ్రాండ్ డిస్ట్రక్షన్ ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే జగన్ బ్రాండ్ విధ్వంసమని క్లారిటీ వచ్చింది...ఇప్పుడది అంతర్జాతీయ వేదికల మీద స్పష్టంగా వెల్లడైంది. ఇంత జరిగినా ఆ పార్టీకి ఇంకా బుద్ధి రాలేదు. ఇంకా కుట్రలు పన్నుతూనే ఉంది. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు నిరాటంక ప్రయత్నాలు చేస్తూనే ఉంది. రాష్ట్రప్రతిష్టను మరోసారి ప్రపంచానికి చంద్రబాబు నాయుడు చాటి చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు పై విశ్వాసంతో సింగపూర్ కంపెనీలు రాష్ట్రానికి వస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రతిష్టను బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నారు. సింగపూర్ వాణిజ్య శాఖామంత్ర టాన్సీ లెంగ్ చేసిన వ్యాఖ్యాలకు జగన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు.



## ఆనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోండి : మునిసిపల్ కమిషనర్

**చిలకలూరిపేట, జూలై29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జిఓయంయస్ నెంబర్.134, తేది 26-7-2025 నందు రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం 2020నకు సవరణలు ప్రకటించి ఉన్నారని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ పథకం క్రింద చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో ది 30-06-2025కు ముందు వేసిన అనధికార లేఅవుట్‌లు, నాన్ లేఅవుట్‌లలోని ప్లాట్లు నిర్ణీత అపరాధ రుసుము 14శాతానికి బదులుగా 7శాతం ఓపెన్ స్పేస్ ఖరీదు మాత్రమే చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకొనుటకు అవకాశం కల్పించింది. ఈ క్రమబద్ధీకరణ ధరఖాస్తులు దాఖలు చేసుకొనుటకు ది 26-7-2025 తేదినుండి 90 రోజులలోపు ధరఖాస్తులను అపరాధ రుసుం చెల్లించి ఆన్‌లైన్ ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌నందు దాఖలు చేయవచ్చునని ఆయన వివరించారు.



## జెవివి ఆధ్వర్యంలో డాక్టర్ సి నారాయణరెడ్డి జయంతి

**చిలకలూరిపేట, జులై29, ప్రభాతవార్త:** పట్టణం లోని ఆర్‌విఎస్‌సివిఎస్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక, లాలూదాదాసాహెబ్ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగెళ్ల సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పివి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ నారాయణరెడ్డి రాసిన



కావ్యాల గురించి వివరించారు. నారాయణరెడ్డి రాసిన గజల్స్, ప్రపంచపదులు పాడి వినిపించారు. బాల సాహితీవేత్త, జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ డాక్టర్ సి నారాయణరెడ్డి 3వేలకు పైగా సినిమా పాటలు రాసారన్నారు. బాలగేయాలు కూడా అనేకం రాసారని అన్నారు. తెలుగుజాతిమనది, భారతమాతకు జేజేలు వంటి దేశభక్తి పాటలు రాసి పిల్లలకు దేశభక్తి ఉద్బోధించారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దీనిలో భాగంగా పాఠశాల గ్రంధాలయానికి రూ 3వేలు విలువైన బాలసాహిత్య గ్రంధాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ సిద్దాంతి కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణమండపం ప్రధాన కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


## బీకం శ్రీనివాసింగ్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, తెదేపా నాయకులు

**చిలకలూరిపేట, జూలై29, ప్రభాతవార్త:** పట్టణంలోని బొందిలపాలెంకు చెందిన టిడిపి నాయకుడు బీకం శ్రీనివాసింగ్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పసుమర్రు వీరాల ఓడరేవు రాష్ట్ర రహదారిపై సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో శ్రీనివాసింగ్ అక్కడికక్కడే మరణించాడు. కాగా ఆయన భౌతిక కాయాన్ని చిలకలూరిపేట మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా మంగళవారం సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. చైర్మన్‌తో పాటు పార్టీ నాయకులు షేక్ సమద్‌ఖాన్, మద్దిబోయిన శివ, బాలాజీసింగ్, సయ్యద్ మహబ్, మాధవసింగ్, అద్దంకి అనితాబాబు, ఆ వార్డు టిడిపి నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.



## చిలకలూరిపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గణపవరం హైస్కూల్‌లో సీడ్‌బాల్స్ తయారుచేయు కార్యక్రమం

**నాదెండ్ల, జూలై29, ప్రభాతవార్త:** గణపవరం గ్రామంలోని శ్రీ కెల్లంపల్లి భద్రావలం జిల్లా పరిషత్ విద్యార్థిని, విద్యార్థులచే సీడ్‌బాల్స్ తయారు చేయించే కార్యక్రమాన్ని చిలకలూరి



ఉన్నత పాఠశాల నందు మంగళ వారం చిలకలూరిపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ డైరెక్టర్ దండా లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో సేకరించిన వివిధ రకాల విత్తనాలను పాఠశాల పేట రోటరీక్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణనాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి బోడి రామసుబ్బా రావు, అగ్రి కల్చరల్ అసిస్టెంట్ ఉప్పుటూరి భరత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది

**నాదెండ్ల, జూలై29, ప్రభాతవార్త:** మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల వ్యవసాయశాఖ విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొని రైతులకు వ్యవసాయంపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఇందిర, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు, గ్రామ పంచాయితీ సర్పంచ్ కామినేని లలితానాగేశ్వరరావు, గుర్రం ఉపేంద్ర, పునాటి కోటేశ్వరరావు, గుర్రం రాఘవరావు, గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకారణాల నిర్ధారణ శిబిరం

**కొల్లూరు, జులై 29 (ప్రభాతవార్త) :** సమగ్ర శిక్ష ఏఐఎల్ఎస్‌కో సంయుక్త ఆధ్వర్యంలో 31వ తేది గురువారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఎంపీపీ ఎస్‌బిఎఫ్ఎస్ కొల్లూరు నందు నిర్వహించబడుతుందని వేమూరు నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని 18సంవత్సరాలు లోపు వయస్సు గల విద్యార్థులు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు సదరన్ సర్టిఫికెట్, కాస్ట్ సర్టిఫికెట్, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకుని ఈ శిబిరమునకు హాజరు కావాలని మండల విద్యాశాఖ అధికారిని విఎస్ జ్యోతి మంగళవారం తెలియజేశారు. వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, భట్టిప్రోలు, చుండూరు మండలంలో గల ప్రత్యేక అవసరములు గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

# రావికంపాడు, క్రాప గ్రామాల్లో పొలం పిలుస్తుంది

**కొల్లూరు, జులై 29 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని రావికంపాడు, క్రాప గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జింకు దాతు లోకం గుర్తించిన వెంటనే 2గ్రాములు జింక్ సల్ఫేట్ మరియు 5గ్రాములు యూరియా చొప్పున కలిపి ఐదు రోజులు వ్యాధులు 2,3సార్లు పిచికారి చేయాలని రైతులకు తెలియజేశారు. రైతులకు మండల వ్యవసాయ అధికారి ఈ పంట




నరేంద్రబాబు ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన గ్రామ సభలలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వేద పద్ధతిలో నాటిన వరి పంటను పరిశీలించారు. వరి పంటలో నాటిన 10నుండి20రోజుల వ్యవధిలో జింక్ లోకంలో గుర్తించడం జరిగిందన్నారు. జింక్ లోపం లక్షణాలు పై నుంచి రెండు లేదా నాలుగు ఆకులలో మధ్య ఈనె పాలిపోతుందన్నారు. నాటిక రెండు నుండి 4లేదా 6వారాలలో ముదురాకు చివరిలో మద్యైనకు విరూపక్కల తప్పులేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయని, ఆకులు చిన్నవిగా తెలుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయన్నారు. మొక్కలు గిరసబాఇ దుబ్బి, చేయవు, నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చబడదు, చలి విపరీతంగా ఉండే దాల్వ వరిలో సారోవరకంటే ఎక్కువ జింకు దోతులోపం కనిపిస్తుందన్నారు. చేపించుకొనుటకు సర్వర్ వచ్చి ఉన్నదని, ప్రతి ఒక్క రైతు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మరియు ఫోన్ నెంబర్ మీ అందుబాటులో ఉన్న రైతు సేవ కేంద్రంలో వివిఎ, పీహెచ్ఏలకు మీ వివరాలు అందించి వరి పంట రకం ఏది చేశారో తెలియజేసి ప్రతి ఒక్క రైతు ఈ పంట చేపించుకోవాల్సిందిగా రైతులకు తెలియజేశారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందించారు. మండలంలోని కౌలు రైతులందరూ మీ అందుబాటులోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి సిసిఆర్సి గుర్తింపు కార్డులు పొందే జేఎల్‌జి గ్రూపులుగా ఏర్పడి బ్యాంకు నందు రుణాలు పొందవలసిందిగా ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎం.ప్రభాకర్‌రావు, బి.ఎన్.వంశీ, వివిఏబి సాంబనాయక్, కేఆర్ మాధురి, రైతులు పాల్గొన్నారు.

# త్వరలో వైకాపాకి చెందిన అన్ని విభాగాల్లో కమిటీ ఏర్పాటు

**సత్తెనపల్లి టౌన్, జులై 29(ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి నీ కలిసిన వైఎస్ఆర్సీపీ గుంటూరు మరియు పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల సెక్రటరీ షేక్ మస్తాన్ వలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు గుంటూరు మరియు పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల ఇన్చార్జ్ షేక్ మస్తాన్ వలి సత్తెనపల్లి నియోజకవర్గ పట్టణ మరియు మండల అనుబంధ విభాగాల ఏర్పాటు పై చర్చించ టానికిసత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తడాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి నీ కలిసి కమిటీలు త్వరితిగతిన పూర్తిచేయాలని కోరిన మస్తాన్ వలీఈ సందర్భంగా సుధీర్ భార్గవరెడ్డిమాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అనుబంధ విభాగాల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తను గుర్తించి మరియు ప్రజల్లో గుర్తింపు ఉన్న కార్యకర్తలకు పార్టీ పదవుల్లో స్థానం కల్పిస్తామని, అతి త్వరలో పార్టీకి చెందిన అన్ని విభాగాల్లో కమిటి లో నియామకాలను పూర్తి చేసి తద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో సత్తెనపల్లి లో విజయం సాధించి వైయస్ఆర్సీపీ జెండా ఎగిరేలా ప్రణాళికలు రూపొందిస్తామని తెలియజేశారు.



# నాట్స్ పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు) సేవలు ప్రశంసనీయం

**పెదనందిపాడు జులై 29, (ప్రభాతవార్త) :** పెదనందిపాడు నివాసి. ఉత్తర అమెరికా తెలుగు సంఘం పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు) పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని సుప్రీం కోర్ట్ మాజీ న్యాయ మూర్తి లావు నాగేశ్వరరావు, విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు లు అన్నారు. మంగళవారం పెదనందిపాడు లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో నూతి అభివృద్ధికి వారు అందిస్తున్న సహాయ సహకారాలు పలువురు దాతలకు మార్గదర్శకం కావాలన్నారు. అతిధులు లావు నాగేశ్వర రావు, లావు రత్తయ్య లు మాట్లాడుతూ నాట్ ఆధ్వర్యంలో బాపయ్య ఈ ప్రాంతానికి చేస్తున్న సేవల పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి కృషికి తాము కూడా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సందర్భంగా బాపయ్య చౌదరి తల్లిదండ్రులు నూతి సుబ్బారావు సీతాదేవిలను పలువురు ప్రముఖులు. పాఠశాల ఉపాధ్యాయ లు



బాపయ్య చౌదరి, మిత్ర బృందం సహకారంతో 13 లక్షల వ్యయంతో నిర్మించిన విద్యార్థుల భోజనశాలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకుమాను నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను విద్యార్థులు వినియోగిం చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెదనంది పాడులో విద్యారంగ వ్యాప్తికి నూతి బాపయ్య చౌదరి. వారి మిత్రబృందం చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, నాట్స్ అధ్యక్షులు మందాడి శ్రీధర్, నాట్స్ ఉపాధ్యక్షులు భీమినేని శ్రీనివాస రావు, నాట్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మాదాల రాజేంద్ర, గ్రామ ప్రముఖులు నర్రా బాలకృష్ణ, రావి శివరామకృష్ణయ్య, పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి శ్రీనివాసరావు, పూర్వ ప్రధానో పాధ్యాయులు ఎన్ లక్ష్మీ దుర్గ. వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్ రావు. పలువురు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంటల సాగు చేసే రైతులు బీమా చేయించుకోవాలి : ఏవో

**యడ్లపాడు, జులై 29, ప్రభాతవార్త :** పంటలు సాగు చేసే రైతులు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాలలో నిర్వహించిన పొలం పంటల బీమా పథకం ఖరీఫ్ 2025 నుంచి అమలు చేస్తుందన్నారు. మండలంలో పత్తి పంటను సాగుచేసే రైతులు ఎకరాకు 1900ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టం కలిగినట్లయితే




బడి కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. పునర్వ్యవస్థీకరింపడిన వాతావరణాధిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అఫ్ ఇండియా ద్వారా వాతావరణంలో వచ్చే పునర్వ్యవస్థీకరింపడిన వాతావరణ అధారిత బీమా మొత్తం 38000 పొందవచ్చునన్నారు. వ్యవసాయం రుణం పొందని రైతులు దగ్గర్లోని కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవ, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలన్నారు. బీమా ప్రీమియం చెల్లింపు 31వ తేది వరకు గడువు ఉందని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పీఎంఆర్‌కెవివై రైతులకు శిక్షణ

**నూజెండ్ల, జులై29, ప్రభాతవార్త:** మండలంలోని ఐనవోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని పాత చెరువుకొమ్ముమారిపాలెం గ్రామంలోని రైతులకు ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజనపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.శివకుమారి పాల్గొన్నారు. కలుపు మందులు మోతాదు వివరాలు, జీవన ఎరువులు వ్యవ సాయంలో వాటి ప్రాముఖ్యత, పంట అవశేషాలా యాజమాన్యం, నేల ఆరోగ్య పరిరక్షణ, విత్తన శుద్ధి వల్ల కలిగే ఉపయోగాలు, వరి, మిరప పంట యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో ఎం. అరుణ, మండల ఏవో ఆంజనేయులునాయక్, వ్యవసాయ సహాయకులు కె. ప్రవల్లిక, జి.మణికంఠ, వై.గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# వరి యాజమాన్యంపై రైతులకు అవగాహన

**వినుకొండ, జులై29, ప్రభాతవార్త:** వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకంచర్ల గ్రామంలోని రైతులకు వరి పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం. శివకుమారి, మండల వ్యవసాయాధికారి జి. వరలక్ష్మిలు హాజరయ్యారు. వరి యాజమాన్య పద్ధతులు, విత్తన రకాలు, జీవన ఎరువుల వాడకం, చీడపీడల నివారణ గూర్తి అవగాహన కల్పించారు. పంటల భీమా పథకంను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వరి పంటకు ఆగస్టు 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ, వినుకొండ ఏఈవో ఆరిఫ్, వీఏఏ యశ్వంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యం : ఎంపిడివో ఉమాదేవి

**నూజెండ్ల, జులై29, ప్రభాతవార్త:** గర్భిణీలు, బాలింత మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపిడివో ఉమాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నూజెండ్ల ఎంపిడివో కార్యాలయం నందు పౌష్టికాహారంపై ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, పాలిచ్చే తల్లులు సమపాళ్లలో పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దీపికా మంజూష, ఏపిఎం ఇందిరా, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు విన్యాసమ్మ, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# కరెంటు చార్జీలు తగ్గించాలి : సిపిఎం డిమాండ్

**పెదనందిపాడు జులై 29 (ప్రభాతవార్త) :** స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే అదనంగా వసూలు చేసిన 2,787 కోట్ల రూపాయలను వినియోగదారులకు చెల్లించాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు.



మంగళవారం పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని నాగులపాడు, పెదనందిపాడు, కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాలలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజానీకం భారీ స్థాయిలో విద్యుత్ భారాలను మోస్తున్నారని, కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ భారాలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ ఏడాది పాలనా కాలంలో విద్యుత్ ఛార్జీల భారం తగ్గకపోగా మరింత పెరిగిందని, స్మార్ట్ మీటర్లను ఆఫీసులకు, వ్యాపార సంస్థలకు బిగించారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి బిగించేందుకు ఆదాని కంపెనీ వ్యక్తులు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, ముందుగా రీఛార్జి చేసుకుంటేనే కరెంటు వస్తుందని, మీటర్ కు అయ్యే ఖర్చు ప్రజల మీద నెలవారీగా బిల్లులు వేసి వసూలు చేస్తారని తెలిపారు. సాధారణ సమయాల్లో ఒక రేటు, మనం ఎక్కువగా కరెంటు వాడుకునే సమయంలో అదనపు రేటు వసూలు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ మొత్తం ఆదాని కంపెనీకి అప్పగించేందుకు జరిగే సన్నాహాల్లో భాగంగా ఇదంతా జరుగుతుందని, దీని ఫలితంగా వ్యవసాయదారులకు, ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు ప్రస్తుతం ఇచ్చే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని పేర్కొన్నారు. మిగతా వినియోగదారులపై కూడా ఇప్పటికంటే అనేక రెట్లు విద్యుత్ భారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఈరోజు పలు గ్రామాలలో కర పత్రాల ప్రచారం, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 5వ తేదీన పెదనందిపాడు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ప్రజల పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నడింపాలెంలో పొలం పిలుస్తోంది

**ప్రత్తిపాడు జులై 29 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నడింపాలెం గ్రామంలోనీ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి ఎస్.కె సుగుణ బేగం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని అలా చేసుకోవడం వలన రైతులు వారి పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి, ఏదైనా పంట నష్టం పరిహారం పొందాలన్న తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని అన్నారు. అదే విధంగా రైతులకు 20 శాతం సబ్సిడీపై కిసాన్ డోన్స్ అందుబాటులో ఉన్నాయని డోన్స్ కావలసిన రైతులు ఐదుగురు సభ్యులు కలిసి గ్రూప్ గా ఏర్పడి మీసేవ కేంద్రాలు సంప్రదించినట్ల అయితే బ్యాంకు ద్వారా లోన్ ఇప్పించటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ సహాయకులైన కె.వి రాజేష్ బాబు మాట్లాడుతూ రైతులకు పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు అదేవిధంగా గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



## భాజపా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

**చిలకలూరిపేటటౌన్, జులై 29, ప్రభాతవార్త:** పట్టణంలోని బిజెపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ



సమావేశంలో ఆగష్టు 4వ తేదిన పల్నాడు జిల్లా నరసరావుపేటకు మొట్టమొదటిసారిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ విచ్చేయు సందర్భంగా జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమానికి చిలకలూరిపేట నియోజకవర్గంనుంచి పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోట పవన్‌గాంధి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు పోట్రు పూర్ణచంద్రరావు, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, మాజీ కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు తూబాటి రాజ్యలక్ష్మి, బండారు నాగరాజు, ఆలా శివకోటిరెడ్డి, గోరంట్ల పిచ్చయ్య, దండా వెంకటశ్రీనివాస కుమార్, ఉప్పాల భాస్కరరావు, మాచర్ల శ్రీనివాసరావు, రావికింది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేయూ ప్రాంతాలు

**చిలకలూరిపేట, జులై29, ప్రభాతవార్త:** పట్టణంలోని పురుషోత్తమపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని పురుషోత్తమపట్నం ఫీడర్‌లో లైన్ల మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణంగా టౌన్2 పరిధిలోని పురుషోత్తమపట్నం, కోటప్పకొండ రోడ్ ప్రాంతాలలో బుధవారం ఉదయం 9గంటలనుంచి మద్యాహ్నం 3 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

## ప్రభుత్వ ట్యాబ్‌ల పంపిణీ

**ఫిరంగిపురం, జులై 29 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలోని 29వ వార్డులో మెప్మా రీసోర్స్ వర్కర్లకు వార్డు టిడిపి అధ్యక్షులు వనమా పవన్‌కుమార్ ప్రభుత్వ ట్యాబ్‌లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఉద్యోగులకు ట్యాబ్‌లు అందజేయడం ద్వారా సేవలను సులువుగా అందించే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేసేందుకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆర్‌పిలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయసాధనకు కృషి చేయాలని వనమా పవన్ కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్.అఖిల, బచ్చే మస్తాన్, వీరాంజనేయులు, ముస్తఫా, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థినుల ప్రతిభ

**రొంపిచర్ల, జులై 29 ప్రభాతవార్త :** డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థినులు మంచి ప్రతిభ చూపి అత్యధిక మార్కులను సాధించారు. వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. బిసిఏలో పి.కీర్తన 93 శాతం, బిసిఏలో కె.నీరజ 93 శాతం, బిఎస్సీలో కె.భవ్య సాహితీ 91 శాతం, కె.అఖిల 90 శాతం, వై.లక్ష్మితిరుపతమ్మ బికాంలో 87 శాతం మార్కులను సాధించారు. యూనివర్శిటీ స్థాయి మార్కులను సాధించడంతో పాటు అన్ని గ్రూపులలో అత్యధిక శాతం పాస్ పర్సంటేజ్‌ను తమ విద్యార్థులు అందుకున్నారని తెలిపారు.



## మాజీ సైనిక ఉద్యోగులు కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**రొంపిచర్ల, జులై 29 ప్రభాతవార్త :** మాజీ సైనిక ఉద్యోగులు కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సైనిక సంక్షేమ అధికారి గుణశీల



కోరారు. మంగళవారం మాజీ సైనికుల సంఘం నాయకులు మధిర సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు తెలియజేశారు. ప్రత్యేకంగా మాజీ సైనిక ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు విద్య, వైద్యానికి సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్నారు. మాజీ సైనిక ఉద్యోగులు మరణించి పిల్లలు అనాథలు అయితే వారి విద్యకు సంబంధించి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అదే విధంగా మాజీ సైనిక ఉద్యోగుల పిల్లల వివాహానికి సంబంధించి ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఇంజనీరింగ్, మెడిసిన్, బిబిఏ, ఎంబిఏ వంటి చదువులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. ఖచ్చితంగా మాజీ సైనిక ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అదే విధంగా వారికి ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలియజేశారు.

## డిగ్రీ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థులకు మంచి మార్కులు

**నకరికల్లు, జులై 29 ప్రభాతవార్త :** ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రకటించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో వాగ్దేవి డిగ్రీ విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు రామ కోటేశ్వరరావు, ఒగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు తదితరులు విద్యార్థులను అభినందించిన వారిలో ఉన్నారు. బిఎస్సీ హానర్స్‌లో నీలిమ, జి.మాధవి, ఎం.మౌనిక రెడ్డిలు 92 శాతానికి పైగా మార్కులను సాధించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎన్.శ్యామల, సి.హెచ్.శివాని, కె.లక్ష్మిదేవిలు 91 శాతానికి పైగా



మార్కులను పొందారు. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఆర్.అఖిలాండేశ్వరి, శిరీష, నాగలక్ష్మి అత్యధిక మార్కులను సాధించిన వారిలో ఉన్నారు. అదే విధంగా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఉషశ్రీ, వైష్ణవి, త్రివేణి కాలేజ్ టాపర్స్‌గా నిలిచారు. ఓవరాల్‌గా అన్ని గ్రూపులలో 92 శాతం పాస్ పర్సంటేజ్‌ను తమ విద్యార్థులు సాధించారని వారు తెలియజేశారు.

## ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**నకరికల్లు, జులై 29 ప్రభాతవార్త :** ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు వి.తులసి



తన్మయ్, ముప్పాళ్ళ సాయిశ్రీకర్‌లు 10వ జాతీయ జూనియర్ అండ్ సీనియర్స్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలలో పాల్గొని మూడు కాంస్య పతకాలను సాధించారు. మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ విజయవాడలోని ఇండోర్ స్టేడియంలో ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. 73 కేజీల విభాగంలో ముప్పాళ్ళ సాయిశ్రీకర్ రెండు కాంస్య పతకాలను సాధించారన్నారు. అదే విధంగా నర్సింగ్ విద్యార్థిని తులసి తన్మయ్ 46 కేజీల విభాగంలో పాల్గొని కాంస్య పతకం అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు వై.మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

**నకరికల్లు, జులై 29 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ యస్. ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కిమ్స్ శికర ఆసుపత్రి, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజెన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మెదడు, నరాల సంబంధిత వ్యాధులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మెదడు, నరములకు సంబంధించిన వ్యాధుల గురించి డాక్టర్ ప్రదీప్ సమాచారాన్ని తెలియజేశారు. ముందుగా వ్యాధి లక్షణాలను గుర్తించడం వలన చికిత్స ఫలితాలు సానుకూలంగా ఉంటాయన్నారు. అదే విధంగా పక్షవాతం వంటివి దరి చేరిన సమయాన్ని సకాలంలో గుర్తించి వైద్యశాలకు తీసుకురావడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లంకా వివేక్ తదితరులు పాల్గొన్నారు.



## అవగాహనలో సినారె జయంతి

గుంటూరు కల్చరల్, జులై 29, ప్రభాతవార్త : బహుభాషా కోవిదుడు, మహకవి, సాహితీ శిఖరం, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప పరిశోధకుడు, విమర్శకుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని అవగాహన సంస్థ ఆధ్వర ్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో నివాళులర్పించారు. అవగాహన సంస్థ కార్యాలయంలో సాహితీవేత్త సినారె జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు మాటా ్లడుతూ సాహితీ ప్రియులందరికీ సినారె సుపరిచితుడైన సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యమే కాదు, యావత్ భారతీయ సాహిత్యం గర్వించదగ్గ సాహితీమూర్తి అన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఆత్మహత్య మార్గం కాదు

### క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల ప్రభావం జీవితాంతం బాధను మిగులుస్తుంది : బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల, జులై29, ప్రభాతవార్త:** క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల ప్రభావం జీవితాంతం బాధను మిగులుస్తుందనీ, యువత మనోధైర్యాన్ని కోల్పోకూడదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ అన్నారు. ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుండి వెళ్లిపోయిన యువతిని రక్షించి క్షేమంగా వారి కుటుంబ సభ్యులకు మేదరమెట్ల పోలీసులు మంగళవారం అప్పగించారు. వివరాలలోకి వెళితే కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన 25 సంవత్సరాల వయస్సు గల యువతి తను ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుని సూసైడ్ నోట్ రాసి తన సెల్ ఫోన్ ను కూడా ఇంటిలోనే వదిలి వెళ్ళిపోయింది, సూసైడ్ నోట్ ను చూసిన యువతి తల్లిదండ్రులు మేదరమెట్ల పోలీస్ స్టేషన్ కు వచ్చి రిపోర్ట్ ఇచ్చినారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మోయిన్ సూచనలతో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో మేదరమెట్ల ఎస్సై వారి సిబ్బందిని వివిధ బృందాలుగా ఏర్పాటు చేసి యువతి ఆచూకీ కోసం గాలించినారు. ఆమె వెళ్ళిన మార్గంలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తూ వెళ్లగా ఆమె గుంటూరు వైపు వెళ్ళిన బస్సు ఎక్కినట్లు గుర్తించారు. వెంటనే ప్రత్యేక పోలీస్ బృందాలు ఆ మార్గంలోని మార్టూరు, చిలకలూరిపేట, గుంటూరు, విజయవాడ వంటి పలు బస్టాండ్లలో వెతికినారు. సిసి కెమెరాల ఆధారంగా ఆమె



విజయవాడ బస్టాండ్ లో దిగినట్టు గుర్తించిన మేదరమెట్ల ఎస్సై రఫీ, వారి సిబ్బంది బస్టాండ్ పరిసర ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీ చేసి యువతిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మేదరమెట్ల ఎస్సై యువతిని విచారించగా ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించక పోవడంతో మనస్థాపం చెంది విజయవాడ లోని కృష్ణా నదిలో దూకి (లేదా) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుని బస్సులో విజయవాడ వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఎస్సై యువతికి సర్ది చెప్పి క్షేమంగా మేదరమెట్లకు తీసుకొని వచ్చినారు. అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జున రావు, ఎస్ఐ రఫీ లు యువతికి, యువతి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆమెను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించినారు. ఫిర్యాదు ఇచ్చిన వెంటనే వేగంగా స్పందించి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంటి నుండి వెళ్లిపోయిన యువతిని క్షేమంగా తమ చెంతకు చేర్చడంతో ఆమె కుటుంబ సభ్యులు జిల్లా పోలీస్ యంత్రాంగానికి, మేదరమెట్ల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఆమెను ప్రాణాలతో చూడలేము అనుకున్న తరుణంలో పోలీసులు క్షేమంగా ఆమెను తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల ప్రభావం జీవితాంతం బాధను మిగులుస్తుందన్నారు. ప్రేమ, పెళ్లి వంటి జీవన కీలక నిర్ణయాలు ఒకే క్షణంలో తీసుకునే అంశాలు కావని, సమగ్ర ఆలోచన, సంయమనం, సానుభూతితో కూడిన పరస్పర అవగాహన అవసరమన్నారు. కుటుంబ సభ్యుల అభిప్రాయాలు, సూచనలు కూడా వినాలని, అదే విధంగా, కుటుంబ సభ్యులు కూడా యువతీ యువకుల భావాలను గౌరవించాలని సూచించారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒక్క నిమిషం ఆలోచించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఆత్మహత్య మార్గం కాదు, అది సమస్యలపై ఓటమి లాంటి నిర్ణయమని, సమస్యలు తాత్కాలికమైనవే అయినా, ఆత్మహత్య శాశ్వత నష్టాన్ని కలిగిస్తుందని గ్రహించాలన్నారు. వేగంగా స్పందించి సాంకేతికను వినియోగించుకుంటూ మహిళను గుర్తించి క్షేమంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన మేదరమెట్ల పోలీస్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలి :ఏడిఏ రామకోటేశ్వరి

**పొన్నూరు, జులై 29, ప్రభాతవార్త:** కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల,



పాతరెడ్డిపాలెం రైతు సేవా కేంద్రాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా వేసిన పంటలను ఈ పంట యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందేందుకు వీలుగా ఉంటుందన్నారు. తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకొంటేనే నష్టపరిహారం అందుతుందన్నారు. లేకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రైతులందరూ వేసి పంటలను పంటల బీమా పథకంలో అందుకు సంబంధించిన రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి వ్యవసాయంలో మేలైన, అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో లాఫారం శాస్త్రవేత్త వెంకట్రావు, విఎఎలు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## టైక్వాండో పోటీల్లో స్టెమ్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య, జులై 29, ప్రభాతవార్త :** సిఐఎస్‌సిఈ టైకా ్వండో పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను



కనబరిచి బంగారు, సిల్వర్ పతకాలను సొంతం చేసుకున్నారని స్టెమ్ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. అండర్-14పోటీల్లో సిహెచ్ బాజీ, షేక్ అబ్దుల్ రహ్మాన్ లు అండర్ 17లో షేక్ సన తస్లీమ్, ఎం హేమన్యా రెడ్డి లు బంగారు పతకాలను సాధించారని పేర్కొన్నారు. అండర్-17లో అబిరామ్, షేక్ అబ్దుల్ లుక్మాన్, అండర్-14లో పి.మోక్షిత అనే విద్యార్థులు సిల ్వర్ పతకాలను కైవశం చేసుకున్నారని వెల్లడించారు. ఆయా విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో టైకా ్వండో పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నార. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ భరత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనుపమ, ఆయా విద్యార్థులను అభినందించారు.

## ఆగష్టు 15నుండి 22వరకు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు

**గుంటూరు విద్య, జులై 29, ప్రభాతవార్త :** పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వారోత్స వ వేడుకలు గుంటూరులో ఆగష్టు 15నుంచి 22వరకు అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు సీనియర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరగబోతున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా కార్యక్రమాల వివరాలు తెలియజేస్తూ ఒక క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా బాలయ్య శ్రీనివాస్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, కడప మాణిక్యరావు, శిఖర బాలు కిషోర్ సీనియర్ ఫ్యాన్స్ మొహమాటం రమేష్, గిడుతూరి సత్యం, తోట దిలీప్, కాటూరి శ్రీనివాసరావు, శరత్ ఇతర జనసైనికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానులు ముఖ్యంగా మేకల రవీంద్రబాబు గత ఎన్నో ఏళ్ళుగా గుంటూరు నగరంలో వారోత్సవ వేడుకలు చేయడం మేము ప్రత్యక్ష సాక్ష్యం అని పేర్కొన్నారు. గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిరంజీవి అంటేనే ఒక నిలువెత్తు మానవత్వానికి నిదర్శనం అని ఆదర్శమైనటువంటి మహానుభావుడు మెగాస్టార్ చిరంజీవి అలాగే సేవా కార్యక్రమానికి ఈ రాష్ట ్రంలో దేశంలోనే చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నిర్మించి కొన్ని లక్షల ప్రాణాలు కాపాడుతున్న మెగాస్టార్ చిరంజీవి ఎంతైనా అభినందనీయుడు అని ప్రశంసించారు. సుమారు 20మంది పేద రైతులకు రూ.5000ల నగదు ఇచ్చిన సందర్భంగా ఆ కార్యక్రమం పాల్గొన్న రవీంద్రబాబు చేస్తున్న కార్యక్రమాలు ఖచ్చితంగా చాలా హర్షణీయం అభినందనీయమని తెలియజేశారు.

## ఆన్‌కాల్ డ్రైవర్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానం

### -డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు

**పొన్నూరు, జులై 29, ప్రభాతవార్త:** ఆర్టీసి ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతోపాటు, వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా, సకాలంలో చేరవేయడంలో ఆర్టీసి సంస్థ ముందుందని ఆర్టీసి డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు అన్నారు. ప్రస్తుతం పొన్నూరు ఆర్టీసి డిపోలో పనిచేసేందుకు ఆన్ కాల్ డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అర్హులైనవారు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెవీ లైసెన్స్ కలిగి, 18నెలలపాటు హెవీ వెహికల్ అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వారి అర్హతలను బట్టి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పంటల బీమా చేయించండి

### మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు

**కారంపూడి, జులై 29 ప్రభాతవార్త:** జులై 31తో పంటల బీమా గడువు ముగుస్తున్నందున రైతులందరూ వెంటనే పంటల బీమా కొరకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు కోరారు. ఒప్పిచర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మండలంలో పంటలు సాగు



చేసే రైతులందరూ వెంటనే పంటలబీమా చేయించుకోవాలని తెలిపారు. రైతులు మిరపకు 360 చెల్లిస్తే బీమా పరిహారం 90 వేలు, కందులు రూ.40 చెల్లిస్తే 20 వేలు, వరి పంటకు రూ.80 చెల్లిస్తే బీమా పరిహారం రూ.40 వేలు, పత్తి పంటకు ఎకరానికి కట్టాల్సిన ప్రీమియం రూ.1900 చెల్లిస్తే బీమా పరిహారం 38 వేలు వస్తుందన్నారు. పత్తి, మిరప, కందులు పంటలకు బీమాకు జులై 31 చివరితేదీ అని తెలిపారు. వరి పంట బీమాకు చివరి తేదీ ఆగష్టు 15 అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పంట నమోదు ధ్రువీకరణ పత్రం, కౌలు రైతుదారులకు కౌలు రైతు కార్డు తెచ్చుకోవాలన్నారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరణ

**పెదనందిపాడు జులై 29 (ప్రభాతవార్త)** ప్రజా సమస్యల పరిష్కారాల పోరాట యోధులు. సంఘ సంస్కర్త. గ్రామ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి. ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని సుప్రీంకోర్టు మాజీ




న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నాగులపాడు లో గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు సంయుక్తంగా గ్రామ ప్రధాన కూడలిలో స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన దివంగత మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య. నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు. ప్రొఫెసర్ అన్నదాత మణి. మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ లతో కలసి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ తన చిన్నతనంలోనే ఆళ్ల రాఘవయ్య తో తనకు పరిచయం ఉందని వారి ఇచ్చిన అమూల్యమైన సలహాలు నాకు మార్గదర్శకం అయినాయ అన్నారు. సభకు ప్రొఫెసర్ శారదా దేవి అధ్యక్షత వహించగా విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ తనకు చిన్నతనం నుండి ఆళ్ల రాఘవయ్య తో చనువు ఎక్కువగా ఉండేదని వారు ఇచ్చిన ప్రోత్సాహం పట్టుదల కృషి నన్ను ఇంతటి వాడిని చేసిందన్నారు. నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు మాట్లాడుతూ. కీర్తిశేషులు ఆళ్ల రాఘవయ్య 1925 మే రెండో తేదీన జన్మించారని అప్పటికే వాళ్ల తండ్రి కామయ్య నాగులపాడు లో బాట సారుల కోసం సత్రం నిర్మించారని. ఆనాడే గ్రంథాలయం ఏర్పాటు చేయటంలో ప్రధాన పాత్ర వహించారని. వారి కొడుకు రాఘవయ్య చిన్ననాటి నుండి పీడిత ప్రజల రక్షణ కోసం పోరాడిన వ్యక్తిని 37 సంవత్సరాలు గ్రామ సర్పంచిగా పనిచేసి ప్రజల మమకారం పొందిన గొప్ప వ్యక్తి అన్నారు. నాగులపాడు గ్రామాన్ని పెదనందిపాడు గ్రామంలో కలిపేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా వాటిని అడ్డుకొని హైకోర్టు వరకు వెళ్లి పోరాటం చేసి చిత్రపటంలో నాగులపాడు గ్రామానికి గుర్తింపు తెచ్చి. ప్రజల ఉపాధి కోసం ఆనాడే గ్రామంలో ఇండస్ట్రీస్ నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి ఇండస్ట్రీస్ నెలకొల్పడంలో కీలకపాత్ర వహించారు అన్నారు. ఈ ప్రాంతంలో నల్లమడ వాగుకు తరచూ వచ్చే వరదలు వల్ల రైతుల బడుతున్న ఇబ్బందులను గమనించి నల్లమడ రైతు సంఘం స్థాపించి దానికి నన్ను అధ్యక్షునిగా చేసి వారు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వం పై పోరాటం చేసి నల్లమడ వాగు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆ రోజుల్లోనే ఈ ప్రాంతంలో వచ్చిన త్రాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఈ ప్రాంత ప్రజలను సమావేశపరిచి. అసంపూర్తిగా నిలిచిపోయిన గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించే కార్యక్రమాన్ని తిరిగి చేపట్టా లనే పోరాటానికి రాఘవయ్య శ్రీకారం చుట్టారన్నారు. అలాంటి పోరాట యోధుని విగ్రహం ఆవిష్కరించటం ఈనాటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రొఫెసర్ అన్నదాత మణి మాట్లాడుతూ తన మాటల చాతుర్యంతో ప్రజల హర్షధ్వనుల మధ్య సభ మారు మ్రోగేలా చేశారు. మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ మాట్లాడుతూ తాను కూడా తొలుత పెదనందిపాడు సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైనను అని తనకు రాఘవయ్య జీవితమే మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల రాఘవయ్య కుటుంబ సభ్యులు. విజయకుమార్. సుబ్బారావు. హరి ప్రసాద్ తదితరులు ప్రసంగించగా. ముద్దన రాఘవయ్య. పాటిబండ్ల నాగేశ్వరరావు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆహ్వానితులతో పాటు స్థల దాత కాపు వెంకట సుబ్బారావును కూడా కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఘనంగా సత్కర్నిచారు.

## హామీలను అమలు చేయని కూటమికి పాలించే అర్హత లేదు

### -వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, జులై 29, ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని కట్టెంపూడి, ఆలూరు, దొప్పలపూడి, పచ్చలతాడి పర్రు, మునిపల్లె గ్రామాల్లో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, అమలు చేయని పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు కూటమి నాయకులు అలవికాని హామీలను ఇచ్చిన అధికారంలోకి వచ్చాక వాటిని చాపచుట్టేశారన్నారు. అమలు చేసిన పథకాలు కూడా అరకొర మందికే పరిమితం చేశారన్నారు. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే, ప్రశ్నించినవారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అసలు రాష్ట్రంలో పాలన సాగుతుందా..?లేదా ? అనే అనుమానం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందన్నారు. తల్లికి వందనం అర్హులు ఇంకా చాలా మంది ఉన్నప్పటికీ వారికి ఇంత వరకు నగదును అందజేయలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలుపూర్తిగా క్షీణించాయన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భవనం పద్మలీల, చింతలపూడి మురళీకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు, చిర్రా అక్కిరెడ్డి, మరియరాణి, మౌలాలి, నల్లమోతు రవీంద్రబాబు, మామిళ్ళపల్లి మోహనరావు, రుద్రపాటి ఆదిశేషు, వడాలశెట్టి శివనాగులు, చుండూరు వీరయ్య, కంచర్ల కరుణ్‌బాబు, చేబ్రోలు నాగరాజు, ప్రవీణ్, నరేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## లేఅవుట్ల రెగ్యులరైజేషన్ స్కీం సద్వినియోగం చేసుకోండి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, జులై 29, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని పురపాలక సంఘాల్లో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం అమలులో ఉందని, అర్హులందరూ ఈ స్కీమును సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల అమ్మకం, కొనుగోలుదారుల ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేసి ఈ పథకాన్ని వినియోగించుకోవలసిందిగా చూడాలని కోరారు. 2020 మేరకు పురపాలక సంఘం పరిధిలో 30.6.2025కు ముందు ప్లాట్‌గా రిజిష్టరు కాబడిన అన్ని లేఅవుట్‌లను, ప్లాట్లను ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 10శాతం ఓపెన్ స్పేస్ లేదా 14శాతం ఓపెన్ స్పేస్ చార్జీలను పీనలైజేషన్ చార్జీలతో సహా చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. 26.7.2025 నుండి 90రోజులలోపు ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు పురపాలక సంఘంలోని హెల్ప్ డెస్క్‌లో నేరుగా సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు.



## విద్యుత్తు రంగం పునరుద్ధీకరణ పథకం ద్వారా చేపట్టిన

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

## ఏపి చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్

**బాపట్ల,జులై29,ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్స్ విభజన, విద్యుత్ రంగం పునరుద్ధీకరణ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఏపీ చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ తెలిపారు. విద్యుత్ ఫీడర్స్ విభజన, విద్యుత్ రంగం పునరుద్ధీకరణ పథకం అమలు తీరుపై విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాపట్ల జిల్లాలో మొత్తం 62 పనులు మంజూరు కాగా, 59 పనులకు సర్వే పూర్తయిందని వాటిలో ఇప్పటికే 16 పనులు పూర్తికాగా, 20 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నేటికీ 15 పనులు ప్రారంభించక పోవడం ఏమిటని గుత్తేదారులను నిలదీశారు. మిగిలినవి వివిధ దశల్లో ఉండడంపై ఆరా తీశారు. ఫీడర్ విస్తరణ, ఆధునికీకరణ, అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. 33 కెవి సబ్ స్టేషన్ లో ఓవర్లోడ్ అవుతున్న 12 ఫీడర్ విస్తరణ పనులలో 9 పూర్తి కాగా, మూడు మొదలు గాకపోవడం ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు చేయడంలో కాంట్రాక్టర్లు ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు. కాలం చెల్లిపోయిన విద్యుత్ స్తంభాలు తొలగించి వాటి ప్రాంతంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయని అధికారులు సిఎస్ దృష్టికి తెచ్చారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పనులు వేగంగా చేయాలని, నాణ్యతతో ఉండాలని మార్గ నిర్దేశం చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 71,025 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా ఇప్పుడు వరకు 50,108 మీటర్లు బిగించామన్నారు. మిగిలినవి త్వరలోనే ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ స్టేషన్ ల పరిధిలో విద్యుత్ తీగల ఏర్పాటు, నిర్వహణ పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజల స్పందన, ప్రజాభిప్రాయ సేకరణలో ఐదు ఫీడర్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని గుర్తించామన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోరా... అంటూ.. అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయంలో సమయానికి మించి విద్యుత్ విడుదల చేయలేకపోతే ఉపేక్షించేది లేదన్నారు. కండెక్టర్లు, విద్యుత్ పరివర్తకాలు, ఫీడర్ చానల్స్ మార్చుకోవాలన్నారు. ఇంకొల్లు, నిజాంపట్నం, బాపట్లలో లో ఓల్టేజ్ సమస్య ఎందుకు వస్తుందని అధికారులను ప్రశ్నించారు. వీటిపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు మరోసారి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. లో ఓల్టేజి, హై ఓల్టేజి, ట్రిప్పింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజలకు నష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆర్ డి ఎస్ ఎస్ హెచ్ డి ఫైడ్ సర్వీసెస్ పది పనులు త్వరగా చేపట్టాలన్నారు. సబ్ స్టేషన్ లో విద్యుత్ తీగలు పర్యవేక్షణపై అధికారుల దృష్టి ఉండాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు తరుచూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. 33 కెవి సబ్ స్టేషన్ ట్రిప్పింగ్ పునరుద్ధరణలో 53:27 నిమిషాలు ఎందుకు సమయం పడుతుందని ఆయన ఆరా తీశారు. నెల రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి నెల విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.99 కోట్లు ఉందన్నారు. ఇప్పటివరకు రూ.82కోట్లు బిల్లులు చెల్లింపులు జరగాయని . మూడు రోజుల గడువులో నూరు శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. అన్ని రకాల పరిశ్రమల నుంచి రూ.100 కోట్లు విద్యుత్ బకాయిలు రావాల్సి ఉండగా, గృహాల నుంచి రూ.102 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని లేని సౌర విద్యుత్ వినియోగంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద బాపట్ల జిల్లాలో 8,844 మంది రైతులకు సౌర విద్యుత్ పంపుసెట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందన్నారు.

లక్ష్యాలను చేరుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, ఏపీ సీపీడీసీఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, జిల్లా ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, విద్యుత్ శాఖ డైరెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది : నగర మేయర్


**గుంటూరు తూర్పు, జులై 29 (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆప్కాస్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచిన నేపథ్యంలో సదరు ప్రభుత్వ జీవోను నేడు జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన సందర్భంగా మంగళవారం ది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు మేయర్‌ని ఆయన ఛాంబర్ నందు మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ జీవో నెం.124డిటి, న విడుదల చేసిందని, సదరు జీవోను నేడు నగర పాలక సంస్థలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించి నందుకు మేయర్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని, వారి వినతులను అర్థం చేసుకుని వారికి వేతనాలు పెంచిందన్నారు. నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు నగరాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు,



యూనియన్ నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు గాలి యేసుబాబు, సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్, రమాదేవి, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గరుడ పంచమి వేడుకలు

**పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త:** టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచి, స్వర్ణపురి పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో కొలువై వున్న అతిపెద్ద ఏకశిలా శ్రీ గరుత్మంత స్వామివారికి మంగళవారం గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామునుంచే స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకొని హోమాలు నిర్వహించారు. శ్రీ రుద్రాదేవి, సుకీర్తి సమేత శ్రీ మహావీర గరుత్మంత స్వామివారికి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకొన్నారు. భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాద గోష్టి జరిగింది. దేవాలయం కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.



# 5వ ర్యాంకులో మాచర్ల నియోజకవర్గం!

## రాష్ట్రస్థాయిలో నిలిపిన శ్రేణులకు అభినందనలు! - ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**మాచర్ల, జులై 29 ప్రభాతవార్త:** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు జులై 2న రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ మొదలుపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగులు కార్యక్రమం నిర్వహణలో మాచర్ల నియోజకవర్గం స్టేట్ ర్యాంకును కైవసం చేసుకుంది. 175 నియోజకవర్గాల్లో అధిష్టానం నిర్వహించిన



సర్వేలో ఇంటింటికి టీడీపీని తీసుకుపోవడంలోనూ. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నసంక్షేమం, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంలోనూ, సమస్యలను పరిష్కరించడంలోనూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శ్రేణులు ముందున్నట్లు నివేదికలు తెలిపాయి. దీంతో సుపరిపాలన కార్యక్రమాన్ని ఎంతో నిబద్ధతతో నిర్వహించి ప్రజలకు చేరువగా ప్రభుత్వ కార్యక్రమాలను తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ఎమ్మెల్యే జూలకంటి కనబర్చిన ప్రతిభకు పార్టీ అధిష్టానం మాచర్ల నియోజకవర్గానికి స్టేట్ టాప్-5 ర్యాంకును కేటాయించింది.

**- సుపరిపాలనలో తొలి అడుగు నూతనోత్సాహాన్ని తెచ్చింది!**

సుపరిపాలనలో తొలి అడుగులు కార్యక్రమం నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గం టాప్-5 ర్యాంకులో నిలవడం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 27 రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైందన్నారు. తనతోపాటు పార్టీ శ్రేణులు గ్రామ, వార్డులలో ప్రతి ఇంటికి తిరిగి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించామన్నారు. నియోజకవర్గం పరిధిలో దాదాపు లక్షా వెయ్యి 800 ఇళ్లకుగాను మంగళవారంతో 97 వేల ఇళ్లకు చేరుకుని ప్రభుత్వం చేస్తున్న మంచిని తెలియజేశామన్నారు.

**- ఈ ఘనత ప్రతి ఒక్క కార్యకర్తది: ఎమ్మెల్యే**

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం, రాష్ట్ర స్థాయిలో మాచర్ల నియోజకవర్గాన్ని టాప్-5లో నిలిపేందుకు పాటుపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు ఈ ఘనత అంకితమని ఎమ్మెల్యే జూలకంటి ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రనజలకు టీడీపీ శ్రేణులు వారధిగా నిలిచి, మై టీడీపీ యాప్‌ను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అభినందించారు.

# సుపరిపాలన తొలి అడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా


**సత్తెనపల్లి, జూలై 29 ప్రభాతవార్త :** మండలంలోని ధూళిపాళ్ళ గ్రామంలో మంగళవారం సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రజలకు పథకాలు అందుతున్నాయా లేదా అని ఇంటింటికి అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు ఏ కష్టం రాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింద న్నారు. ప్రతి ఇంటిలో సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని మై టిడిపి యాప్‌లో నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో 90 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్న క్యాంటీన్లు, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే అందుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. ముందుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు గ్రామస్తులు ఘనంగా పూలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా పద్మజ

గుంటూరు తూర్పు, జులై 29 (ప్రభాతవార్త) : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ గుంటూరు నలంద నగర్‌కు చెందిన మగతాల పద్మజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన పద్మజ జయహో నవ్యాంధ్ర పుస్తకాన్ని ఆమె రచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములుగా చేస్తేనే అభివృద్ధి క్షేత్రస్థాయిలో అందుబాటులోకి చేరుతుందని ఆమె అన్నారు. ఈ పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రెండేళ్ళ క్రితం ఆవిష్కరించారు. పద్మజ 23సంవత్సరాల నుండి నరసరావుపేటలో విద్యా వికాస్ అని పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గ్రంథాలయాల ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలను భాగస్వాములు చేయవచ్చని చెప్పారు. తనకు డైరెక్టర్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాధవి, గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# కూటమి పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి

## రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్

**విజయపురిసౌత్, జులై 29, ప్రభాతవార్త:** సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని మంగళవారం ద్వారకాపురి గ్రామంలో ఆయన నిర్వహించారు. దారునాయక్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలన గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం పథకం, యువతకు ఉద్యోగాలు, రైతు సంక్షేమ



పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుణదలా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, ప్రశాంత్, రామయ్య, రామాంజినాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో చోరీ

## హుండీలను పగులకొట్టి నగదు అపహరించిన దుండగులు

**గురజాల, జూలై 29 ప్రభాతవార్త:** పట్టణంలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. ఆలయం గేటుకు ఉన్న తాళాలను పగొలకొట్టి లోపలకు వెళ్లారు. ఆలయంలోని రెండు హుండీలను పగులకొట్టి నగదును అపహరించారు. మంగళవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు వచ్చిన పూజారి హుండీలు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించి ఈవో పూర్ణచంద్రరావుకు సమాచారాన్ని అందించారు. ఈ మేరకు ఈవో పూర్ణచంద్రరావు పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆవుల భాస్కరరావు ఆలయానికి చేరుకొని పరిశీలించారు.



# కనుల పండువగా అష్టలక్ష్మీ అమ్మవార్లకు లక్ష విరజాజుల అభిషేకార్చన

గుంటూరు కల్చరల్,జూలై 29,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి 30వ కోటి కుంకుమార్చన ఉత్సవాలు ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రమంలో మొదటి మంగళవారం ఉదయం అమ్మవారికి లక్ష విరజాజులతో అభిషేకార్చన కనుల పండువగా జరిగింది. సువాసినులు అమ్మవారికి లవంగాలతో చేసిన మాల,యాలుకలతో,సంపెంగ పూల మాలలు,పసుపు కొమ్ములతో మాలలు కట్టి అమ్మవారికి సమర్పించారు. తొలుత గోపూజ,గణపతి పూజ,శ్రీచక్ర మహామేరకు విశేషాభిషేకార్చనలు జరిగాయి.



# గురజాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా కమిషనర్ వైవీఎల్ పనితీరు

**గురజాల, జూలై 29 ప్రభాతవార్త :** గురజాల నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణరావు విధుల నిర్వహణలో తనదైన




శైలిలో ముందుకు వెళ్తున్నారు. ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు సలహాలు, సూచనలు పాటిస్తూ గురజాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారు. పట్టణంలో పారిశుధ్యం, వీధుల శుభ్రత, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాలలో మల, మూత్ర విసర్జన నిషేదంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆగష్టు 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేదం అమలు జరుగుతుందంటూ ప్రజలు, వ్యాపారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రధానంగా పారిశుధ్యం అధ్వాన్నంగా ఉన్న ప్రదేశాలపై దృష్టి సారిస్తున్నారు. సైడు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంను పారిశుధ్య కార్మికులచే తొలగింపజేస్తున్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిపోయింది. తక్షణమే స్పందించిన కమిషనర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి శాఖా గ్రంథాలయం వైపు గల సైడు కాలువల ప్రకాళన ప్రారంభించారు. గత రెండు రోజులుగా క్రేన్ సాయంతో సాయంత్రం కాలువలపై ఉన్న బండరాళ్లను తొలగింపజేసి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికుల చేత తొలగింపజేశారు. తొలగించిన వ్యర్థాలను తక్షణమే ట్రాక్టర్లలో తరలించారు. మొత్తంగా వర్షపునీరు రోడ్లపై చేరకుండా ప్రణాళికాబద్ధంగా కమిషనర్ వ్యవహరిస్తున్నారు.

# నియోజకవర్గంలో రోడ్లను బాగు చేయండి

## మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి డిమాండ్

**నరసరావుపేట, జూలై 29 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయాలని జిల్లా వైఎస్సార్‌సిపి వర్కింగ్‌ప్రెసిడెంట్ రోడ్డు బాగ లేదని మొక్కులు నాటారని,ఇప్పుడు వారంతా ఎక్కడ ఉన్నారో, ఎందుకు ప్రశ్నించటం లేదో వారికే తెలియాలన్నారు. దాదపు రెండున్నర



డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేసారు. మంగళవారం జొన్నలగడ్డ-ఇస్సాపాలెం గ్రామాల మధ్య ఉన్న బైపాస్‌రోడ్డును పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 14నెలలు పాలన జరిగినకనీసం రోడ్డు బాగు చేయలేదన్నారు. 2025 సంక్రాంతి లోపు రోడ్లు బాగు చేస్తామని గొప్పలు చెప్పారని గుర్తు చేసారు. అప్పులుమాత్రం రూ.1.75,000వేల కోట్లు తెచ్చి ఏం చేసారో తెలియదన్నారు. గతంలో జనసేన నాయకులు ఇదే కిలో మీటర్లు ఉన్న రోడ్డు లో నిత్యం గోతులతో ప్రయాణం నరకంగా మారిందన్నారు. కోటప్పకొండ రోడ్డుకు సైతం నిధులు రూ.4.50కోట్లు మంజూరు చేసారని ప్రకటించి ఎందుకు పనులు ప్రారంభించలేదన్నారు. కనీసం టెండర్లు కూడా లేవన్నారు. నియోజకవర్గంలో అన్నీ రహదారుల పరిస్థితి ఇలానే ఉందన్నారు. కేవలం ప్యాచ్ వర్క్‌లు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంగం డైరీ పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

**మాచర్ల, జులై 29 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలంలోని రచ్చుమలపాడు గ్రామంలోని సంగం డైరీ పాల కేంద్రానికి పాలు పోసిన ఉత్పత్తి దారులకు ఆ సంస్థ బోనస్ పంపిణీ చేశారు. మంగళవారం పాలకేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన పాల ఉత్పత్తి మొత్తం బట్వాడా రూ.1.3 కోట్ల రూపాయలు. దీనికిగాను ప్రతి 100 రూపాయలకు రూ.4 చొప్పున బోనస్ మొత్తం రూ.4.12 లక్షలు పాల ఉత్పత్తిదారులకు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల సంఘం డైరీ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, మేనేజరు డా॥ శివరామకృష్ణ, డాక్టర్ రవితేజ, సూపర్‌వైజర్ శివ, సిబ్బంది, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.




# గుత్తికొండలో పొలం పిలుస్తోంది

**పిడుగురాళ్ల జూలై 29 ప్రభాతవార్త :** మండలంలోని గుత్తికొండలో మంగళవారం ఏవో సంధ్యారాణి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమా పేరిట రెండు పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. రైతులు గడువు లోపు భీమా ప్రీమియం చెల్లిస్తే పంట నష్టపోయినప్పుడు ఆర్థికంగా సాయం పొందవచ్చ న్నారు. రైతు ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, కౌలు కార్డు, రైతు డిక్లరేషన్ లేని పక్షంలో పంట వేసిన ధృవీకరణ పత్రం, సెల్ నంబరు, రైతు బ్యాంకు పొదుపు ఖాతాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, అహ్మద్, రైతులు పాల్గొన్నారు.



# మాచర్ల నూర్‌బాషా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**మాచర్ల, జులై 29 ప్రభాతవార్త:** మాచరన్ల పట్టణ నూర్‌బాషా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఈ ఎన్నికలో సభ్యుల ఏకగ్రీవ సమ్మతితో కొత్త కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షేక్ నాసర్‌వలి (రైస్) షేక్ సైద్ హుస్సేన్‌ను గౌరవ అధ్యక్షులుగా నియమించాఉ. షేక్ సైదు హుస్సేన్‌ను నూర్‌బాషా క్వాజీ (నాయక్)గా నియమించారు. గౌరవ సలహాదారులుగా షేక్ కొదాన్, షేక్ బాదన్‌బాయి, షేక్ రషీద్, షేక్ ముర్తిజాలి సేవలందించనున్నారు. అధ్యక్షునిగా షేక్ సైదుఖాశిం, ప్రధాన కార్యదర్శిగా షేక్ అన్వర్ అక్తర్, ట్రెజరర్‌గా షేక్ మౌలాలి, (హోటల్), ఉపాధ్యక్షుడిగా షేక్ మదీన్, సంయుక్త కార్యదర్శిగా చిన్న ఇమాంసా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సైదుఖాసిం మాట్లాడుతూ... నూతన కార్యవర్గంపై సభ్యులు చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తామన్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సభ్యుల సహకారంతో అభ్యున్నత దిశగా నడిపించేందుకు శక్తిమేరకు శ్రమిస్తామని తెలిపారు.



# ధూళిపాళ్ళ,కంకణాలపల్లి గ్రామాలలోపొలం పిలుస్తోంది

**సత్తెనపల్లి, జూలై 29 ప్రభాతవార్త : మండలంలోని** ధూళిపాళ్ళ, కంకణాలపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ పంటల భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 31తేదీ లోపు ఈ పథకంలో చేరాలన్నారు. వరి, పత్తి తదితర పంటలకు ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత పథకం కింద కంది, మినప విత్తనాల సంచులను పంపిణీ చేశారు. ఏఈవో ఏసోబు, విఏఏలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పాక్‌ను వెనకేసుకొస్తే మీకేమొస్తుంది?





## విపక్షాలకు చురకలు వేసిన అమిత్‌షా

**న్యూఢిల్లీ,జూలై 29:** పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చి చంపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు. ఇది అత్యంత దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి జరిగిన వెంటనే భద్రతాబలగాలు అప్రమత్తమయ్యాయని, ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించడంతో పాటు వారు దేశం దాటకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్ సభలో చేపట్టిన చర్చలో హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 22న ఉగ్రవాదుల ఆచూకీ తెలిసిందని, దాచిగామ్ సమీపంలోని మహదేవ్ కొండల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో మహదేవ్ కొండల్లో గాలింపు చర్యలు చేపట్టి పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా తో పాటు ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు హతమార్చాయని వివరించారు. ఈ క్రమంలోనే తన ప్రసంగానికి పదేపదే అడ్డువస్తున్న ప్రతిపక్ష ఎంపిలకు అమిత్ షా చురకలంటించారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌నుఉద్దేశించి.. 'ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు' అంటూ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్‌ను వెనకేసుకు వస్తే మీకు ఏమొస్తుందంటూ ప్రతిపక్ష ఎంపీలను నిలదీశారు. పాకిస్థాన్‌తో మీరు చర్చలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఇటీవలి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. పాక్‌ను రక్షిస్తే మీకు ఏమొస్తుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని తాము వెల్లడిస్తే ఆధారమేంటని చిదంబరం ప్రశ్నిస్తున్నారని షా గుర్తుచేశారు. ఉగ్రవాదుల దగ్గర పాకిస్థాన్‌లో తయారైన చాక్లెట్లు దొరికాయని షా తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పాకిస్థాన్‌ను ఎందుకు వెనకేసుకు వస్తున్నారని హోంమంత్రి నిలదీశారు. పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెడితే దేశ ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలూ హర్షం వ్యక్తం చేస్తారని తాము భావించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలు, చర్చలో వారి ప్రవర్తన చూస్తుంటే ఉగ్రవాదులను తుదముట్టించడం వారికి ఎలాంటి సంతోషాన్నికలిగించలేకపోయినట్లు తెలుస్తోందని అమిత్ షా ఆరోపించారు.

**అమిత్‌షా ప్రసంగానికి ప్రధానిమోడీ కితాబు!**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో చేసిన ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ మహదేవ్, ఆపరేషన్ సిందూర్‌కీలకపాత్ర పోషించాయని ప్రధాని అన్నారు.

ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్ గురించి హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో సుదీర్ఘ వివరణ ఇచ్చారని ప్రధాని మోడీ చెప్పారు. దేశ భద్రతపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన తన ప్రసంగంలో సవివరంగా చెప్పారని ట్వీట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఉనికికి నెహ్రూనే కారణమని ఆరోపించారు. 1948లో భారత సైనిక దళాలు పీవోకేను చేజిక్కించుకునే స్థానంలో ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడంవల్ల ఆ అవకాశం చేజారిపోయిందని అమిత్ షా విమర్శించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌కూడా నెహ్రూ చర్యలను వ్యతిరేకించారని గుర్తుచేశారు. తూర్పు పాకిస్థాన్ విమోచన యుద్ధం సమయంలోనూ పిఓకెను దక్కించుకునే అవకాశం వచ్చినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని చేజార్చుకుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి లో భారత్ శాశ్వత సభ్యత్వాన్ని పొందలేకపోవడానికి కూడా నెహ్రూనే కారణమని అమిత్ షా ఆరోపించారు. నెహ్రూ నిర్ణయాలవల్లే మనకు ఇంకా భద్రతామండలిలో శాశ్వత స్థానం దక్కలేదని చెప్పారు. యూఎన్ఎస్‌సిలో శాశ్వత సభ్యత్వం కోసం మోడీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని తెలిపారు. దేశంపై ఉగ్రవాదులు కుట్రలకు పాల్పడుతుంటే చూస్తూ కూర్చోవడానికి ప్రస్తుతం ఉన్నది మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కాదని, మోడీ ప్రభుత్వమని అమిత్ షా వ్యాఖ్యానించారు



# బీహార్ 'సర్'లో తప్పులుంటే జోక్యం తప్పదు..

## ఇసిని హెచ్చరించిన సుప్రీం కోర్టు

**పాట్నా, జూలై 29:** కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బీహార్ ఓటర్ల జాబితాను సవరిస్తోంది. అయితే ఈ సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిసు_న్నారని, ఓటు నిలుపుకోవడం కోసం, కొత్తగా ఓటు హక్కు కోసం పౌరులు చూపించాల్సిన డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్‌కార్డు, ఓటర్ ఐడి కార్డులను చేర్చలేదని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఓటర్ల జాబితాను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో సవరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారం ఉన్నదని, ఇసి చట్టప్రకారం పనిచేస్తుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

అయితే ఈ సవరణ లక్ష్యం భారీగా కొత్తఓటర్లను జాబితాలో చేర్చ డమే ఉండాలిగానీ, భారీగా ఓటర్లను జాబితా నుంచి తొలగించడం ఉండకూడదని వ్యాఖ్యానించింది. భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే మాత్రం తాము జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై వచ్చే నెల 12, 13 తేదీల్లో విచారిసా_మని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ సవరించిన ఓటర్ల జాబితాను ప్రచురించనుందని, పాత జాబితాలోఉన్న అనేకమందిఓటర్లను ఈ జాబితా నుంచి తొలగించారని, దాంతో వారంతా తమ ఓటు హక్కును కోల్పోనున్నారని పిటిషనర్లు సుప్రీంకోర్టుకు తెలిపారు.

దానిపై కోర్టు స్పందిస్తూ.. సవరించిన ఓటరు జాబితాలో ఏవైనా తప్పులను గుర్తిస్తే ఆధారాలతోసహా తమ దృష్టికి తీసుకురావాలని పిటిషనర్లకు సూచించింది. మీరు భయపడుతున్నట్లుగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపు జరిగితే వెంటనే తాము జోక్యం చేసుకుంటామని హామీ ఇచ్చింది. జాబితాలో అవకతవకలు ఉంటే ఆగస్టు 8లోగా పిటిషనర్లు తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ధర్మాసనం సూచించింది. అదేవిధంగా వెరిఫికేషన్ డాక్యుమెంట్ల లిస్టులో ఆధార్‌కార్డు, ఓటర్‌ఐడికి చోటు కల్పించాలని ఇసిని ఆదేశించింది.



## స్ట్రెచర్‌పై రక్తమోడుతున్న రోగి గాఢనిద్రలో డాక్టర్

**మీరట్,జూలై 29:** ఉత్తరప్రదేశ్ మీరట్‌లో విషాదఘటన చోటు చేసుకుంది. ఓ వైద్యుడి నిరక్ష్యాన్లికి నిండు ప్రాణం బలైపోయింది. సమయానికి వైద్యం అందకపోవడంతో తీవ్ర రక్తస్రావంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు లాలా లజపతిరాయ్ మెమోరియల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆ సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ వైద్యం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఎసి వేసుకొని నిద్రపోయాడు. బాధితులు ఎంత వేడుకున్నా నిద్రలేవలేదు. దీంతో రాత్రంతా సునీల్ ఎమర్జెన్సీ వార్డు లోని స్ట్రెచర్‌పైనే రక్తస్రావంతో అల్లాడిపోయాడు. చివరికి ప్రాణాలు కోల్పోయాడు. వైద్యుడు ఎసి ముందు టేబుల్ మీద కాలు పెట్టుకుని నిద్రిస్తున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అతడి సమీపంలోనే సునీల్ స్ట్రెచర్‌పై నొప్పిని తట్టుకోలేక అల్లాడుతూ కనిపించాడు. ఇవాళ ఉదయం 7 గంటల సమయంలో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఘటనపై లాలా లజపతిరాయ్ మెమోరియల్ మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ భూపేశ్ కుమార్ రాయ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

## గాల్లో ఇంజిన్ వైఫల్యంతో పైలట్ల మేడే కాల్..

### ఇంధనం ఖాళీచేసి సురక్షితంగా ల్యాండ్ అయిన విమానం

**డల్లాస్,జూలై 29:** యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ గాల్లో ఉండగానే ఇంజిన్ విఫలం కావడంతో పైలట్ మేడే కాల్ ప్రకటించాడు. వాషింగ్టన్ డల్లాస్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన విమానం 5 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్న తర్వాత ఎడమవైపు ఇంజిన్ విఫలైమంది. దీంతో వెంటనే అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సిబ్బంది.. అది సురక్షితంగా వెనక్కి మళ్లించేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఎటిసి)కి సమాచారం ఇచ్చారు. అనంతరం ఇంధనం ఖాళీ చేయడానికి దాదాపు 3 గంటల పాటు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఇంధనం ఖాళీ అయిన తర్వాత సురక్షితంగా ల్యాండ్ చేశారు. జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## 'ఉగ్రవాదుల అంతంతో మాకు కొంత న్యాయం జరిగింది'

**ముంబయి,జూలై 29:** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్దాలే భార్య ప్రగతి జగ్దాలే ముగ్గురుఉగ్రవాదుల హతంపై స్పందించారు. ఆ ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో తమకు కొంత న్యాయం జరిగిందని అన్నారు. భారత సైన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. గడిచిన మూడు నెలలుగా తాను ఎంతక్షోభను అనుభవిస్తున్నానో మాటల్లో చెప్పలేనని ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ గద్గదస్వరంతో చెప్పారు. నువ్వు పహల్గాంకు ఎందుకు వెళ్లావు? నువ్వు తప్పకుండ ఇంటికి తిరిగి రావాలి'అని తాను తరచూ ఆయన ఫొటోతో మాట్లాడుతున్నానని మీడియా ప్రతినిధులతో చెబుతూ ప్రగతి జగ్దాలే ఏడ్చారు.

# ఆకస్మికంగా కాల్పుల విరమణ దేనికి?

## లోక్‌సభలో సిందూర్‌పై చర్చలో ఎంపి అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ,జూలై 13:** విజయవంతంగా మిలటరీ ఆపరేషన్ నిర్వహించి అకస్మాత్తుగా కాల్పుల విరమణ జరపడం వెనుక లాజిక్ ఏమిటని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రాన్ని నిలదీశారు. పాకిస్థాన్‌కు గట్టి సందేశం ఇచ్చే అవకాశాన్ని వదులుకున్నారని, వాళ్లకు ఒక గుణపాఠం చెప్పి ఉండాల్సిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్ సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేకచర్చలో అఖిలేష్ మాట్లాడారు. ముందుగా ఇండియన్ ఆర్మీకిధన్యవాదాలు తెలియజేస్తున్నా. ప్రపంచంలోనే మన ఆర్మీ ముందంజలో ఉంది. వారి ధైర్యసాహసాలకు అందరం గర్విస్తున్నాం. ఆర్మీ ఈ ఆపరేషన్ చేపట్టినప్పుడు పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడింది. దీనితో పాటు పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది. ఛానెల్స్ చూస్తున్నప్పుడు కరాచీ మనది, లాహోర్ మనది, ఇప్పుడు పాక్ కూడా మనదే అనిపించింది. అలాంటి తరుణంలో ప్రభుత్వం ఎందుకు ఆపరేషన్‌ను వెనక్కి లాగిందనేది తెలుసుకోవాలనుకుంటున్నాం. కాల్పుల విరమణ ప్రకటనకు కారణం ఏమిటి, ప్రభుత్వమే ప్రకటన చేస్తుందని అంతా ఆశించాం. కానీ వాళ్లకున్న లోతైన మిత్రత్వం కారణంగా ప్రభుత్వం వాళ్ల మిత్రుడిని కాల్పుల విరమణ ప్రకటన చేయమని అడిగింది అని పరోక్షంగా తానే యుద్ధాన్ని ఆపానంటూ డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించుకోవడాన్ని ప్రస్తావించారు. నిర్లక్ష్యంకారణంగానే అమాయకు లైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పహల్గాం ఉగ్రదాడి నిరూపిస్తోందని అఖిలేష్ విమర్శించారు. దేశాన్ని పాలించేందుకు ప్రజల భావోద్వేగాలను తమకు ప్రయోజనకారిగా ప్రభుత్వం మార్చుకుంటోందని ఆరోపించారు. ఆపరేషన్ మహదేవ్ టైమింగ్‌నుకూడా అఖిలేష్ ప్రశ్నించారు. ఉగ్రవాదులు హతమైనందుకు మాకు సంతోషమే. కానీ దీనిని ప్రతిచోటా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది ఎవరు, సపోర్ట్ అవసరమైనప్పుడు అన్ని రాజకీయ పార్టీలు మీతో కలిసివచ్చాయి.

అదలా ఉంచితే, ఎన్‌కౌంటర్ నిన్ననే ఎందుకు జరిగింది, టెక్నాలజీ గురించి మీకు అంతగా తెలిసినప్పుడు పుల్వామాలో ఆర్డీఎక్స్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని ఇంతవరకూ ఎందుకు పట్టుకోలేదు ఇవాల్టికీ బిజెపి అనుకుంటే పుల్వామాకి ఏ మార్గం గుండా వాహనం వచ్చిందో తెలుసుకోగలదని అఖిలేష్ అన్నారు.

# చిదంబరంజీ.. పాక్‌ను ఎందుకు కాపాడాలనుకుంటున్నారు?

## లోక్‌సభలో అమిత్‌షా గుస్సా

**న్యూఢిల్లీ, జూలై 29:** పహల్గాం దాడిల్లో 26 మందిని బలిగొన్న ఉగ్రవాదులు స్వదేశీ వ్యక్తులంటూ కాంగ్రెస్ నేత పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఆయన పాకిస్థాన్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని రుజువు చేసే ప్రూఫ్స్ తమ వద్ద ఉన్నాయని షా స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చ కొనసాగుతోంది. ఈ చర్చ సందర్భంగా ఇవాళ అమిత్ షా మాట్లాడారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. పహల్గాం దాడికి ఆపరేషన్ మహదేవ్ ద్వారా ప్రతీకారం తీర్చుకున్నట్లు ప్రకటించారు. ఈ ఆపరేషన్ ద్వారా పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు సభలో ప్రకటించారు. ఇక ఈ సందర్భంగా దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని రుజువు చేసే ప్రూఫ్స్ ఉన్నాయని వెల్లడించారు. 'చిదంబరం జీ నిన్న ఓ ప్రశ్న లేవనెత్తారు. ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి వచ్చారని రుజువు ఏమిటని? అడుగు తున్నారు. ఆయన ఎవరిని కాపాడాలనుకుంటున్నారు? పాకిస్థాన్‌ను సమర్థించడం ద్వారా ఆయనకు ఏం వస్తుంది? ఆపరేషన్ మహదేవ్‌లో హతమైన ముగ్గురు పాక్‌కు చెందిన ఉగ్రవాదులే. అందుకు సంబంధించిన ఆధారాలు మా దగ్గర ఉన్నాయి.

వారి దగ్గర పాక్‌లో తయారైన చాక్లెట్లు దొరికాయి. ఆ ముగ్గురి ఉగ్రవాదుల ఓటర్ వివరాలూ ఉన్నాయి. చిదంబరం పాక్‌కు క్లీన్‌చిట్ ఎందుకుఇచ్చారు..? పాకిస్థాన్‌ను కాపాడేందుకు వారు చేస్తున్నకుట్రను 130 కోట్ల మంది ప్రజలు చూస్తున్నారు' అంటూ అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాక్ అణు బెదిరింపులకు భారత్ బెదరదు.. అదరదు!



## రాజ్యసభలో రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ,జూలై 29:** ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్దాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.

ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగాఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయనచెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదోఒకరోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు. కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని, కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు.

పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసిందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. మరో వైపు లోక్‌సభలో హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ జైలుపై రష్యా వైమానిక దాడులు

## 17 మంది మృతి.. 80 మందికి గాయాలు

**కీవ్, జూలై 29:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. తాజాగా సోమవారం అర్ధరాత్రి తమ దేశంలోని జైలుపై మాస్కో వైమానిక దాడులకు పాల్పడిందని ఉక్రెయిన్ అధికారులు ఆరోపించారు. ఈ దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. 80మందిగాయపడినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ జపోర్జియా ప్రాంతంలోని జైలుపై ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. బిలెన్‌కివ్స్కాలోని మరో కాలనీపై కూడా ఈదాడుల ప్రభావం కన్పించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో 17 మంది చనిపోగా.. 42 మంది ఖైదీలు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. సిబ్బందిలో ఒకరితోపాటు మరికొందరు గాయపడ్డారని తెలిపారు. జైలు డైనింగ్ హాలుతో సహా పరిపాలనా, క్వారంటైన్ భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరో మూడంతస్తుల భవనం పాక్షికంగా దెబ్బతిన్నదని, ప్రసూతి ఆస్పత్రి సహా పలు ఆస్పత్రుల్లోని వైద్య సౌకర్యాలు నాశనమయ్యాయని వెల్లడించారు. ఈ దాడుల నేపథ్యంలో ఖైదీలు ఎవరూ జైలు నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు కీవ్ అధికారులు పేర్కొన్నారు. జైళ్ల వంటి పౌరుల మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్నారు. ఇక, రష్యా ప్రయోగించినవాటిల్లో 32 డ్రోన్లను అడ్డుకున్నామని ఆదేశ వైమానిక దళం తెలిపింది. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సుదీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల పరస్పరం డ్రోన్ల దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపి శాంతి నెల కొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

# కన్వరియాల బస్సు.. గ్యాస్ సిలిండర్ల ట్రక్కు ఢీ

## 18 మంది మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

**దేవఘర్,జూలై 29:** జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కన్వరియాలతో వెళ్తున్న బస్సు గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఢీకొన్నది. మంగళవారం ఉదయం 4.30 నిమిషాలకు దేవఘర్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 18 మంది మృతిచెందారని బిజెపి ఎంపీ నిశికాంత్ దూబే పేర్కొన్నారు. దుమ్కా జోన్ ఐజీ శైలేంద్ర కుమార్ సిన్హా మాట్లాడుతూ.. 32 సీట్లు ఉన్న బస్సులో కన్వరియాలు వెళ్తున్నట్లు తెలిపారు. మోహన్‌పురా పోలీసుస్టేషన్ పరిధిలోని జామునియా అటవీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ డిప్యూటీ ఎస్పీ లక్ష్మణ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదంలో కనీసం 9 మంది మృతిచెందారని, గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.తన లోక్‌సభ నియోజకవర్గం దేవఘర్‌లో శ్రావణమాసం సందర్భంగా కన్వర్ యాత్ చేస్తున్న 18 మంది భక్తులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్లు ఎంపీ దూబే తెలిపారు. గాయపడ్డవారిని తొలుత మోహన్‌పుర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, ఆ తర్వాత దేవఘర్ సదర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కనీసం 20 మంది యాత్రికులకు తీవ్ర గాయాలైనట్లు చెబుతున్నారు.

# సంక్షిప్తంగా..

## డాక్టర్‌నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19 కోట్లు స్వాహా

**సూరత్, జూలై 29:** దేశంలోనే అత్యంత పెద్ద డిజిటల్ అరెస్టు పేరిట స్కాం జరిగింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ క్రిమినల్స్ మోసం చేశారు. ఆ డాక్టర్ వద్ద నుంచి సుమారు 19 కోట్లు కాజేశారు. మూడు నెలల వ్యవధిలో ఆ మొత్తాన్ని డిజిటల్ అరెస్టు రూపంలో దోచేశారు. అధికారులమని చెబుతూ కొందరు వ్యక్తులు ఫోన్‌లో బెదిరించి ఆ డబ్బును తమ అకౌంట్లలోకి మళ్లించుకున్నారు. ఈ కేసులో సూరత్‌కు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌లో రూ.కోటి ఉన్నట్లు గుర్తించారు. అయితే సీనియర్ డాక్టర్‌ను 19 కోట్ల మేర మోసం చేసిన వ్యక్తులకు చెందిన నెట్వర్క్ గుట్టు విప్పేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తొలుత మార్చి 15వ తేదీన ఓ లేడీ డాక్టర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌లో అభ్యంతరకరమైన కాంటెంట్ ఉన్నట్లు ఆమెను బెదిరించారు. ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేసి, మనీల్యాండరింగ్ కేసు నమోదు చేయనున్నట్లు ఆ ఫోన్‌కాల్‌లో బెదిరించారు. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తుల నుంచి అధికారులమని ఫోన్ కాల్స్ వచ్చాయి. సబ్ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటూ ఆమెను బెదిరించారు. దీంతో ఆ డాక్టర్ డిజిటల్ అరెస్టు అయ్యింది. ఆ భయంలో ఆమె సుమారు 19 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసింది.

## చైనాలో భారీ వరదలు.. 34 మంది మృతి



**బీజింగ్, జూలై 29:** చైనాను భారీ వరదలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా బీజింగ్‌లో ఇప్పటివరకు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 80వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ మేరకు అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రాజధాని బీజింగ్‌లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మియున్ జిల్లా వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నది. ఇక్కడ 28 మంది, యాంకింగ్ జిల్లాలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పొరుగునున్న హెబీ ప్రావిన్స్‌లో కొండచరియలు విరిగిపడి నలుగురు మరణించారు. ఈ క్రమంలో పలువురి ఆచూకీ గల్లంతయ్యింది. ఇక, బీజింగ్‌లోని 80 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో మియున్‌కు చెందిన వారే 17 వేల మంది ఉన్నారు. లువాన్‌పింగ్ కౌంటీలోని గ్రామీణ ప్రాంతంలోకూడా కొండచరియలువిరిగిపడ్డాయి.

## భారత్ సంతతి కోపైలట్ అమెరికాలో అరెస్టు

**వాషింగ్టన్, జూలై 29:** భారత్ సంతతికి చెందిన కోపైలట్ రుస్తుం భగ్వాగర్ అమెరికాలో అరెస్టయ్యాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అతడిని కాక్‌పిట్ నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డెల్టా ఎయిర్‌లైన్స్‌లో విధులు నిర్వర్తిస్తోన్న అతడిపై చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి. డెల్టా సంస్థకు చెందిన బోయింగ్ విమానం మిన్నియాపోలిస్ నుంచి బయల్దేరి, శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయింది. అది దిగిన పది నిమిషాల వ్యవధిలోనే పోలీసులు కాక్‌పిట్‌లోకి దూసుకువచ్చారు. విమానం నుంచి దిగాలని ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆ పరిణామంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. లోపలికి వెళ్లిన భద్రతా సిబ్బంది కోపైలట్ భగ్వాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'వేర్వేరు సంస్థలకు చెందిన దుస్తులు ధరించిన అధికారులు తుపాకులతో లోపలికి వచ్చారు. అతడికి బేడీలు వేసి తీసుకెళ్లారు' అని ఓ ప్రయాణికుడు మీడియాకు వెల్లడించారు.ఈ అరెస్టుతో భగ్వాగర్ షాక్‌కు గురయ్యాడు. దీని గురించి తనకు ముందుగా తెలియదని చెప్పాడు.

## వాళ్లెవరో..ఏందో..నాకైతే తెల్వదు: ఫరూక్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ,జూలై 29:** పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రకటించడంపై నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా తనదైన శైలిలో స్పందించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది ఆ ముగ్గురు ఉగ్రవాదులేనో లేదంటే మరొకరో అని అనుమానిస్తున్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. 'ఎన్‌కౌంటర్‌లో హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులు ఎవరో.. ఏందో.. నాకైతే తెలియదు' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 'పహల్గాం దాడికి పాల్పడింది హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులేనని కేంద్ర హోంమంత్రి చెప్పారు. అదే నిజమైతే ప్రభుత్వానికి నా అభినందనలు' అని అన్నారు. కాగా పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు శ్రీనగర్‌లో ఉన్నారనే సమాచారం అందడంతో సోమవారం భద్రతాదళాలు ఆ ఏరియాను చుట్టుముట్టి ముగ్గురిని హతమార్చాయి.



మంగళవారం జెయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## ఆగస్టు 10నుంచి స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం

### ఏర్పాట్లు పరిశీలించిన జెయన్‌టియు వైస్ ఛాన్సలర్

**శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా సుమారు 25 సంవత్సరాలు నిర్వహించి మూడేళ్ళ క్రితం మూత పడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం జేయన్‌టియు అనంతపురానికి లీజుకు అప్పగించింది. మూడేళ్ళ పాటు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.40కోట్లు చొప్పున మూడేళ్ళు ఆదుకొనుటకు ఉత్తర్వులు జారి చేసారు. ఈనేపధ్యంలో మంగళవారం జేయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ఇఓ డి.బాపిరెడ్డిలు కలసి ఏర్పాట్లును పరిశీలించారు. సుమారు 15రోజులుగా జేయన్ టియు అనంతపురం స్కిట్ ఇంజనీరింగ్ కళాశా లను ముస్తాబు చేస్తున్నారు. కంప్యూటర్ లాబ్‌లు,గ్రంధాలయాలు,క్లాస్‌రూములతో పాటు కళాశాల ఆవరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు మాట్లాడుతూ స్కిట్‌కు పూర్వ వైభవం తీసుకురావటంలో ప్రభుత్వం,విద్యాశాఖ మంత్రి ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలను ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు మీడియా సమావేశంలో తెలిపారు. రానున్న రోజుల్లో చైనాకు చెందిన సెమి కండక్టర్ పరిశ్రమ ఇండియాలో ఏర్పాటు చేయనున్నారని దాంతో ఈసిఇకి మంచి రోజులు వస్తాయని వివరించారు. డిమాండ్ ఉన్న కోర్సులను స్కిట్‌లో అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించినట్లు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు తెలిపారు.

**మారిన కళాశాల కోడ్:** 1997 నుంచి 2021 వరకు స్కిట్‌గా కొనసాగిన శ్రీకాళహస్తీశ్వరాల యానికి అనుబంధంగా నిర్వహించిన ఇంజనీరింగ్ కళాశాలను ఇక మీదట 'జేయన్‌టిఎస్‌కెఎస్‌ఎఫ్'గా కళాశాల కోడ్‌ను రూపొందించామని వైస్ ఛాన్సలర్ తెలిపారు.

**ఐదు కోర్సుల కు ప్రవేశాలు:** స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు రెండవ కౌన్సిల్‌లో అనుమతిలభించిందని వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడినట్లు సమాచారం. వెబ్ ఆప్షన్లలో ఇంజనీరింగ్ కళాశాల పేరును పొందుపరచారు.ఇక్కడి ఐదు కోర్సుల్లోనూ ఫీజు రూ.70వేలుగా ఖరారు చేసారు. ఇక్కడ మంజూరు చేసిన సీట్లలో ఒక్కొక్క కోర్సులో 66 మందిని అనుమతిస్తారు. మంజూరు చేసిన కోర్సులను పరిశీలిస్తే కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సిఎస్‌సి) ఆర్టిఫిషియల్ ఇంటిలి జెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(సిఎస్‌ఎం) ఎలక్ట్రికల్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇసిఇ) ట్రిబుల్‌ఇలకు అనుమతి లభించింది.

## 9 ఇళ్లలో చోరీలు: రూ.27 లక్షల విలువైన నగలు స్వాధీనం

**శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలో పలు చోట్ల చోరీలకు పాల్పడ్డ దొంగను అరెస్టు చేసి ఆతనినుంచి రూ.27 లక్షల విలువైన 248.7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకు న్నట్లు జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మంగళవారం వివరించారు. నెల్లూరుకు చెందిన మీదూరి సునీల్ (29)ని నెల్లూరుటౌన్‌లోని వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డికాలనీ పెన్నానది బ్రిడ్జి దగ్గర అదు పులోకి తీసుకున్నట్లు వివరించారు. ఇతనిపై శ్రీకాళహస్తి టౌన్, నెల్లూరుటౌన్, బియన్ కండ్రిగ, నాయుడుపేట, గూడూరు పోలీసుస్టేషన్ పరిధిలో 9 కన్నపు నేరాలకు పాల్పడినట్లు ఎస్‌పి వివరించారు. ఇవికాక నెల్లూరు, తిరుపతిజిల్లాలో 28కేసుల్లో నిందితునిగా జైలుశిక్ష అనుభవించి నట్లు నెల్లూరులో ఇతనిపై డిసి షీట్ ఉన్నట్లు తెలిపారు. మూడు మోటార్‌సైకిల్ దొంగతనాలు కేసులు ఉన్నట్లు వివరించారు. చెడు వ్యసనాలకు బానిసై రాత్రివేళల్లో తాళాలువేసిన ఇళ్ళను టార్గె ట్ చేసుకొని బంగారం,విలువైన వస్తువుల్ని దొంగతనం చేసేందుకు అలవాటు పడ్డాడని ఎస్‌పి



మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

వివరించారు.ఈ కేసులను ఛేదించటంలో శ్రీకాళ హస్తి డివైయస్‌పి నరసింహామూర్తి పర్యవేక్షణలో టౌన్ సిఐ డి.గోపి, తొట్టంబేడు ఎస్ఐ రామాం జనేయులు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరిం చినట్లు ఎస్‌పి తెలిపారు. వారికి రివార్డులు ప్రక టించారు. వారిచొరవను ఎస్‌సి అభినందించారు.


## సంక్షేమ రధం..అభివృద్ధి పధం

### సుపరిపాలన-తొలి అడుగులో భాగంగా 2వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు, జులై 29 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దు గుర్రుల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రెండో డివిజన్ ఆర్టీసి కాలనీలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఏడాది కాలంలో తమ ప్రాంతాన్ని అభివృద్ధి పధంలో నడిపించిన నాయకుడు రావడంతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుపరిపాలన-తొలి అడుగుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంచుతూ ఎమ్మెల్యే నసీర్ ముందుకు సాగారు. పార్టీ పథకాలు అమలుపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ఆర్టీసి కాలనీలో వర్షం పడితే అడుగుపెట్టాలంటే గుంతల మయంగా ఉండేవని, ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గత పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని 20ఏళ్ళు వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను 90శాతం అమలు చేశామని వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, తల్లికి వందనం, వాట్సాప్ గ్రీవెన్స్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యాని తెలిపారు. రానున్న నాలుగేళ్ళలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పధాన నడిపిస్తామని చెప్పారు.

**వృద్ధురాలు ఇంటి నిర్మాణానికి హామీ**

ఆర్టీసి కాలనీలో శ్రీలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటిపై కప్పు పూర్తిగా దెబ్బతినడంలో ఎమ్మెల్యే నసీర్ వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటిపైకప్పు నిర్మాణానికి



తన సొంత నిధులు వెచ్చిస్తానని ఆ వృద్ధురాలికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజా, మాస్టర్ డిప్యూటీ మేయర్ సజీల్లా, క్లస్టర్ ఇన్‌చార్జి సయ్యద్ అన్వర్, డివిజన్ అధ్యక్షులు జబీఖాన్, బెల్లా వెంకటేశ్వర్లు, కోటా పిచ్చిరెడ్డి, మొవ్వ శైలజ, బాబు, బాషీ, దిలీప్; శాంతి, దాసు, డేవిడ్, మహేష్, దాసరి శ్రీను, సుభాని, బుచ్చిబాబు, ఖాదర్ భాషా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోమించాలి

### ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి

**గుంటూరు తూర్పు, జులై 29 (ప్రభాతవార్త) :** యువకుడు విద్యా వంతుడు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోమించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి అన్నారు. మంగళవారం మైనార్టీ శాసన సభ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఎన్నికైన సందర్భంగా ఆయన కార్యాలయంలో ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. మైనార్టీ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న నసీర్‌కి ఈ పదవి ఇవ్వటం హర్షణీయమన్నారు. ఇటీవలే రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులుగా, హజ్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర




ప్రభుత్వంచే నియమితులైన నసీర్ మైనార్టీ శాసనసభ కమిటీ ఛైర్మన్‌గా ఎంపిక అవ్వటం ఆయన పనితీరుకు నిదర్శనం అని కొనియాడారు. సమస్యల పట్ల నసీర్ స్పందిస్తున్న తీరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ వరుసగా పదవులు ఇస్తున్నారని అని పదవులకు న్యాయం చేస్తే సత్తా నసీర్‌లో ఉందని ఆయన అన్నారు. ప్రతి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తున్నారని నసీర్ పనితీరు ఇతర ఎమ్మెల్యేలకు ఆదర్శనీయమని ఖాజావలి అన్నారు. మైనార్టీ వర్గాలకు బలహీన వర్గాలకు అండగా ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి పేదలకు మరింత న్యాయ చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు షేక్ షాకీర్, మహమ్మద్ షరీఫ్, షేక్ యాసిన్, షేక్ రసూల్, పఠాన్ మహబూబ్ ఖాన్ తదితరులు ఎమ్మెల్యేను శాలువాకప్పి సత్కరంచారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీలందరికీ ప్రభుత్వ ఫలాలు అందే విధంగా కృషి చేస్తానని చంద్రబాబు, లోకేష్‌ల అడుగుజాడలో నడుస్తూ పని చేస్తానని అన్నారు. మైనార్టీలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆర్థికలోటు ఉన్నప్పటికి అభివృద్ధి సంక్షేమ పథకాలు

### మంత్రి కొల్లు రవీంద్ర

**కావలి (నెల్లూరు), జూలై 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రూ. 16 వేల కోట్లు ఆర్థిక లోపు వున్న ప్పటికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి,సంక్షేమ పధకాలను ముందుకు తీసుకువెల్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రాతో కలసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు. తుమ్మలపెంట పంచాయితీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం సుపరిపాలనలో తోలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రా లను పంచి ప్రజల సమస్యలను అడిగి తెలు సుకున్నారు. తుమ్మలపెంట లోని పట్టపుపాళెం వద్ద రూ.42.6 లక్షల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లకు, తుమ్మలపెంట పల్లిపాళెం వద్ద రూ.44 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్ కింద త్రాగునీటి వసతికి, రూ. 27.4 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఓట్లూరు వద్ద రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం, రూ. 55 లక్షలతో వ్యయంతో



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే తదితరులు

రక్షిత మంచినీటి పథకం శంకుస్థాపనలు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రలతో కలసి నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన పలు హామీలలో పలు హామీలలో 95 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఫించన్లను పెంచి అరియర్స్‌తో పాటు ఒకే సారి ఫించన్‌దారులకు చెల్లించడం జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలో 64 లక్షల మంది ఫించన్ దారులు వున్నారని, నెలకు రూ. 4వేలు ఫించన్ ఇచ్చే ఎకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వుందన్నారు. తల్లికి వందనం కింద కుటుంబంలో చదువు కుంటున్న పిల్లలందరికి ఇంటర్మీడియట్ వరకు రూ. 13 వేలు వంతున చెల్లించడం జరుగు తుందన్నారు. శాసనమండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు తెలిసిన వ్యక్తి మంత్రి కొల్లు రవింద్రా అని కొనియాడారు. తమ ప్రభుత్వ హయంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యదిక నిధులతో సిసి రోడ్డు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అవసరం మేరకు అంగన్వాడీ కేంద్రాలు తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామీణ సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి తుమ్మలపెంటకు వచ్చారని ఆయన తెలిపారు. ప్రభుత్వం కాపుల అభ్యున్నతికి, మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని సమస్యలను తెలుసుకోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అని తెలుసుకోని పథకాలు అందని వారికి అవి అందే విధంగా చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం చెప్పట్టినట్లు తెలిపారు. ఓట్టూరు అంటే తనకు ప్రత్యేక అభిమానం అని ఆయన అన్నారు. ఈ రోజు సీసి రోడ్డుతో పాటు, మంచి నీటిని అందించే విదంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజులలో డ్రైనేజిలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్మశాన వాటికకు వెల్లే రోడ్లను పూర్తిగా వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కావలి రూరల్ మండల ఆధ్యక్షులు అవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అలేఖ్య, బీదా గిరిదర్, పలగాటి శ్రీనివాసుల రెడ్డి, అప్కాబ్ మాజీ ఛైర్మన్ పాల్ శెట్టి,నూడా మాజీ డైరెక్టర్ పొలదగు రంగారావు, మాజీ జడ్‌పిటీసి సభ్యులు నాయుడు రాంప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

# పెట్టుబడులకు ఎపి అత్యంత సానుకూలం

### రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా విశాఖ, కెప్పెల్, జీఐసీ, విల్మార్ ప్రతినిధులతో భేటీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రపంచంలో అత్యంత ఆధునిక సాంకేతికాభివృద్ధి సాధిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.ఆర్థికాభివృద్ధికి పెట్టుబడిదారులకు ఏపీ అత్యంత సానుకూలమన్నారు. నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో బేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు. అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్



సింగపూర్‌లో పారిశ్రామికవేత్త రాహుల్ కాలేతో చంద్రబాబు భేటీ

యోతోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో ఏఐ సింగపూర్ భాగస్వామ్యంగా పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్‌ఐఏ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జాన్ లిన్ విలిన్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలను జాన్ లిన్ విలిన్‌కు సీఎం వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎస్‌ఐఏ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తర్వలోనే రాష్ట్రానికి తమ కంపెనీ ప్రతినిధులను పంపిస్తామని చెప్పారు. అలాగే, విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్ కలేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా విల్మర్ టెక్నాలజీ అందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టుబడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. డేటా సెంటర్లకు విశాఖ అత్యు త్తమమని సీఎం చంద్రబాబు సింగపూర్ లోని పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు. విశాఖలో ఐటీ కంపెనీల స్థాపనకు అవసరమైన ఎకో సిస్టంను ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలపై జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో సీఎం చంద్రబాబు, మం త్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, సింగపూర్‌కు చెందిన పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని సీఎం వివరించారు. అమరావతిలో దేశంలోనే తొలి క్వాం టమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. 2026 జనవరి నాటికల్లా ప్రారంభం అయ్యే క్వాంటమ్ వ్యాలీ ఎకో సిస్టమ్ లో సింగపూర్ కంపెనీల పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. సింగపూర్ కంపెనీలు క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు ప్రయోజనాలు పొందటంతో పాటు పరిశోధనలు చేయొచ్చని తెలిపారు. ఏపిలో పెట్టుబడులకు గల అవకాశాలను, ప్రభుత్వ పాలసీలను ఈ సం దర్భంగా సీఎం వివరించారు.

## ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ-పియం కిసాన్ నిధులు జమ

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,జూలై29, ప్రభాతవార్తప్రతినిధి:** అర్హు లైన రైతులందరికీ ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పియం కిసాన్ నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈ అంశంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆ యన సంబంధిత శాఖల అధికారులతో సమీ క్షించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా మరింత చేయూతను అందించే లక్ష్యంతో సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి 20వేల రూ.లు వంతున అన్నధాత సుఖీభవపియం కిసాన్ కింద సహాయం అందించడం జరుగు తోందని తెలిపారు.ఈపథకానికి సంబంధించి ఇంకా ఇకెవైసి మరియు ఎన్పిసిఐ మ్యాపింగ్ కానివారు వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఇకెవైసి మరియు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని చెప్పారు. ఈపథకం అమలుకు ఇంకా మరో మూడు రోజులు వరకూ సమయం ఉన్నందున



అన్నదాత సుఖీభవ-పియం కిసాన్ నిధులు జమపై సమీక్షిస్తున్న ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఈరెండు అంశాలు పెండింగ్‌లో ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈపథకం వర్తించలేదని రైతుల నుండి ఫిర్యాదులు వస్తుంటాయని కావున వాటిపై రెవెన్యూశాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.దీనిపై గురువారం నిర్వహించే కలక్టర్ల వీడియో సమావేశంలో కూడా చర్చించడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. అంతకు ముందు వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈపథకం అమలుకు సంబంధించిన వివరాలను తెలియ జేస్తూ ఈపథకం కింద లబ్ది పొందాలంటే ఇ కెవైసిలో నమోదు తప్పనిసరని స్పష్టం చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, పశుసం వర్ధక,మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్,అదనపు సిసిఎల్ఏ ప్రభాకర్ రెడ్డి,ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్,యుబిఐ ఎజియం శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే వర్చువల్ గా సిసిఎల్ఏ జయలక్ష్మి,సియం కార్యదర్శి రాజమౌళి, పలువురు బ్యాంకరులు పాల్గొన్నారు.

**విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల పనులు నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలి**

రాష్ట్ర విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో, విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కార్యనిర్వహణ సామర్థ్యం, నిర్దిష్ట సమయానికి పనులను పూర్తి చేయటం , ఆర్థిక నిర్వహణ వంటివి అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏ పీ జెన్కో , ఏపీపీడీసిఎల్ ప్రాజెక్టుల పురోగతి, విద్యుత్ ఉత్పత్తి పనితీరును సిఎస్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపీట్రాన్స్కో జెఎండీ కీర్తి చెకూరి,ఏపీజెన్కో డైరెక్టర్లు పి. అశోక్ కుమార్ రెడ్డి, శ్రీ ఎం. సుజయ కుమార్, ఏపీట్రాన్స్కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, శ్రీ జె.వి. రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లడుతూ ఏపీజెన్కో, ఏపీపీడీసిఎల్ సంస్థలు 2025 ఆర్థిక సంవత్సరంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో 10 వృద్ధిని నమోదు చేసా యని, గత ఆర్థిక సంవత్సరంలో 32,219 మిలియన్ యూనిట్ల (లీగీ) ఉత్పత్తి ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో అది 35,547 మిలియన్ యూనిట్లకు చేరిందని వెల్లడించారు. జల విద్యుత్ ఉత్పత్తిలో 95 వృద్ధి నమోదు కావడాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రశంసించారు. ఇదే స్ఫూర్తి తో విద్యుత్ ఉత్పత్తి కొనసాగించేలా సమర్థ వంతమైన ప్రణాళిక, సమయపాలనలో విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ప్రతి ఉత్పత్తి కేంద్రం తన అత్యధి కంగా ఉత్పత్తి చేసిన స్థాయిని బెన్చ్‌మార్క్‌గా తీసుకుని, అలాంటి రికార్డును కొనసాగించేందుకు కోసం కృషి చేయాలని సూచించారు.

## భూమి స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలి

**పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త:** రైతులు భూసార పరీక్షలు చేయించి, భూమి యొక్క స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని కసుకర్రు, చింతలపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరినాట్లు వేసే క్షేత్రంలో భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వినియోగిస్తే అధికార దిగుబడులతో పాటు నాణ్యమైన పంటలను సాధించవచ్చన్నారు.



ఎకరాకు 50కిలోల డిఎపి, యూరియా 25కిలలో కలిపి దమ్ములో వేయాలన్నారు. నాటిన ఐదు రోజుల లోపు చల్లాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు ఈకెవైసి చేయించుకోవాలన్నారు. పంటల బీమాకు సంబంధించి వరిపైరుకు ఎకరాకు రూ.800చెల్లించి, రూ.40వేల వరకు బీమా రక్షణ పొందవచ్చన్నారు. పాత పొన్నూరు పశువైద్యాధికారి డాక్టర్ షైనీ మాట్లాడుతూ రైతులకు పెయ్యదూడల పెంపకం గురించి వివరించారు. ఆరు నెలలలోపు దూడలకు నులిపురుగులు మందు వాడాలన్నారు. దీని ద్వారా దూడలు త్వరగా ఆరోగ్యకరంగా పెరిగి, త్వరగా ఎదకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకురాలు పి.దుర్గమ్మ, డి.షకీనా, ఎంపీఈవో సురేష్‌బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### -జనసేన పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి శ్రీధర్

**పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త:** జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యర్తలు, నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్న విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక నాయకత్వం జనసేన పార్టీ నాయకులను, కార్యకర్తలను దూరం పెడుతుందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క నామినేటెడ్ పదవి కూడా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు దక్కపోవడం చాలా విచారకరమన్నారు. ప్రస్తుత పరిణామాలపై జనసేన కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో పార్టీ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ, మండల అధ్యక్షులు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మేకల రామయ్య వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనసైనికులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా సంగం అడుగులు

### -సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త:** సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సంగం డెయిరీ పనిచేస్తోందని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు.చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి



సంగం డెయిరీలో మంగళవారం పలువురు లబ్దిదారులకు నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులకు మెరుగైన పాల ధర, బోనస్, పలు రకాల సబ్సిడీలతో, పశువైద్య సదుపాయాలు అందిస్తూ ఆదుకొంటున్నా మన్నారు. డివిసి అభయ పథకంలో పేరు నమోదు అయిన పాల ఉత్పత్తిదారులు, పాలకేంద్రం సిబ్బంది ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబాలకు అండగా సంగం డెయిరీ ఉంటుంద ˇన్నారు .గత నెలలో మరణించిన పలు కుటుంబాలకు రూ.3,69,144ఆర్థిక సహాయం అందజేశారు. జడవల్లి గ్రామానికి చెందిన పిల్లి సారమ్మ మరణించినందున వారి కుటుంబ సభ్యులకు రూ.1,29,144, అంత్యక్రియల ఖర్చులు మరో రూ.10వేలు అందించడం జరిగిందన్నారు. నిడుబ్రోలు గ్రామానికి చెందిన పొన్నగంటి సుబ్బారావు, నన్నపనేని వెంకటేశ్వర రావులు మరణించినందున వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.50వేలు, అంత్యక్రియల కింద రూ.10వేలు అందించడం జరిగిందన్నారు. కర్లపాలెం మండలం బుద్దాం గ్రామానికి చెందిన నర్రా రామయ్య మరణించినందున వారి కుటుంబ సభ్యులకు రూ.50వేలు, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందించామన్నారు. కర్లపాలెం గ్రామానికి చెందిన ఆకుల వాసుబాబుకు సంబంధించిన గేదె మరణించి నందున పశు సంక్షేమ పథకం ద్వారా రూ.50వేలు చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర ˇమంలో పాలకవర్గం సభ్యులు వలివేటి ధర్మారావు, మరీదు వెంకటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సంగం అధికారులు పాల్గొన్నారు.

# బిసీలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జూలై 29 ప్రభాతవార్త :** రాష్ట్రంలో బలహీన వర్గాలకు పూర్తిస్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బిసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీను నాయకత్వంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కారించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన బిసీ సంక్షేమ కమిటీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు అవకాశం కల్పించిన సియం చంద్రబాబుకు



కృతఘ్నుతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వారు మున్సిపాల్టిని 14వ ర్యాంకుతీసుకుని వచ్చారని పేర్కొన్నారు. శాసనసభలో, శాసనమండలిలో బిసీల గురించి, వారి జీవన విధానం, ఆర్థిక విధానం, విద్యా, ఉద్యోగ రంగాలలో వారికి లభించాల్సిన ప్రోత్సాహం గురించి వివరంగా మాట్లాడే కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహిస్తారని తెలిపారు. పల్నాడు జిల్లాలో బిసీల కులాల వివరాలు వారి దృష్టికి తమ సంక్షేమ సంఘం ద్వారా తెలియచేయటం జరుగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్, శివప్రసాద్, ఆంజనేయులు, బోసుబాబు, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యం : ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లిరూరల్, జులై 29,ప్రభాతవార్త :** సత్తెనపల్లి రూరల్ పరిధిలోని ధూళిపాళ్ళ గ్రామం నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాజీ



మంత్రివర్యులు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణఇంటి ఇంటికి వెళ్లి ప్రజలతో నేరుగా చర్చించి పథకాల గురించి తెలుసుకున్నప్రజలకు పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై అధికారులు దృష్టి పెట్టాలి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏ కష్టం రాకుండా ముఖ్య మంత్రివర్యులునారా చంద్రబాబు నాయుడుఅహర్నిశలు శ్రమిస్తున్నారు సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ప్రజలకు స్వయంగా వివరించిన శాసన సభ్యులు కన్నా ప్రతి ఇంటిలో సమస్యలు తెలుసుకొని, వాటిని మైతెలుగుదేశం పార్టీయాప్‌లో స్వయంగా నమోదు చేసిన , వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించిన శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ రానున్న నాలుగు సంవత్సరాల్లో మరింత నిధులు తీసుకువచ్చి సత్తెనపల్లి అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తామన్న శాసన సభ్యులు కన్నాగత ప్రభుత్వంలో అమ్మ ఒడి అందరికీ ఇస్తామని చెప్పి మోసం చేసి ఒకరికే పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం లో సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ యువతకు ఉద్యోగాలు హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంరానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందిఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సత్తెనపల్లి వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిని కలిసిన నాయకులు

**సత్తెనపల్లి, జూలై 29 ప్రభాతవార్త :** సత్తెనపల్లి వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిని మంగళవారం జిల్లా అనుబంధ విభాగాల సెక్రటరీ షేక్.మస్తాన్‌వలి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గ, పట్టణ, మండల అనుబంధ విభాగాల ఏర్పాటుపై సమావేశంలో చర్చించామన్నారు. డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అనుబంధ విభాగాలలో పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా విభాగాలలో త్వరలోనే నియామకాలు పూర్తి చేస్తామన్నారు. సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు.

# రైతులందరూ పంటల భీమా చేయించుకోవాలి

**పెదకూరపాడు, జూలై 29 ప్రభాతవార్త :** జూలై 31వ తేదీలోగా పత్తి, మిరప,



కంది రైతులందరూ పంటల భీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు మంగళవారం తెలిపారు. మండలంలోని గారపాడు, హుస్సేన్‌నగరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పంటల భీమాపై అవగాహన కల్పించారు. ప్రత్తిపంటకు ఎకరాకు రూ.1900లు, కందికి రూ.40లు, మిరపకు రూ.360లు, వరికి రూ.80 లు, కామన్ సర్వీస్ సెంటర్స్ ద్వారా చెల్లించాలన్నారు. వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, విస్తరణ అధికారి శివపార్వతీ, రైతు సేవా కేంద్రం సిబ్బంది మహేష్, సుచరిత, గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్తమ హైస్కూల్‌గా 75 తాళ్ళూరు ఉన్నత పాఠశాల

**పెదకూరపాడు, జూలై 29 ప్రభాతవార్త :** జాతీయస్థాయిలో ఉత్తమ పిఎం శ్రీ హైస్కూల్‌గా 75 తాళ్ళూరు జెడ్పీ పాఠశాల ఎంపికైంది. మంగళవారం జాతీయ




విద్యావిధానం నెప్ - 2020 5వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్రప్రధాన్ జాతికి అంకితం చేశారు. స్థానిక పాఠశాలలో ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగ్గా కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. న్యూఢిల్లీ నుండి ప్రసారమైన వివిధ కార్యక్రమాలను విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్‌పర్సన్ బి.చంద్రకుమారి, మండల విద్యాశాఖాధికారి పి.సత్యనారాయణ, హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, ఏఈ అనుముల శ్రీనివాసరెడ్డి, క్లస్టర్ సిఆర్‌ఎంటి శివ తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్‌యులో లింగ వివక్షపై అవగాహన సదస్సు

తాడేపల్లి,జూలై 29,ప్రభాతవార్త : కెఎల్‌యు లో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్,స్పృహప్తి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో లింగ వివక్ష పైన అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు చెందిన డాక్టర్ మస్తాన్ బి షేక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. లింగ ఆధారిత వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నందున మహిళలకు, బాలికలకు సురక్షితమైన ప్రదేశాలను ఏర్పాటు చేయడం మన చేతుల్లోనే ఉందన్నారు. మహిళా సాధికారత సాధించడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, ఇతర రకాల హింస నుండి రక్షించడానికి అందుబాటులో ఉన్న చట్టాల



గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, వ్యోమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# గంబూసియా చేపలతో దోమల వ్యాప్తి అరికట్టవచ్చు

**తెనాలి మున్సిపాలిటీ జూలై 29 ప్రభాతవార్త:** గంబూసియా చేపలతో దోమల వ్యాప్తి అరికట్టవచ్చుని మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక అన్నారు. మంగళవారం పట్టణంలోని చినరావూరు లోగల సత్యన్నారాయణ పార్కు నందు మలేరియా, ఫైలేరియా శాఖల సహకారంతో మున్సిపల్ కమీషనర్




విఎం.లక్ష్మీతిరుపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ఏసుబాబుతో కలసి పార్కులోని చెరువులో గంబూసియా చేపలను చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వనీటిలో దోమలు గుడ్లు పెట్టడం ద్వారా అభివృద్ధి చెంది తద్వారా పెద్ద దోమలుగా తయారవుతారని, ఈ దోమలు వివిధ రకాలైన వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ క్రీడలో కెఎల్‌యు విద్యార్థులకు కాంస్య పతకం

**తాడేపల్లి, జూలై 29, ప్రభాతవార్త :** జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో కెఎల్‌యు విద్యార్థులు కాంస్య పతకాన్ని సాధించినట్లు యూనివర్సిటీ క్రీడల డైరెక్టర్



కె.హరికిషోర్ మంగళవారం తెలిపారు. ఈనెల 16నుంచి 27వరకు జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కెఎల్‌యు నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ విద్యార్థులు బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో పతకాలు సాధించడం ద్వారా విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారన్నారు. వైష్ణవి ఖ డేక్కర్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో ఏఆర్ రోహన్‌కుమార్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు మోహిత్ చౌదరి హాఫ్ మారథాన్‌లో 4వ స్థానాన్ని సాధించడం ద్వారా ఆసాధారణమైన అథ్లెటిసిజాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. వర్సిటీ అధికారులు, విద్యార్థులు పతక విజేతలకు, పాల్గొన్నవారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య విసి డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# కెఎల్‌యులో బాలికలకు ఆత్మరక్షణ పై అవగాహన సదస్సు

**తాడేపల్లి, జూలై 29, ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళలకు, బాలికలకు ఆత్మరక్షణ గురించి విజయవాడలోని ఎన్జీవో, ఇసిఇ సేఫ్ టీం విభాగంతో కలసి మహిళా అభివృద్ధి సెల్ మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఆత్మ రక్షణ శిక్షకురాలు కీర్తిక కెఎల్‌యు సందర్శించి బాలికల వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. అవగాహన సదస్సుకు మహిళా అధ్యాపక సభ్యులు, బోధనేతర సిబ్బంది, బాలికలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆచార్య వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, వ్యోమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను ఆదుకోవాల్సి బాధ్యత అందరిదీ

## తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, జూలై 29, ప్రభాతవార్త:** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటు సమాజంపై కూడా ఉందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. స్థానిక షాదీఖానాలో గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జర్నలిస్టులకు రాయితీ హెల్త్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ మాదిరిగా మిగిలిన వైద్యశాలల వారు కూడా జర్నలిస్టులకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ మాట్లాడుతూ రాత్రనక, పగలనక కష్టించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలన్నారు. లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ యాజమాన్యం హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు ఈ సందర్భంగా సూపర్ స్పెషాలిటీ యాజమాన్యం డాక్టర్ లలిత, డాక్టర్ రాఘవశర్మలకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా, పొన్నూరు అధ్యక్షుడు ఎండి షరీఫ్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# 24గంటలు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**పొన్నూరు, జూలై 29, ప్రభాతవార్త:** వ్యవసాయానికి మెరుగైన, నాణ్యమై విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం వివిధ రకాల సంస్కరణలను తీసుకొచ్చి అమలు చేస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. మండల పరిధిలోని నిడుబ్రోలు వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉన్న 33/11కెవి సబ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సబ్ స్టేషన్‌ను రూ.58.2లక్షల నిధులతో ఫీడర్ మోడరైజేషన్ కింద చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల జిల్లాలలో వున్న అన్ని ఫీడర్లలో ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర సర్వీసులు వేరు చేస్తున్న ఫీడర్ బైఫర్ కేషన్ పనులను మూడు నెలలో పూర్తి చేస్తామన్నారు. సెప్టెంబరు నెలాఖరుకు పనులు పూర్తి గ్రామాలకు నిరంతరాయంగా నాణ్యమైన 3పేజ్ విద్యుత్‌ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దానికి



సంబంధించిన పనులన్నింటిని ప్రోగ్రాం చేయడం జరిగిందన్నారు. సెప్టెంబరుకు మొత్తం గ్రామాలను పూర్తి చేసి 3పేజ్ కరెంటు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం వడ్డిముక్కల గ్రామానికి 3పేజ్ విద్యుత్ సరఫరా పూర్తి అయిందన్నారు. వ్యవసాయానికి పగటిపూట నిరంతరాయంగా 9గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయవన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎక్కువ శాతం మంది వ్యయసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలున్నాయన్నారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పంటలు సాగవుతున్నాయన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, ఎపిసిపిడిసిఎల్ సీఎండి పుల్లారెడ్డి, ఎపిసిపిడిసిఎల్ హెచ్‌ఆర్డీ లింగమూర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ టీవిఎస్ఎన్ మూర్తి, టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఈఈ ఎలక్ట్రికల్ భాస్కరరావు, ఈఈ టెక్నికల్ మల్లికార్జునరావు, ఈఈ బాపట్ల రాజేష్ ఖన్నా, ఎడిఎ వెంకటేశ్వరరావు, ఎఈ శంకరరావు, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు పంటను నమోదు చేయించుకోవాలి

## మండల వ్యవసాయాధికారి శ్రీనివాసురెడ్డి

**కొల్లిపర, జూలై 29 ప్రభాతవార్త:** పంటల నమోదు కార్య క్రమం ప్రారంభమై ందని ప్రతి




ఒక్క రైతు తమ పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసురెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మెట్ట.. మాగాణీ భూముల్లో పండిస్తున్న పంటలపై తీసుకోవలసిన జాగ్రత్లపై రైతులకు తగిన జూచనలు.. సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మెషిన్ క్రింద మినుము విత్తనముల మినీ కిట్లను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం సత్యన్నారాయణ, ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి, వ్యవసాయ విత్తనాధికారులు మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్వమిత్ర సర్వే చేసేందుకు సిద్దంగా ఉండాలి

## డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్

**కొల్లిపర, జూలై 29 ప్రభాతవార్త:** స్వమిత్ర సర్వే చేసేటప్పుడు అధికారులు తగిన జాగ్రత్లు



తీసుకుంటూ.. ప్రజల నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలని డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంటులకు స్వమిత్ర సర్వేపై అధికారులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ స్వమిత్ర సర్వే చేసేందుకు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి సర్వేయర్లు జగన్మోహన్‌రావు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం

**కొల్లిపర, జూలై 29 ప్రభాతవార్త:** ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం



సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర ఆరిమండ వారి కళ్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయాధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడికి అధికారులకు మధ్య వారధిలా పనిచేస్తుందన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి, మాస్టర్ ట్రైనర్ పాండు, అధికారులు మురళి, సుధారాణి పాల్గొన్నారు.

# వైసీపీ తాడేపల్లి పట్టణ కార్యదర్శి రోడ్డ ఎలీషా పుట్టినరోజు వేడుకలు

**తాడేపల్లి, జూలై 29, ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తాడేపల్లి పట్టణ కార్యదర్శి రోడ్డ ఎలీషా జన్మదిన వేడుకలు పట్టణ అధ్యక్షులు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్య అతిధులుగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగ కమిటీ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ లు విచ్చేశారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, జూలై 29, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే



ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ ప్రసుత్తం వాతావరణం అంతా కాలుష్యంగా తయారైదన్నారు. కాలుష్య రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకొని వీలైనంత మేర మొక్కలను నాటాలని, వాటిని పెంచే బాధ్యత కూడా చేపట్టాలన్నారు. భూమిపైన ఉన్న అన్ని ప్రాణులు సుఖంగా ఉండాలంటే తప్పని సరిగా గుబురు శాతాన్ని పెంచాల్సి ఉందన్నారు. అడవుల శాతం కూడా పూర్తి తగ్గిపోతుందన్నారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెట్లు నరికివేయాల్సి వస్తే తప్పనిసరిగా అందుకు తగ్గట్లుగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరరావు, బొప్పన బాపనయ్య, పఠాన్ అహ్మద్‌ఖాన్, బొర్రు రామారావు, షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్ తదితరులున్నారు.

# కొప్పునూరులో పొలం పిలుస్తోంది

**మాచర్ల, జులై 29 ప్రభాతవార్త:** మాచర్ల మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మాచర్ల మండల వ్యవసాయాధికారి డి.పావకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులతో కలిసి పత్తి పంట పొలాలను సందర్శించారు. పత్తి పంటల సాగులో గులాబీ రంగు పురుగు రాకుండా తతీసుకోవాల్సిన



ముందస్తు జాగ్రత్తలను రైతులకు వివరించారు. వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు పంటల బీమా కట్టుకోమని సూచించారు. కౌలు రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సీసీఆర్‌సీ కార్డులను పొందాలనిఇ తెలిపారు. పంటల సాగులో సేంద్రీయ, పట్టిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ విస్తరణాధికారి ఎం.మార్కండేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది బి.తులసినాయక్, జి.ప్రతాప్, కొప్పునూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలి

## -సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

**మాచర్ల, జులై 29 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల



నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఐ కొమెర వీరాస్వామి భవన్‌లో మంగళవారం కేతావత్ రంగనాయకులు, షేక్ సైదా అధ్యక్షతన జరిగిన మాచర్ల ఏరియా 16వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కరువైందన్నారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు మోదీ ప్రజలపై లక్షల కోట్లు పన్నుల రూపంలో భారాన్ని మోపుతున్నారన్నారు. మోడీ చేతిలో సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కీలుబొమ్మలుగా మారారన్నారు. అనాదిగా వెనుకబడిన పల్నాడు ప్రాంతంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే ప్రజలకు ప్రభుత్వాలపై విశ్వాసం ఉంటుందన్నారు. సీపీఐ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాలికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రజాసమస్యలపై స్పందించాలన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, మారుతి వరప్రసాదరావులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. విద్యుత్తు ఛార్జీల పేరిట లక్షల కోట్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. నాడు ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మోదీతో కుమ్మక్కవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. యేటా 15 శాతం ఇంటి పన్నులను పెంచడంలో అర్థం లేదన్నారు. నిస్వార్థ పాలన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది కార్మికులతో చేపట్టిన ర్యాలీ రైల్వేగేటు నుంచి పార్టీ కార్యాలయం వరకు సాగింది. ముందుగా పార్టీ కార్యలయం ముందు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏరియా కార్యదర్శిగా మేకపోతలు శ్రీనివాసరెడ్డిని కమిటీ ప్రకటించారు. కార్యక్రమంలో జిలాల్ల సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమెర వెంకట్రావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు నర్రా రంగస్వామి, మాచర్ల, దుర్గి మండలాల కార్యదర్శులు ఎం.బాబురావు, కాలా శివయ్య, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలించాలి : తహశీల్దార్ సిద్ధార్ధ

**కొల్లిపర, జూలై 29 ప్రభాతవార్త:** కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలించాలని తహశీల్ధార్ గుమ్మడి సిద్ధార్ధ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో విఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



సిద్ధార్ధ మాట్లాడుతూ రైతుల దగ్గర నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూచు కోవాలన్నారు. విఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి ద్వారా వచ్చిన ధరఖాస్తులను పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటి తహశీల్ధార్ రాజేష్, ఎఎస్‌ఓ మనోహర్‌రెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30-7pg10exCP.qxd:30-7pg10exCP.qxd 01/01/01 8:17 AM Page 1



# ఐదో టి20లో వెస్టిండీస్ చిత్తు

## సిరీస్ వైట్‌వాష్ చేసిన ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా అద్భుతమైన విజయంతో ముగించింది. సెయింట్ కిట్స్ వేదికగా మంగళవారం వెస్టిండీస్‌తో జరిగిన ఐదో టీ20లో 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపొందింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌ను కంగారులు వైట్ వాష్ చేశారు. ఆఖరి టీ20లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు




19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌట్ అయింది. విండీస్ బ్యాటర్లలో విధ్వంసకర బ్యాటర్ షిమ్రాన్ హైట్‌మైర్ (31 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) టాప్ స్కోరర్‌గా నిలవగా, షెర్ఫేన్ రూథర్ ఫర్డ్ (35) హోల్డర్ (20) రాణించారు. ఆసిస్ బౌలర్లలో ద్వార్షుయిస్ 3 వికెట్లు పడగొట్టగా, నాథన్ ఎల్లీస్ 2 వికెట్లు సాధించారు. వీరిద్దరితో పాటు, మాక్స్‌వెల్, జంపా, అబాట్, హార్డీ తలా వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 171 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 7 వికెట్లు కోల్పోయి 17 ఓవర్లలోనే ఛేదించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో మిచెల్ ఓవెన్ (37) టాప్ స్కోరర్‌గా నిలవగా, గ్రీన్ (32), హార్డీ (28 నాటౌట్), డేవిడ్ (30) రాణించారు. విండీస్ బౌలర్లు మరోసారి ఆస్ట్రేలియా బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. అకిల్ హోస్సెన్ ఒక్కడే 3 వికెట్లు పడగొట్టి ఫర్వాలేదనిపించాడు. హోల్డర్, జోషఫ్ తలా 2 వికెట్లు సాధించినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. కాగా ఆస్ట్రేలియా చేతిలో వెస్టిండీస్ టెస్టు టీ20 సిరీస్‌లోనూ వైట్ వాష్ అయింది.




**న్యూఢిల్లీ:** అండర్ 17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశానికి చెందిన హార్దీప్ 110 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ఫైనల్‌కు చేరుకుని, భారతదేశానికి తొలి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 16 ఏళ్ల భారత ఆటగాడు సెమీఫైనల్లో టర్కీకి చెందిన ఎమ్రుల్లా కాప్కాన్‌ను 4-2 తేడాతో ఓడించి బంగారు పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు. హార్దీప్ అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన బక్తూర్ సోవెత్ఖాన్‌పై 2-0 తేడాతో విజయం సాధించి తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత అతను 16వ రౌండ్‌లో పోలాండ్‌కు చెందిన మాట్యూజ్ జరోస్లా టోమెల్కాను 4-2 తేడాతో ఓడించి, క్వార్టర్ ఫైనల్స్‌లో ఉక్రెయిన్‌కు చెందిన అనటోలి నోవాచెంకోపై టెక్నికల్ ఆధిపత్యం ద్వారా 9-0 తేడాతో విజయం సాధించాడు. ఇక భారత్‌కే చెందిన ఆదిత్య గుప్తా (55 కిలోల గ్రీకోరోమన్) మరియు అనుజ్ (65 కిలోల గ్రీకోరోమన్) వారి వారి వెయిట్ కేటగిరీల కాంస్య పతక పోటీల్లోకి ప్రవేశించారు. వారిద్దరూ తమ తమ సెమీ ఫైనల్స్‌లో ఓడిపోగా, ఇప్పుడు పోడియంపై మూడవ స్థానం కోసం పోరాడనున్నారు. కిర్గిజిస్తాన్‌కు చెందిన అల్ఖమ్ అబ్దిరాసులోవ్‌తో మంగళవారం జరిగిన హోరాహోరీ పోరులో గుప్తా 5-6 తేడాతో ఓడిపోగా, జార్జియాకు చెందిన ఎరెక్లే టావ్‌బెరిడ్జ్ చేతిలో అనుజ్ 1-9 తేడాతో ఆధిపత్యాన్ని సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున పోటీలో ఉన్న ఇతర భారతీయులలో, ఆదిత్య జాదవ్ 48 కిలోల గ్రీకో రోమన్ క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన కైసీ యమమోటో చేతిలో 0-8 తేడాతో ఓడిపోయాడు. మరోవైపు, పురుషుల 80 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో సమర్త్ గోవేకర్, టర్కీకి చెందిన ఇస్మాయిల్ బెరెకెట్ చేతిలో 0-11 ఓటమితో అర్హత రౌండ్‌లోనే తన ప్రచారాన్ని ముగించాడు.

# చివరి మ్యాచ్ డ్రా అయితే..

## టెస్ట్ ట్రోఫీ విజేత?

## లాస్ట్ టైమ్ విన్నర్‌కే ఛాన్స్

### 31న ఇంగ్లండ్‌తో భారత్ తుది పోరు



**న్యూఢిల్లీ:** భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతోంది. రెండు జట్ల మధ్య ఈ సిరీస్ చాలా ఉత్కంఠ దశకు చేరుకుంది. ఇప్పటి వరకూ జరిగిన 4 మ్యాచ్‌లలో ఇంగ్లాండ్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉంది. ఇప్పుడు చివరి మ్యాచ్ ఈ నెల 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ ఫలితం సిరీస్‌ను నిర్ణయిస్తుంది. కానీ ఈ సిరీస్ డ్రాగా ముగిస్తే, ట్రోఫీ ఎవరికి లభిస్తుందనేది ఆసక్తికరమైంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లూ ఉత్కంఠభరితంగా సాగాయి. సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ గెలుచుకుంది. రెండవ మ్యాచ్‌లో, టీమ్ ఇండియా విజయం సాధించింది. కానీ ఇంగ్లాండ్ మూడవ మ్యాచ్‌ను గెలిచి 2-1 ఆధిక్యంలో ఉంది. టీమిండియా నాల్గవ మ్యాచ్‌ను డ్రా చేసుకుని ఉండవచ్చు. కానీ, అది ఇంకా వెనుకబడి ఉంది. ఇటువంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ జట్టు సిరీస్ గెలవడానికి ఇంకా ఒక డ్రా మాత్రమే అవసరం. మ్యాచ్ గెలిస్తే, విజయ తేడా 3-1 అవుతుంది. మరోవైపు, టీం ఇండియా ఇప్పుడు ఈ సిరీస్ గెలవదు. కానీ, డ్రా చేసుకునే అవకాశం చాలా ఎక్కువ. 5వ టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు గెలిస్తే, సిరీస్ డ్రాగా ముగుస్తుంది. కానీ మ్యాచ్ డ్రా అయినప్పటికీ, టీం ఇండియా సిరీస్‌ను కోల్పోతుంది. ఇటువంటి పరిస్థితిలో, రెండు జట్ల మధ్య సిరీస్ 2-2తో డ్రాగా ముగిస్తే, ట్రోఫీ ఇంగ్లాండ్‌లోనే ఉంటుందా లేదా టీం ఇండియాతో కలిసి భారత్‌కు వస్తుందా అనేది ప్రశ్న. రెండు జట్ల మధ్య టెస్ట్ సిరీస్ డ్రా అయినప్పుడు, చివరిసారి ఈ ట్రోఫీని గెలుచుకున్న జట్టుకు ట్రోఫీని అందజేస్తారు. ఇటువంటి పరిస్థితిలో, భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ గురించి మాట్లాడుకుంటే, దీనిని గతంలో పటౌడి ట్రోఫీ అని పిలిచేవారు. ఈ సిరీస్ చివరిసారిగా 2021-22 సంవత్సరంలో జరిగింది. అప్పుడు ఈ సిరీస్ డ్రాగా ముగిసింది. గతంలో ఈ సిరీస్ 2018లో జరిగింది. అప్పుడు ఇంగ్లాండ్ 4-1తో గెలిచింది. అప్పటి నుంచి ఈ ట్రోఫీ ఇంగ్లాండ్ వద్దే ఉంది. ఈసారి కూడా సిరీస్ డ్రా అయితే, అది ఇంగ్లాండ్ వద్దనే ఉంటుంది. ఈ లెక్కన ఈ 5వ మ్యాచ్‌లో గెలిచినా, ఓడినా ఇంగ్లండ్‌కే ట్రోఫీ దక్కుతుంది.

## మహిళల యూరో ఫుట్‌బాల్..

# విజేతగా ఇంగ్లండ్

### 3-1తో స్పెయిన్‌పై గెలుపు



**న్యూఢిల్లీ:** యూరో ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ మహిళల జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. హోరాహోరీ తుది పోరులో ఇంగ్లండ్ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 3-1తో స్పెయిన్‌పై విజయం సాధించింది. చివరి వరకూ పోటా పోటీగా పోరాడిన స్పెయిన్ పెనాల్టీ షూటౌట్‌లో అనూహ్యంగా చిత్తయింది. కేవలం ఒకే ఒక్క స్ట్రయికర్ గోల్ చేయడ గమనార్హం. మరోవైపు ఇంగ్లండ్ బృందంలో ఇద్దరు బంతిని లక్ష్యాన్ని చేర్చడంలో విఫలంకాగా, ముగ్గురు గోల్స్ చేశారు. అంతకు ముందు నిర్ణీత సమయం ముగిసే సరికి ఇంగ్లండ్, స్పెయిన్ జట్లు 1-1 స్కోరుతో సమ ఉజ్జీలుగా నిలిచాయి. ముందుగా స్పెయిన్ శిబిరం నుండి గోల్ నమోదైంది. తొలి అర్ధభాగంలోనే మరియాన కాల్డెంటె (25వ నిముషంలో) గోల్ చేసి జట్టుకు శుభారంభాన్ని అందించింది. 1-0తో ఆధిక్యంతోనే ప్రథమార్ధాన్ని ముగించింది. ద్వితీయార్థం మొదలవగానే ఇంగ్లండ్ ప్లేయర్లు దాడులకు పదును పెట్టారు. ఈ క్రమంలో అలెసియా రుసో (57వ నిముషంలో) గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు ఎంతగా శ్రమించినా ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. నిర్ణీత సమయంలో ఫలితం తేలకపోవడంతో అదనపు సమయం ఆడించారు. అయినా స్కోరులో ఏ మార్పు లేకపోవడంతో పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇక్కడ తొలి షాట్ నుంచే డ్రా మొదలైంది. స్పెయిన్ ఒకటే గోల్ చేసినా, మొదట కిక్ మొదలుపెట్టిన ఇంగ్లండ్ జట్టులో బెతన మీడ్ విఫలం కావడంతో గెలిచేందుకు ఆఖరి షాట్ గోల్ దాకా వేచి చూడక తప్పలేదు. స్పెయిన్ తరపున ప్యాట్రిసియా గూజారో గోల్ కొట్టడంతో నిర్ణీత సమయం మ్యాచ్‌లానే 1-0తో షూటౌట్‌లోనూ తొలుత పై చేయి సాధించింది. అయితే ఇంగ్లండ్ ప్లేయర్లు అలెక్స్ గ్రీన్‌వుడ్, నియామి చార్లెస్‌లు వరుసగా షాట్లు కొట్టడంతో రేసులో పడింది. మరోవైపు స్పెయిన్ మరియానా, ఐతాన బోన్‌మటి విఫలం కావడంతో ఇంగ్లండ్ అనూహ్యంగా 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరకు 3-1తో ఫలితం రావడంతో స్పెయిన్ చివరి షాట్ తీసుకోలేదు. కాగా 2022లో జరిగిన అమ్మాయిల యూరోలోనూ ఇంగ్లండే ఛాంపియన్‌గా నిలిచింది.

## మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో..

# అగ్రపీఠంలో ఇంగ్లండ్ కెప్టెన్ సీవర్

### దిగజారిన టీమిండియా స్టార్ స్మృతి




**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ అగ్రస్థానానికి ఎగబాకింది. గత ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న సీవర్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని టాప్ ప్లేస్‌కు చేరింది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంత వరకూ టాప్ ర్యాంక్‌లో ఉన్న టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధన ఈ ర్యాంకింగ్స్‌లో కిందికి పడిపోయింది. భారత్‌తో ముగిసిన సిరీస్‌లో రాణించడంతో సీవర్ అత్యున్నత స్థానానికి చేరింది. ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ భారత్ చేతిలో 1-2 తేడాతో ఓడినా, సీవర్ 3 మ్యాచ్‌ల్లో 53.33 సగటున 160 పరుగులు చేసి సత్తా చాటింది. మూడో వన్డేలో సీవర్ ఆడిన 98 పరుగుల ఇన్నింగ్స్ ఆమెకు టాప్ ర్యాంక్‌ను కట్టబెట్టింది. ఇక సీవర్ కంటే మెరుగ్గా రాణించకపోవడంతో స్మృతి టాప్ ప్లేస్‌ను కోల్పోయింది. ఈ సిరీస్‌లో 3 ఇన్నింగ్స్‌ల్లో 115 పరుగులకే పరిమితమై రెండో స్థానానికి దిగజారింది. ఇక టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ భారీ జంప్ కొట్టింది. ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో రికార్డు సెంచరీ బాదిన ఆమె ఏకంగా 10 స్థానాలు మెరుగుపర్చుకుని 11వ స్థానానికి ఎగబాకింది. అలాగే భారత్ బ్యాటర్లలో జెమీమా రోడ్రిగెజ్ కూడా రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 13వ స్థానానికి చేరింది. ఇక బౌలర్ల విషయానికి వస్తే ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ బౌలర్లకు సానుకూల ఫలితాలు రాలేదు. స్పిన్నర్ దీప్తి శర్మ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకోగా, ఆమె తర్వాత స్నేహ్ రాణా మెరుగైన స్థానంలో (21) ఉంది. సోఫీ ఎక్లిస్టోన్, యాష్ గార్డనర్, మెగన్ షట్ టాప్-3 బౌలర్లుగా కొనసాగుతున్నారు.


# టిసిఎస్‌లో సీనియర్ల నియామకాల్లేవ్..

**ముంబై, జూలై 29:** టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు కూడా కొన్ని కథనాలు వెలువడ్డాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం. ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం, కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణె, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తాలోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూడదనే నియమాన్ని అమలుచేస్తోంది. ఇక కంపెనీలోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. టీసీఎస్ చేపట్టిన వాటిల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్‌లే కంపెనీకి రూ.2,400నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయనున్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లను ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఓ క్రమపద్ధతిలో అమలు చేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2




శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12వేలకు పైగా ఉద్యోగాలకోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్‌కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గతఏడాదికి పైగా వ్యవధిలో కంపెనీషేరు 30శాతం కుంగింది. నిఫ్టీసూచీలోని ఐటీషేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.


# దివాలాకు 'బ్లూస్మార్ట్'




**ముంబయి, జూలై 29:** విద్యుత్ ట్యాక్సీ ఆపరేటర్ బ్లూస్మార్ట్ దివాలా ప్రక్రియను ప్రకటించింది. సుపరిపాలన, భద్రతాపూర్వక నిర్వహణపై లోపాలు తలెత్తడంతో సంస్థ దివాలాను ప్రకటించింది. నిందితుడయిన సహ వ్యవస్థాపకుడు వాహన కొనుగోళ్లకు సంబంధించిన నిధులు దుర్వినియోగంచేసిన ఆరో పణలు రావడం, ఆపై చట్టపరమైన దర్యాప్తులు జరగడంతో సంస్థ ఆర్థికపరిస్థితి దెబ్బతిన్నది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇటీవల తన రూలింగ్‌లో ఎన్పీవీ దివాలా నిపుణులు, తాత్కాలిక పరిష్కార వృత్తినిపుణులు కూడా బ్లూస్మార్ట్ ఆపరేషన్లు తీసుకోవాలని ఆదేశించడంతో ఇపుడు కంపెనీ దివాలాప్రక్రియ వేగవంతం అయింది. అలాగే కంపెనీ ప్రమోటర్లు, యాజమాన్యం కూడా దివాలాప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని, దివాలా ప్రణాళిక పూర్తిగా ఖరారయ్యేంత వరకూ నిపుణులకు సహకరించాలని ఆదేశించింది. జాగ్గీ బ్రదర్స్ ఆధ్వర్యంలోబ్లూస్మార్ట్ మొబిలిటీ ఏర్పాటయింది. ఇదే కంపెనీ జెన్‌సోల్ ఇంజనీరింగ్‌ను కూడా ప్రమోట్‌చేసింది. ఒక పబ్లిక్ లిస్టెడ్ సోలార్ ఇంజనీరింగ్ సంస్థ అయిన బ్లూస్మార్ట్ దివాలాకు రావడం కూడా కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఎన్‌సిఎల్‌టీ బెంచ్‌కూడా జెన్సోల్ ఇంజనీరింగ్‌పై దివాలాప్రక్రియకు గత జూన్‌లోనే ఆమోదం తెలిపింది. జెన్సోల్‌కోసం పరిష్కార నిపుణుడిని కూడా నియమించారు. జెన్‌సోల్ ఇటీవలే ఢిల్లీ, ఎన్‌సిఆర్, బెంగళూరు నగరాల్లో సుమారు నాలుగువేల వాహనాలను లీజుప్రాతిపదికన నడుపుతోంది. వాటిని నెలవారీ అద్దెప్రాతిపదికన నామమాత్రపు బేస్‌ధరను చెల్లించేవిధంగా ఒప్పందం కింద వాహనాలు నడుపుతోంది. 2023లో బ్లూస్మార్ట్ మొబిలిటీ 15 కోట్లు నిధులు ఎన్సీడీలద్వారా సమీకరించింది. మార్చి 31నాటికి 64 లక్షల బకాయిలు ఉన్నాయి. ఏప్రిల్ 30వ తేదీనాటికి బకాయి చెల్లింపులు 63 లక్షలు కూడా చెల్లించలేకపోయింది. వివిధ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సుమారు రూ.100 కోట్ల నిధులను సమీకరించినట్లు తెలుస్తోంది. చెల్లింపుల్లో బ్లూస్మార్ట్ నుంచి వస్తున్న విపరీత జాప్యం, ఆర్థికపరమైన అడ్డంకులు, కార్పొరేట్ దివాలాకు దారితీసాయనే కార్పొరేట్ వర్గాల్లో చర్చనడుస్తోంది.

# మరింత వేగంగా ఐటీఆర్ రిఫండ్‌లు!

**న్యూఢిల్లీ, జూలై 29:** ఐటీ రిఫండ్‌లు వేగం పుంజుకొంటున్నాయి. దీంతో, ఐటీ రిటర్నులు దాఖలు చేసి రిఫండ్‌ల కోసం నెలలు, రోజుల తరబడి ఎదురుచూపులు ఇక గతమే. ఎందుకంటే ఇప్పుడు అత్యంత వేగంగా రిఫండ్‌లు జారీ అవుతున్నాయి. ఈ ఏడాది పలువురు పన్ను చెల్లింపుదారులు తాము ఐటీ రిటర్నులు ఫైల్ చేసిన కేవలం 4గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు పొందినట్లు చెబుతున్నారు. ఈ పరిణామం ఐటీఆర్ ప్రాసెసింగ్ విషయంలో పెను మార్పేనని చెప్పొచ్చు. 12ఏళ్ల క్రితం ఐటీ రిఫండ్‌లు పొందడానికి 90 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టేది. కానీ, ఇప్పుడు డిజిటల్ రంగంలో మార్పులతో ఐటీఆర్‌ల ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతం కావడంతో ఆ సమయం రోజుల నుంచి గంటలకు తగ్గతుండటం పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించే అంశం. నోయిడాకు చెందిన అరుణ్ ప్రకాశ్ అనే వ్యక్తి ఐటీశాఖ ఈఫైలింగ్ పోర్టల్‌లో ఫారం 1 ద్వారా తన రిటర్న్ దాఖలు చేసినకేవలం 4గంటల్లోనేరిఫండ్ పొందినట్లు వెల్లడించారు. నేను సాయంత్రం 5.30గంటల సమయంలో నా రిటర్న్ దాఖలు చేశా. అదేరోజు రాత్రి 9.02 గంటలకు రిఫండ్ నా బ్యాంకు ఖాతాలో జమ అయింది అని పేర్కొంటూ సంబంధిత సమయాన్ని సూచించేలా స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు. అలాగే, పన్నుల రంగంలో నిపుణుడు దీపక్ వర్మ మాట్లాడుతూ, తన క్లయింట్లలో చాలా మంది ఐటీఆర్ దాఖలు చేసిన అదేరోజు రిఫండ్ అందుకున్నట్లు చెప్పారు. ఇది ఐటీ శాఖ డిజిటల్ సామర్థ్యానికి గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. అయితే, ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారిలో ఎక్కువ మందికి ఇలా గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు వస్తున్నాయా, లేదా? అన్న అంశంపై మాత్రం సమాచారం లేదు.




# స్టాక్ సూచీలకు రియాల్టీ, ఫార్మా మద్దతు

**ముంబై, జూలై 29:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారాన్ని లాభాలతో ముగించాయి. వరుసగా మూడు రోజులుగా కొనసాగుతోన్న నష్టాలకు బ్రేక్ పడింది. రియాల్టీ, ఫార్మా రంగాలు సూచీలకు మద్దతుగా నిలిచాయి. ఉదయం 80,973.25 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ప్రారంభమై, ఇంట్రాడేలో 80,665కు పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 446పాయింట్లు పుంజుకొని 81,328 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ 140 పాయింట్ల లాభంతో 24,821 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 15 పైసలు తగ్గి రూ.86.82గా ఉంది. జియో ఫైనాన్షియల్, లార్సెన్ అండ్ టూబ్రో, రిలయన్స్, ఏసియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంకు, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, టైటాన్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఐటి, మెటల్, రియాల్టీ రంగాలపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించడం ఈ లాభాలకు కారణమైంది. మార్కెట్ అస్థిరతను అంచనా వేసే విఐఎక్స్ సూచి 2.9శాతం పడిపోయింది. యుఎస్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభం అవుతాయనే సంకేతాలు ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపించాయి.



# వాణిజ్యం

# రూ.2838 కోట్లకు 'లెన్స్‌కార్ట్' ఐపిఒ

**ముంబయి, జూలై 29:** ఐపిఒకు వస్తున్న లెన్స్‌కార్ట్ మొత్తం కంపెనీ విలువలను రూ.10,891 కోట్లుగా నిర్ధారించిన వ్యవస్థాపకుడు పియూష్ బన్సాల్ కంపెనీ ఐపిఒ ద్వారా 2150 కోట్ల నిధులను సమీకరించేందుకు నిర్ణయించారు. 13.22 కోట్ల వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్ పద్ధతిలో విక్రయించాలని నిర్ణయించారు. బన్సాల్ ఇతర ఇన్వెస్టర్ల మధ్య వాటాల బదలీ రూ.52 చొప్పున బదలీకి కూడా నిర్ణయం జరిగింది. ఆఫర్‌ఫర్‌సేల్ కింద ఈ బదలీ రూ.688 కోట్లు అని తేలింది. బన్సాల్‌తో పాటు ప్రస్తుత వ్యవస్థాపకులు వాటాల్లో మొత్తం 1.53 శాతం వాటాలు కూడా ఒఎఫ్‌ఎస్‌లో ఉంటాయి. కంపెనీ మొత్తం విలువల్లో ఇష్యూ వాటా 26శాతంగా ఉంటుందని అంచనా. బన్సాల్‌కు వాటా విక్రేతలు రూ.52 చొప్పున సెబీవద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుకు ముందే బదలీ చేసారు. ఈ మొత్తమే రూ.688 కోట్లుగా ఉంది. దీనితో మొత్తం ఐపిఒ సొమ్ము రూ.2838 కోట్లు అని అంచనా వేసారు. గడచిన మూడేళ్లగా లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 2943 కోట్లు ఈక్విటీనిధులను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. ప్రాధాన్యత షేర్ల బదలాయింపు, ఐపిఒ వంటి వాటికి ముందే ప్రమోటర్ల గ్రూపునకు 20శాతం వాటాలునానయి. ఈ వాటాల బదలీ అనం తరం ఐపిఒ తర్వాత ప్రమోటర్ల వాటా కంపెనీలో 7.83 శాతానికి తగ్గుతుంది. కంపెనీ 82.81 కోట్ల ప్రాధాన్యత వాటాలను 85.84 ఈక్విటీ వాటాలుగా బదలాయించనున్నది. ఐపిఒ ద్వారా వచ్చిన నిధుల్లో 272.62 కోట్లనిధులను కంపెనీ సొంత స్టోర్లకు కేటాయిస్తోంది. లీజు చెల్లింపులకు 591.44కోట్లు, టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాకు 213.37 కోట్లు, రూ.320 కోట్లు




బ్రాండ్ మార్కెట్‌కు నిర్దేశించింది. లెన్స్‌కార్ట్ రాబడులు 6652.5 కోట్లుగా ఉన్నాయి. తొలిత్రైమాసికం లో 297.34 కోట్లు ఆర్జించింది. గతసంవత్సర లాభాలకంటే పెరిగాయి.

# 32% పెరిగిన బ్యాంకు ఆఫ్ ఇండియా లాభం

**ముంబయి,జూలై 29:** ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా నికరలాభాలు తొలి త్రైమాసికంలో 32శాతం పెరిగి 2252.1 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 1702.7 కోట్లు మాత్రమే వచ్చిన లాభాలు ఈ ఏడాది 32శాతం పెరిగాయి. నికరవడ్డీ ఆదాయం మాత్రం ఈ త్రైమాసికంలో 3శాతం తగ్గి 60681.1 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికరవడీ ఆదాయం 6275.8 కోట్లు ఆర్జించినసంగతి తెలిసిందే. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 3.27శాతం నుంచి త్రైమాసికం వారీగా చూస్తే తగ్గాయి. 2.92శాతంగా నిలిచాయి. నికర నిరర్ధక ఆస్తులపరంగా చూస్తే 0.82శాతం నుంచి 0.75శాతానికి దిగి వచ్చాయి. నిర్వహణ లాభాలు 9శాతం పెరిగి 4009 కోట్లకు చేరాయి. కేటాయింపులు కూడా 15.2శాతంగా ఉన్నాయి. 1293 కోట్ల నుంచి 1096 కోట్లకు తగ్గించింది. కేటాయింపుల్ల క్షీణత 18శాతంగా ఉంది. 1338 కోట్లనుంచి 1096 కోట్లకు చేరడం వల్ల బ్యాంకు ఆర్థికపరిపుష్టిపెరిగింది. స్థూల నిరర్ధక ఆస్తులు 19,640.2 కోట్లకు చేరాయి. నిరక నిరర్ధక ఆస్తులు కూడా 5358.49 కోట్ల నుంచి 4949.89 కోట్లకు తగ్గి బ్యాంకు ఆస్తి అప్పులపట్టీని పటిష్టం చేసింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14